www.bharathasakthi.com

భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 04 | సోమవారం,జూన్ 8 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు

**- మిత్రదేశాల రక్షణకు అమెరికా వ్యూహాలు!**

4లో..



### రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2లో..

# డీజిల్ దండా..

- ట్రై మున్సిపల్ కార్పొరేషన్‌లలో గోలమాల్
- రూ. కోట్ల ప్రజాధనం లూటీ
- ఏఈల అవతారమెత్తిన ఫోర్‌మెన్
- ఆన్‌లైన్ కూపన్లపై అక్రమ సంతకాలు.
- సమగ్ర విచారణకు 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' డిమాండ్
- ట్రై మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ జేయేష్ రంజన్ ఐఏఎస్ దృష్టి సారించాలి.

కమిషనర్ ఆదేశాలను తుంగలో తొక్కి, ఏఈల అవతారమెత్తిన ఫోర్‌మెన్‌లు నకిలీ డీజిల్ కూపన్లపై అక్రమ సంతకాలతో భారీ ఇంధన దందాకు తెరలేపారు. వాహనాల జీపీఎస్ డేటాకు, డీజిల్ వినియోగానికి పొంతనే లేదు. ఈ దందాపై 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్' తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఏసీబీ లేదా సీఐడీతో సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

2లో..




### చమురు మార్కెట్‌లో

## భారత్ విశ్వరూపం!

- రాబోయే దశాబ్దపు ప్రపంచ డిమాండ్‌లో సగభాగం మనదే.. రష్యా చమురు దిగ్గజం రోజ్‌నెఫ్ట్ అంచనా



**న్యూఢిల్లీ జూన్ 7:భారత శక్తి,** అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో భారత్ సరికొత్త శకాన్ని లిఖించబోతోంది. రాబోయే పదేళ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెరిగే ముడిచమురు డిమాండ్‌లో సింహభాగం భారత్ నుంచే ఉండబోతోందని అంతర్జాతీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో రానున్న దశాబ్దంలో అదనంగా పెరిగే చమురు అవసరాలలో సగం వాటా ఒక్క భారతదేశానిదేనని రష్యాకు చెందిన ప్రముఖ చమురు సంస్థ 'రోజ్‌నెఫ్ట్' ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఇగోర్ సెచిన్ ప్రకటించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ

4లో..




# 'ది నానో' అక్రమ విద్యా మాఫియా!

- జిహెచ్ఎంసి సర్కిల్ 16 బడంగ్‌పేట్‌లో 'దనానో' పేరుతో అనుమతులు లేని అక్రమ సామ్రాజ్యం!
- మున్సిపల్ పర్మిషన్ లేదు.. ఫైర్ సేఫ్టీ నిల్.. ఇంటర్ బోర్డు గుర్తింపే లేదు!
- 400 గజాల ఇరుకు గదుల్లో 300 మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం! డీఐఓ వెంకటయ్య నాయక్ ఎక్కడ..!
- ప్రముఖ బ్రాండ్ పేరుతో బోర్డు తిప్పేసి.. లక్షల ఫీజులు దండుకుంటున్న వైనం!
- ఇంత అవినీతి జరుగుతున్నా కన్నెత్తి చూడని ఇంటర్ బోర్డు అధికారులు..
- అక్రమార్కులకు అండగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్?
- కమిషన్ల కక్కుర్తిలో కళ్లు మూసుకున్న అధికార యంత్రాంగంపై స్థానికుల ఆగ్రహం!
- మాజీ విద్యా శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఈ అవినీతిని అంతం అందిస్తారా..?

**అక్షరాల వెనుక అక్రమ దందా.. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన సంస్థే నిబంధనలను నడిరోడ్డుపై ఖూనీ చేస్తూ అక్రమ విద్యా మాఫియాగా మారింది! బడంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలో, ఎలాంటి మున్సిపల్ పర్మిషన్, ఫైర్ సేఫ్టీ, ఇంటర్ బోర్డు గుర్తింపు లేని 'ది నానో' జూనియర్ కాలేజ్ 300 మంది విద్యార్థుల జీవితాలను మృత్యుకూపంలోకి నెడుతోంది. ప్రముఖ బ్రాండ్ పేరును కాపీ కొడుతూ, కేవలం 400 గజాల ఇరుకు గదుల్లో లక్షల ఫీజులు దండుకుంటోన్న ఈ ఘోర అక్రమాలపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్ మామూళ్ల మత్తులో కళ్లు మూసుకోవడం సిగ్గుచేటు. విద్యార్థుల భవిష్యత్తు అంధకారం కాకముందే ఉన్నతాధికారులు, ఇంటర్ బోర్డు తక్షణమే స్పందించి ఈ అక్రమ క్యాంపస్‌ను సీజ్ చేయాలి!**

**బడంగ్‌పేట్, జూన్ 7 (భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి):** జీహెచ్ఎంసీ మహానగరం నడిబొడ్డున, బడంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలోని నాదర్గుల్ ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా "ది నానో" కాలేజీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. అక్షరాల వెనుక అక్రమ వ్యాపారం.. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి సాగుతున్న ఒక నగ్న సత్యం.. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెలుగుచూసింది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన సంస్థే నిబంధనలను నడిరోడ్డుపై ఖూనీ చేస్తూ అక్రమ దందాకు తెరలేపింది.నాదర్గుల్ విలేజ్, ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీకి సరిగ్గా ఆపోజిట్‌గా, విజయలక్ష్మి నగర్ కాలనీలోని పూజా జువెలర్స్ పక్కన వెలిసిన 'ది నానో జూనియర్ కాలేజ్' (బాయ్స్ & గర్ల్స్ క్యాంపస్) ఇప్పుడు విద్యార్థుల పాలిట మృత్యుకూపంగా, తల్లిదండ్రుల పాలిట మోసపూరిత కేంద్రంగా మారింది. కనీసం మున్సిపల్ పర్మిషన్ లేదు.. ప్రమాదం వస్తే ప్రాణాలు కాపాడే ఫైర్ సేఫ్టీ లేదు.. అసలు ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపే లేదు! అయినప్పటికీ దర్జాగా బోర్డు తగిలించి, రంగుల ప్రకటనలతో ఏకంగా 300 మంది విద్యార్థులను చేర్చుకుని లక్షల రూపాయలు గుంజేసింది ఈ అక్రమ విద్యా మాఫియా!

#### నాడు 'కోచింగ్'.. నేడు 'కాలేజ్'.. అంతా దొంగ దందా!

కేవలం 400 గజాల ఇరుకైన ప్లాట్ నెంబర్ 30 (ఆర్‌సీఐ రోడ్, బడంగ్‌పేట్ - అల్మాస్‌గూడ రోడ్) లో గర్ల్స్ క్యాంపస్, అదేవిధంగా ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీ ఎదురు సందులో, విజయలక్ష్మి నగర్ కాలనీ (నాదర్గుల్ విలేజ్, బాలాపూర్ మండలం) పూజా జువెలర్స్ పక్కన బాయ్స్ క్యాంపస్ వెలిశాయి. ఈ భవనాల్లో క్లాస్ రూములను అగ్గిపెట్టెల్లా ఇరికించారు. ప్రముఖ

2లో..




### అంతర్జాతీయ స్థాయిలో

## సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణం

- 240 ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మాణం.
- సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన
- రెండేళ్లలో దీన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తాం: ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 7:** హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో 1.34 కోట్ల జనాభాతో వేగంగా విస్తరించిన నేపథ్యంలో ఈ ప్రాంత అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్, కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌ను ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు , దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పండ్ల మార్కెట్‌తో పాటు సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలకు ఏం కావాలన్నా ఇక్కడికి వస్తే అన్నీ అందుబాటులో ఉండే విధంగా 240 ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అత్యాధునిక వసతులతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ఈ మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు. 30, 40 ఏండ్ల కిందట పండ్లు, కూరగాయల పంటల సాగుతో రంగారెడ్డి జిల్లా కళకళలాడిందని గుర్తుచేశారు. రంగారెడ్డి జిల్లా రైతులు కష్టపడి హైదరాబాద్ ప్రజలకు పండ్లు, కూరగాయలు, పాలు సరఫరా చేసేవారని,

2లో..

# రోగానికి మందా?

## రోగాన్ని పెంచే మందా?

- ఇష్టారాజ్యంగా మందుల విక్రయాలు
- ప్రిస్క్రిప్షన్ , బిల్లుల లేకుండా అమ్మకాలు
- మెడికల్ షాపుల యజమానుల ఇష్టారాజ్యం
- కాగితాల్లో ఒకరు.. క్షేత్రస్థాయిలో మరొకరు!




మెడికల్ షాప్ నిర్వహించేందుకు బీఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులు. షాపులో అనుమతుల కోసం సంబంధిత ఫార్మాసిస్టుల సర్టిఫికెట్లతో పాటు వ్యక్తిగత గుర్తింపు కార్డు,చిరునామా వంటి వివరాలతో డ్రగ్ ఇన్స్పెక్టర్కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత అధికారులు పరిశీలించి అనుమతులు ఇచ్చిన తర్వాత షాపులు ప్రారంభించాల్సి ఉంటుంది.కానీ అనుమతుల సమయంలో ఫార్మసిస్టులు ధ్రువీకరణ పత్రాలను పెట్టి ,షాప్ ప్రారంభించిన తర్వాత ఫార్మసిస్టులు లేకుండానే కొందరు మందుల విక్రయిస్తున్నారు. ఫార్మసిస్టుల పర్యవేక్షణలో ఉండాల్సి ఉండగా ,అదేం లేకుండానే మందుల విక్రయిస్తున్నారు కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు వారి ప్రాథమిక చికిత్స కేంద్రం వద్ద నే ఇతరుల పేరిట మెడికల్ షాప్ లు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు.

2లో..

### కోర్టును తప్పుదోవ పట్టించి..

## 'సౌర' ముసుగులో అక్రమ నిర్మాణం!

- ఎల్బీనగర్ చింతలకుంట 'హై ఫై ప్లాజా'లో బరితెగింపు!
- సోలార్ ప్యానెళ్ల పేరిట అదనపు అంతస్తుల నిర్మాణం?
- మున్సిపల్ నోటీసులు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు బేఖాతరు!
- 'భారత శక్తి' సంచలన నిజాల వెల్లడి!




**హైదరాబాద్ జూన్ 7(రంగారెడ్డి జిల్లా బ్యూరో):** చట్టాన్ని గౌరవించాల్సిన వారే.. చట్టంలోని లొసుగులను వాడుకుంటూ, దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని సైతం తప్పుదోవ పట్టిస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న ఉదంతం ఎల్.బి. నగర్ పరిధిలో వెలుగుచూసింది. పర్యావరణ పరిరక్షణ,

4లో..

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..

- ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు



జనసేన పార్టీలో ప్రక్షాళన దిశగా అధినేత పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు.నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి

2లో..

## ప్రజాస్వామ్య పాఠాలు మీ ముఖ్యమంత్రికే నేర్పించండి!

- రాహుల్ గాంధీకి బీ.ఆర్.ఎస్ నేత దాసోజు శ్రవణ్ సూటి ప్రశ్న
- హిట్లర్ స్ఫూర్తి వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని ఎగతాళి చేయడమే!
- చెరువుల రక్షణ ముసుగులో పేదల ఇళ్ల కూల్చివేత నిరంకుశత్వం



2లో..

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు."మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల

2లో..

# డీజిల్ దందా..

**హైదరాబాద్ జూన్ 7 (భారత శక్తి ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్..మల్కాజ్గిరి.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లలో ఇంధన సరఫరా పేరుతో భారీ కుంభకోణం నడుస్తోంది. మున్సిపల్ కమిషనర్ లు జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులను ముమ్మాటికీ తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యమే అవుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.








బేఖాతరు చేస్తూ, కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై రూ.కోట్ల ప్రభుత్వ ధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' సంస్థ ఈ వ్యవహారంపై ఘాటైన ప్రశ్నలతో కూడిన బహిరంగ లేఖను విడుదల చేయడంతో ట్రై మున్సిపల్ కార్పొరేషన్ సర్కిళ్లలో కలకలం రేగింది.

## నిబంధనల ఉల్లంఘన.. అప్రకటిత 'అధికారం'!

జీహెచ్ఎంసీ వాహనాలకు ఇంధనాన్ని కేటాయించే ఆన్‌లైన్ డీజిల్ కూపన్లపై కేవలం ,సహాయక ఇంజనీర్లు (అసిస్టెంట్ ఇంజనీర్-ఏ.ఇ) మరియు,విభాగపు ఇంజనీర్లు (డివిజనల్ ఇంజనీర్స్) మాత్రమే సంతకాలు చేయాలని కమిషనర్ గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అయితే, క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. వర్క్‌షాప్‌లలో పనిచేసే లిఫోర్‌మెన్‌లు (ఖీశీతీవఎవఅ)లి ఏ విధమైన అధికారిక ఉత్తర్వులు లేకుండానే 'తాత్కాలిక సహాయక/విభాగపు ఇంజనీర్లు' (ూవ్‌ఱఅస్త్ర ూఖు/ఱఖు) గా చలామణీ అవుతున్నారు. ఆన్‌లైన్ ఇంధన కూపన్లను యధేచ్ఛగా ఆమోదిస్తూ సంతకాలు పెడుతున్నారు. అసలు వీరికి ఈ అధికారాన్ని ఎవరు కల్పించారు? దీని వెనుక ఏవైనా లిఖితపూర్వక ఉత్తర్వులు ఉన్నాయా? లేక ఉన్నతాధికారుల అండదండలతోనే ఈ సమాంతర వ్యవస్థ నడుస్తోందా? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. కమిషనర్ ఆదేశాలను ఉల్లంఘించడం

## మూడేళ్ల లెక్కలు తేలాల్సిందే!

గత మూడేళ్లుగా ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కాలంలో ఫోర్‌మెన్‌లు డిజిటల్ లేదా మాన్యువల్ పద్ధతిలో ఆమోదించిన ఇంధన కూపన్ల సంఖ్య ఎంత? వాటి ద్వారా విడుదలైన డీజిల్ పరిమాణం, దాని విలువ ఎంత? అనే అంశాలపై ఇప్పటివరకు ఎలాంటి అంతర్గత ఆడిట్ జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## శాస్త్రీయ మరియు సాంకేతిక ఆధారాల అవశ్యకత:

జీహెచ్ఎంసీ, ఎం.ఎం.సి, సి.ఎం.సిలోని ప్రతి వాహనానికి లాగ్‌బుక్ (ూశీస్త్ర దీశీశీవ) నిర్వహణ, ఇంధన వినియోగం మరియు వాహనం తిరిగిన దూరానికి (ఖఱశ్రీశీఎవ్‌వతీ-శీ-ఖీబవశ్రీ =ఫ్‌ఱశీ) ఖచ్చితమైన సమతుల్యత ఉండాలి. ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిశీలనలో వాహనాల జిపిఎస్ (G్పూ) డేటాకు, ఆన్‌లైన్ కూపన్ల ద్వారా జారీ అయిన డీజిల్ పరిమాణానికి ఎక్కడా పొంతన కుదరడం లేదని ప్రాథమిక ఆధారాలు చెపుతున్నాయి.

## నకిలీ కూపన్లు.. ఫోర్జరీ ముఠా?

ఈ వ్యవహారంలో కేవలం అధికార దుర్వినియోగమే కాకుండా, పెద్ద ఎత్తున నకిలీ కూపన్ల సృష్టి, సంతకాల ఫోర్జరీ వంటి క్రిమినల్ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాహనాలు షెడ్డుకే పరిమితమైనా, కాగితాల్లో మాత్రం వందల లీటర్ల డీజిల్ వినియోగించినట్లు చూపిస్తూ నిధులు డ్రా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ముమ్మాటికీ ప్రజాధనాన్ని కొల్లగొట్టడమే.

## విజిలెన్స్ విచారణకు డిమాండ్

ఈ భారీ ఇంధన కుంభకోణంపై జీహెచ్ఎంసీ కమిషనర్ తక్షణమే స్పందించాలని 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' డిమాండ్ చేసింది. దీనిపై ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడంతో పాటు, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ విభాగం (జ×ఱ) లేదా అవినీతి నిరోధక శాఖ (ూజదీ) కు విచారణను అప్పగించాలని కోరింది.

బాధ్యులైన అధికారుల నుండి నష్టాన్ని రికవరీ చేయాలని, డీజిల్ కూపన్ల జారీకి సంబంధించిన పూర్తి డేటాను పారదర్శకంగా ప్రజల ముందు ఉంచాలని పౌర సమాజం కోరుతోంది. కమిషనర్ ఆదేశాల ఉల్లంఘనపై అంతర్గత విచారణ జరిపి, ఈ 'డీజిల్ మాఫియా' వెనుక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణం



రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు ఏది కొనాలన్నా పక్క రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయని అన్నారు. రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి వంటి కేవలం నాలుగైదు పంటలను మాత్రమే పండించడం వల్ల ప్రజలపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటున్నాయని, అందుకు ప్రత్యామ్నాయంగా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ప్రత్యామ్నాయ పంటలను పండించాలని కోరారు. స్థానిక ప్రజల సహకారంతో ప్రభుత్వం ధైర్యంగా ఈ పండ్ల మార్కెట్‌ను ప్రారంభించింది. వచ్చే రెండేళ్లలో దీన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తాం. ఈ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్‌లో విడుదల చేస్తాం. వచ్చే డిసెంబర్‌లో పనులు ప్రారంభించే విధంగా శ్రమించాలి అని మంత్రులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో కాలుష్య కారక పరిశ్రమలు తెస్తామంటే, ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయని, అందుకే ఆ ప్రాంతంలో ఒక మహానగరాన్ని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు పొందిన ఫార్చ్యూన్ 500 కంపెనీలను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. "రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ఏటా 15 నుంచి 16 వేల కోట్ల ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ ఎవరైనా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా ఉండదు. ఇలాంటి దుస్థితి ఉండకూడదన్న ఉద్దేశంతోనే అత్యాధునిక వసతులతో ఈ పక్కనే సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా శంకుస్థాపన చేశాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.హైదరాబాద్ నగరంలో 39 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉంటే వాటిని 12 క్లస్టర్లుగా అత్యంత అధునాతన సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించుకుంటున్నామని తెలిపారు. "అంతర్జాతీయ నగరమని మనకు మనం గొప్పులు చెప్పుకుంటే సరిపోదు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసుకున్నప్పుడే ఆ గుర్తింపు వస్తుంది. అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో విస్తరణ వంటి పనులను పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు. కోహెడ పండ్ల మార్కెట్ నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి జరిగిందంటే రాష్ట్రంలో అభివృద్ధి జరిగినట్టేనని, రైతును రాజును చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.

# రోగానికి మందా? రోగాన్ని పెంచే మందా?

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 7 (భారతశక్తి) : జిల్లాలోని మెడికల్ దుకాణాలు నిబంధనలు ఉల్లంఘిస్తున్న, వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రజల ఆరోగ్య సమస్య ఏదైనా సరే వెంటనే మెడికల్ షాపులకు వెళ్లి ,సమస్యలు చెప్పి నిర్వాహకులు ఇచ్చిన మాత్రలు తెచ్చుకుంటారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తో సంబంధం లేకుండా యాంటీబయాటిక్స్ మందులు సైతం అందిస్తున్నారు. జబ్బు నయం కాని పక్షంలో ఆసుపత్రి వెళ్లి వైద్యులను సంప్రదిస్తున్నారు.మెడికల్ దుకాణాల్లో ఇచ్చే మందులతో అప్పటికప్పుడు జబ్బు తగ్గిన ,దీర్ఘకాలికంగా దుష్పరిణామాలు ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా షెడ్యూల్ హెచ్ , హెచ్ వన్ మందులను అమ్మేందుకు వీలు లేదు ,ఆ మేరకు రికార్డులు కూడా నిర్వహించి, బిల్లుల నిర్వహణ కూడా ఉండాలి.గడువు ముగిసిన మందులను షాపుల్లో ఉంచడం,అమ్మడం చేయవద్దు.జిల్లాలో దాదాపు 600 పైగా మెడికల్ షాపులు నిర్వహిస్తుండగా, ఇందులో చాలా షాపుల్లో నిబంధనలు పాటించడం లేదని తెలుస్తుంది .ఔషధ నియంత్రణ వాటి నాణ్యత ప్రమాణాలను డ్రగ్ ఇన్స్పెక్టర్లే చూడాల్సి ఉంటుంది.

## ధరల బాదుడు..... ఇష్టారీతిన అమ్మకాలు..

జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల్లో ఎమ్మార్పీ పై 20 నుంచి 30 శాతం వరకు తగ్గింపు ఇస్తామని ప్రకటిస్తుండడంతో వైద్యులు రాసిన పిస్క్రిప్షన్ తో ఆయా మెడికల్ షాపులకు వెళ్తున్నారు. నిర్వాహకులకు డాక్టర్లు రాసే మందులు అర్థం కాకున్నా, వారికి అర్థమైన వాటినీ అందిస్తున్నారు.దీంతో వైద్యులు సూచించే మందులు ఒకటైతే వారిచ్చే మందులు వేరేగా ఉంటున్నాయి. కొన్ని షాపుల్లో శాంపిల్స్ గా ఇచ్చిన మందులను అమాయకులకు కట్టబెడుతున్నట్లుగా తెలుస్తుంది.శాంపిల్ ,నాణ్యతలేని మందులను రోగులకు అంటగడతూ అందినకాడికి దండుకుంటున్నట్లు సమాచారం. మందులు కొనుగోలు చేస్తే ఎంత అవుతుందో లెక్కవేసి డబ్బులు తీసుకుంటుండగా ,ఏ మందు ఎంత ధరకు అమ్ముతారు అనే విషయాన్ని కొనుగోలుదారులకు చెప్పడం లేదు. ఉన్న మందులకు బిల్లులు కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నారు .కొన్ని మెడికల్ దుకాణాల్లో మాత్రమే మందుల వివరాలుతో కూడిన బిల్లులు ఇస్తున్నారు. డాక్టర్లు సూచనల మేరకు యాంటీబయోటిక్ మందులను అమ్మాల్సి ఉండగా ,అలాంటివేం పట్టించుకోకుండానే ప్రజలకు మందులు అమ్ముతున్నారు. యాంటీబయోటిక్ మందులను ఇష్టారీతిన వాడితే సైడ్ ఎఫెక్ట్స్ తో కొత్తజబులో బారిన పడే ప్రమాదం ఉన్న దుకాణదారులు అవేం పట్టించుకోవడం లేదనీ, చాలా దుకాణాలలో రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్‌లు లేకుండా, కనీస అవగాహన లేని ,అర్హత లేని వ్యక్తులతో మందులు ఇప్పించడం జరుగుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# 'ది నానో' అక్రమ విద్యా మాఫియా!

THE NANO JUNIOR COLLEGE




విద్యాసంస్థ 'నానో' పేరును కాపీ కొడుతూ, ఇక్కడ "ది నానో" పేరుతో లోపాయకారీగా నడుపుతున్న ఈ దొంగ కాలేజీకి అసలు అస్తిత్వమే లేదు. చట్టబద్ధంగా ఒక్కటంటే ఒక్క అనుమతి పత్రం కూడా యాజమాన్యం వద్ద లేకపోవడం గమనార్హం. ఖూనీ అయిన మున్సిపల్ చట్టాలు: కమర్షియల్ విద్యాసంస్థలు నడపాలంటే ఉండాల్సిన బిల్డింగ్ మాస్టర్ ప్లాన్ నిబంధనలను (Building Master Plan Compliances) పూర్తిగా తుంగలో తొక్కారు. మున్సిపాలిటీ నుండి ఎలాంటి కమర్షియల్ భవన అనుమతులు లేకుండానే ఈ నిర్మాణం సాగింది.భయం గొల్పుతున్న ఇరుకు గదులు -- సున్నా ఫైర్ సేఫ్టీ:రేపు పొద్దున ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వందలాది మంది విద్యార్థులు బయటకు రావడానికి కనీస నడవా (కారిడార్) స్థలం కూడా లేదు. ఫైర్ ఎన్‌ఓసీ (Fire NOC) ఊసే లేదు. విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టి క్లాసులు నడుపుతున్నారు. లిఆటస్థలం లేదు.. అనుబంధ గుర్తింపు లేదు: ఇంటర్ బోర్డు (TS BIE) నిబంధనల ప్రకారం జూనియర్ కాలేజీకి ఉండాల్సిన కనీస ఆటస్థలం (Playground) ఇక్కడ లేదు. అసలు ఇంటర్ బోర్డు ఈ క్యాంపస్‌కు అఫిలియేషనే ఇవ్వలేదు. గుర్తింపు లేని కాలేజీలో చదివితే రేపు విద్యార్థుల సర్టిఫికెట్లకు విలువేముంటుందని తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

## మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య.. టౌన్ ప్లానింగ్ దినేష్.. మీ సమాధానం ఏంటి?

ఈ ఘోర అక్రమాలపై స్థానిక ప్రజలు, బాధితులు బడంగ్‌పేట్ సర్కిల్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు, టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్‌కు సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదులు చేశారు. కానీ, సదరు అధికారులు అక్రమార్కులకు సింహాసనం వేసి కూర్చోబెడుతున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ముడుపుల మత్తులో జోగుతూ, అక్రమ కట్టడాల యాజమాన్యానికి పరోక్షంగా సపోర్ట్ చేస్తున్న ఈ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల అండ చూసుకునే కాలేజీ యాజమాన్యం ఇంతలా రెచ్చిపోతోందని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

## నిబంధనల ఉల్లంఘన - చట్టపరమైన చర్యలు

అనుమతులు లేని విద్యాసంస్థల అక్రమాలపై కఠిన చట్టాలను ప్రయోగించాల్సిన అవసరం ఉంది. అందించిన సమాచారం ప్రకారం బాధ్యులపై కింది సెక్షన్ల కింద చర్యలు తీసుకోవడానికి పూర్తి శాసనపరమైన ఆధారాలు ఉన్నాయి:

తెలంగాణ విద్యా చట్టం (1982) లోని సెక్షన్ 20, 21: దీని ప్రకారం గుర్తింపు లేని విద్యాసంస్థలను సీజ్ చేసి, యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించవచ్చు.

మున్సిపల్ కార్పొరేషన్ చట్టం (2019): భవన నిర్మాణ ఉల్లంఘనలపై ఈ చట్టం కింద తక్షణమే కూల్చివేత చర్యలు చేపట్టవచ్చు.

"తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం (1999) సెక్షన్ 13, 31: ఫైర్ ఎన్‌ఓసీ (Fire NOC) లేని భవనాలపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయవచ్చు.

"భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 318, 61: తప్పుడు ప్రకటనలతో తల్లిదండ్రులను మోసం చేసినందుకు క్రిమినల్ చీటింగ్, కుట్ర కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించవచ్చు.

'స్థానిక ప్రజల' డిమాండ్: ఇంటర్ బోర్డు, పోలీస్ శాఖ తక్షణమే రంగంలోకి దిగాలి!

అడ్మిషన్ల పేరుతో ఇప్పటికే అందినకాడికి దండుకున్న ఈ అక్రమ కాలేజీపై మున్సిపల్ ఉన్నతాధికారులు, ఇంటర్మీడియట్ బోర్డు మరియు పోలీస్ శాఖ తక్షణమే క్రిమినల్ యాక్షన్ ప్రారంభించాలి. 300 మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం కాకముందే ఈ 'ది నానో' అక్రమ క్యాంపస్‌ను సీజ్ చేయాలి. విద్యార్థులను ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఇతర కాలేజీల్లో సర్దుబాటు చేయాలి.అలాగే అక్రమార్కులకు సపోర్ట్ చేసిన బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్‌లపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి సస్పెండ్ చేయాలని 'భారత శక్తి' డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల ప్రాణాలతో ఆడుకునే ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు!

**మరిన్ని ఆధారాలతో రేపటి కథనంలో..!**

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..

వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు."క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని పవన్ వివరించారు. కొద్ది రోజుల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే తరహా చర్యను ఇప్పుడు నెల్లూరు జిల్లా విషయంలోనూ తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో జిల్లా సమన్వయ బాధ్యతలు చూస్తున్న వారితో సహా కమిటీల్లోని సభ్యులందరూ తమ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లయింది. కొత్త కమిటీని నియమించేంత వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తామని జనసేన స్పష్టం చేసింది.

# రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

# రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు.దఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రజాస్వామ్య పాఠాలు మీ ముఖ్యమంత్రికే నేర్పించండి!

**భారత శక్తి - హైదరాబాద్:** "ప్రపంచానికి 'రాజ్యాంగం వర్ధిల్లాలి' అంటూ ఉపన్యాసాలు ఇచ్చే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. ముందు తన సొంత ముఖ్యమంత్రికి ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలను నేర్పించాలి" అని తెలంగాణ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకుడు దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జర్మనీ నియంత హిట్లర్ తనకు స్ఫూర్తి అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హిట్లర్ సిద్ధాంతాలను అనుకరిస్తూ తెలంగాణలో 'చెరువులు, పర్యావరణ పరిరక్షణ సంస్థ' (హైడ్రా) పేరుతో నివాస గృహాలను అక్రమంగా కూల్చివేయడం నిరంకుశత్వానికి, అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ చర్యలు భారత రాజ్యాంగాన్ని పూర్తిగా ఎగతాళి చేయడమేనని మండిపడ్డారు.

## కాంగ్రెస్ విధానమా? రేవంత్ సొంత ఫ్రాంచైజీనా?

ఈ దౌర్జన్యపూరిత హిట్లర్ సిద్ధాంతం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సరికొత్త అధికారిక విధానమా? లేక రేవంత్ రెడ్డి సొంతంగా నడుపుతున్న ప్రత్యేక కాంగ్రెస్ అనుబంధ విభాగపు భావజాలమా? అని దాసోజు శ్రవణ్ అనుమానం వ్యక్తం చేశారు."ప్రజాస్వామ్యం అంటే ప్రజల జీవితాలను నాశనం చేయడం, వారి ఆస్తులను నిర్మూలించడం కాదు. మానవ హక్కులను కాపాడటం, ప్రతి ఒక్కరూ గౌరవం, స్వేచ్ఛ, సోదరభావం, న్యాయంతో 'బతుకు.. బతకనివ్వు' అనే పద్ధతిలో జీవించేలా చూడటమే నిజమైన ప్రజాస్వామ్యం" అని ఆయన స్పష్టం చేశారు.

## నియంత నుంచి ప్రేరణ పొందడం సిగ్గుచేటు!

దశాబ్దాల క్రితమే హిట్లర్ క్రూరత్వాన్ని ప్రపంచం తిరస్కరించిందని దాసోజు శ్రవణ్ గుర్తుచేశారు. అయినప్పటికీ, రేవంత్ రెడ్డి అహంకారంతో ఎంతగా కళ్లు మూసుకుపోయారంటే.. పేదల ఇళ్లను మట్టిపెకల్చే యంత్రాలతో (బుల్డోజర్లతో) కూల్చివేయడానికి ఒక నియంతను ప్రేరణగా తీసుకోవడం దారుణమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అవలంబిస్తున్న ఈ విలువల వ్యవస్థ అత్యంత అవమానకరమైనదని, సిగ్గుచేటైనదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని, తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## పొంచి ఉన్న నీటి ముప్పు

ఈ జీవికైనా సరే పీల్చేగాలి తర్వాత తాగే నీరు అత్యంత ముఖ్యం. అందువల్లే నీరు ఉన్నచోటే ఈ భూమండలం మీద సంస్కృతులు ఏర్పడ్డాయి. నగరాలు నిర్మాణమయ్యాయి. జీవజాతులు అభివృద్ధి చెందాయి. నీరు లేని చోట ఇప్పటికీ నిర్మానుష్యమైన వాతావరణం కనిపిస్తూ ఉంటుంది. అందువల్లే జలాన్ని జగతికి బలం అని పిలుస్తుంటారుఈ భూమండలంలో సముద్రాలు ఎక్కువగా ఉంటాయి. చాలా తక్కువ శాతం లో తాగునీటి వనరులు అందుబాటులో ఉంటాయి. తాగునీటిని సక్రమంగా వినియోగించుకుంటే ఇబ్బందులు ఉండవు. అలా కాకుండా ఇష్టానుసారంగా వాడితే ఇబ్బందులు ఎదురవుతుంటాయి. నీటిని విచ్చలవిడిగా వాడటం.. జల వనరులను పరిరక్షించుకోకపోవడంతో ఈ ప్రపంచంలో చాలామంది తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. పైగా అభివృద్ధి పేరుతో అడవులను నాశనం చేయడంవల్ల వర్షాలు అంతగా కురవడం లేదు. పైగా కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడంతో భూమిలోకి నీరు ఇంకడం పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్లే నీటి కొరత తీవ్రంగా ఉంటున్నది.మనదేశంలో కూడా నీటి కొరతతో ఇబ్బంది పడే రాష్ట్రాలు చాలానే ఉన్నాయి. ఆమధ్య మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి ప్రత్యేక రైలు భోగిలలో నీటిని తరలించారు. సైనికుల పహారా మధ్య నీటిని సరఫరా చేశారు. దీనినిబట్టి నీటి కొరత ఏర్పడితే జనజీవనం ఏ స్థాయిలో అవస్థ పడుతుందో ఇది కళ్లకు కట్టింది. ఇప్పుడు ఇటువంటి కష్టాలను మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్నారు. మధ్యప్రదేశ్ పూర్తిగా అటవీ రాష్ట్రం. ఇక్కడ చాలా గ్రామాలు దూరం గా ఉంటాయి. ఈ గ్రామాలలో ప్రస్తుతం తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి.మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కార్గోనే జిల్లాలోని భగవాన్య గ్రామపంచాయతీ పరిధిలోని సర్బాద్ అనే గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ తాగునీటి కోసం ప్రజలు నరకం చూస్తున్నారు. సర్బాద్ గ్రామంలో తాగునీటి కోసం బాలికలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో వారు నీటిని సేకరిస్తున్నారు. బావిలో కనీసం తాడు కూడా లేదు. గుడ్డలను తాడుగా మార్చుకొని.. ఆ బాలికలు బావిలో నీటిని తీసుకొని పైకి ఎక్కుతున్నారు. ఏ మాత్రం పట్టు తప్పినా సరే బాలికలు గాయపడడం ఖాయం. రాజస్థాన్‌లోని పెద్ద నగరాల్లో ఒకటైన జైసల్మేర్ ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. గత పది రోజులుగా నగరంలో నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోల్డెన్ సిటీగా పేరున్న జైసల్మేర్.. ఇప్పుడు నీటి కొరతతో సతమతమవుతోంది. జైసల్మేర్ ఎడారి ప్రాంతం. ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంది. ఇలాంటి సమయంలో నీటి కొరత అంటే అక్కడి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.నల్లాల నుంచి నీటి సరఫరా ఆగిపోయి 10 రోజులవుతోంది. దీంతో ట్యాంకర్ల ద్వారా స్థానికులకు నీళ్లు సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నాలుగైదు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. పది రోజులుగా నీళ్లు రావడం లేదని అధికారులకు చెప్పినా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. నీటి కొరతపై అధికారులు స్పందిస్తూ స్థానిక కాలువకు సంబంధించిన నిర్వహణ పనుల వల్ల ప్రజలకు నీటి సరఫరాలో అవాంతరం ఏర్పడిందన్నారుప్రస్తుతం గ్రేటర్ లో1.30 కోట్ల జనాభాకు రోజుకు 813.28 ఎంజీడీల డిమాండ్ ఉండగా, ప్రస్తుతం వాటర్?బోర్డు 560 ఎంజీడీలు మాత్రమే సరఫరా చేయగలుగుతోంది. ఈ లెక్కన లోటు 253.28 ఎంజీడీలుగా ఉంది. అయితే, 2027 ఆఖరు నాటికి సిటీలో జనాభా1.57 కోట్లకు చేరుకుంటుందని, అప్పుడు నీటి డిమాండ్? 835 ఎంజీడీలు ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. అప్పటి వరకు గోదావరి 2, 3 దశలు పూర్తయితే 869 ఎంజీడీలు సమకూరుతుందని, ఇంకా 34 ఎంజీడీల మిగులు ఉంటుందంటున్నారు. 2030 నాటికి జనాభా 1.60 కోట్లకు చేరితే నీటి డిమాండ్?867.28 ఎంజీడీలకు చేరుకుంటుందని, అప్పటికీ సరఫరా సామర్థ్యం 869 ఎంజీడీలు ఉంటుందన్నారు. అయినా,1.72 ఎంజీడీల మిగులు ఉంటుందన్నారు. ఇక 2035 నాటికి జనాభా 1.73 కోట్లు.. డిమాండ్? 921.05 ఎంజీడీలు ఉంటుందని, సరఫరా సామర్థ్యం 869 ఎంజీడీలు కొనసాగుతుందని, అప్పుడు మాత్రమే 52.05 ఎంజీడీల కొరత ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. 2050 నాటికి నగర జనాభా 2.08 కోట్లకు చేరుతుందని భావిస్తుండగా నీటి డిమాండ్?రోజుకు 1,114.02 ఎంజీడీలు ఉంటుందని అంచనా వేశారు. అప్పుడు సరఫరా చేసే సామర్థ్యం మైనస్? 71 ఎంజీడీలకు పడిపోతుందని భావిస్తున్నారు. అప్పటి వరకూ ఇప్పుడు అనుకున్న అన్ని ప్రాజెక్టులు పూర్తయినా నీటి కొరత ఉంటుందని, అందుకని కొత్త వనరుల కోసం ప్రయత్నాలు చేయాల్సి ఉంటుందని అధికారులుచెబుతున్నారు. నగరం దక్కన్?ఏరియా కావడం వల్ల నీటి వనరులు తక్కువగానే ఉన్నాయి. మన దగ్గర హిమాయత్?సాగర్?, ఉస్మాన్?సాగర్? మాత్రమే ఉన్నాయి. సంగారెడ్డిలో సింగూరు, మంజీరా, నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్, ?పెద్దపల్లి జిల్లాలో ఎల్లంపల్లి ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి నగరానికి పైప్?లైన్? ద్వారా నీటిని తరలిస్తున్నారు. 2050 నాటికి ఊహించిన దానికన్నా జనాభా విస్ఫోటనం ఉంటే నీటి కొరతతో ఇబ్బంది తప్పకపోవచ్చని భావిస్తున్నారు. అందుకే కొత్త ప్రాజెక్టులు ఏం చేపట్టాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. అలాగే, నీటి పొదుపుపై ప్రచారం నిర్వహించాలని భావిస్తున్నారు.

# మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

**విశాఖపట్నం, భారత శక్తి ప్రతినిధి, జూన్ 7:** మత్స్య సంపద విలువ గొలుసులను బలోపేతం చేయడానికి మరియు భారతదేశపు ప్రపంచ సముద్రపు ఆహార పోటీతత్వాన్ని పెంపొందించడానికి విశాఖపట్నంలో సముద్రపు ఆహార ఎగుమతులపై జాతీయ కార్యశాల జరిగింది. ట్రేసబిలిటీ, సుస్థిర ధృవీకరణ, విలువ జోడింపు, ఎగుమతుల వైవిధ్యీకరణ మరియు అధిక విలువ గల లోతైన సముద్ర వనరులను వినియోగించుకోవడంపై సాంకేతిక సమావేశాలు చర్చించాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో, వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో, మత్స్య, పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని మత్స్య శాఖ ఆధ్వర్యంలో సముద్రపు ఆహార ఎగుమతులపై ఒక జాతీయ కార్యశాల 2026 జూన్ 5, 6 తేదీలలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించబడింది. ఈ కార్యశాల మొదటి రోజు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మరియు మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, భారత ప్రభుత్వ పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌కు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు, రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత






ప్రాంతాల ప్రతినిధులు హాజరయ్యారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ , ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ కౌన్సిల్ , నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ , నాబార్డ్, చీజణజ, చీజజూ, ాఖీూజ మరియు ఇన్వెస్ట్ ఇండియా వంటి కీలక జాతీయ సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఈ వర్క్‌షాప్‌కు సముద్రపు ఆహార ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలు, ప్రాసెసర్లు, స్టార్టప్‌లు మరియు ఇతర విలువ-గొలుసు భాగస్వాములు కూడా హాజరయ్యారు. తద్వారా సముద్రపు ఆహార ఎగుమతి వ్యవస్థకు సమగ్ర ప్రాతినిధ్యం లభించింది. భారతదేశాన్ని ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల సముద్రపు ఆహార ఎగుమతి దేశంగా నిలపడంపై ఈ చర్చలు నొక్కిచెప్పాయి. పరిమాణం ఆధారిత ఎగుమతుల నుండి విలువ జోడించిన, అధిక నాణ్యత గల ఉత్పత్తులకు మారడం, అలాగే భారతదేశపు ప్రపంచ సముద్రపు ఆహార బ్రాండ్‌ను బలోపేతం చేయడానికి ఆవిష్కరణలు, అధునాతన సాంకేతికతలు, పటిష్టమైన ట్రేసబిలిటీ వ్యవస్థలను ప్రోత్సహించడం వంటివి కీలక అంశాలుగా ఉన్నాయి.



సమర్థవంతమైన మరియు నిబంధనలకు అనుగుణమైన వాణిజ్యాన్ని నిర్ధారించడానికి కోల్డ్ చైన్, ఎయిర్ కార్గో మరియు క్వారంటైన్ సౌకర్యాలతో సహా ఎగుమతి మౌలిక సదుపాయాలు మరియు లాజిస్టిక్స్‌ను విస్తరించాల్సిన అవసరాన్ని కూడా చర్చలు నొక్కిచెప్పాయి. ఉత్పత్తికి గణనీయంగా దోహదపడే అంతర్గత మత్స్య సంపద నుండి ఎగుమతులను పెంచడం, అలాగే తినడానికి సిద్ధంగా ఉండే ఉత్పత్తులు మరియు అధిక విలువ గల జాతులు వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలలో ఇంకా వినియోగించని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మరియు విలువ గొలుసులను బలోపేతం చేయడంతో పాటు, సుస్థిరత, నాణ్యత హామీ మరియు నియంత్రణల అనుగుణ్యతపై మంత్రులు ఉద్ఘాటించారు. పటిష్టమైన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సముద్రపు ఆహార ఎగుమతి పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి, 'హోల్-ఆఫ్-గవర్నమెంట్' విధానాన్ని అవలంబించడం, బహుళ రవాణా మార్గాలను మెరుగుపరచడం, మరియు పెట్టుబడి, ఆవిష్కరణలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై కూడా గట్టిగా దృష్టి సారించారు. మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి సాగర్ మెహ్రా, కొనసాగుతున్న సంస్కరణలు మరియు ప్రధాన పథకాల ద్వారా ఉత్పత్తిని పెంచడం, ట్రేసబిలిటీ మరియు ధృవీకరణ వ్యవస్థలను బలోపేతం చేయడం, అలాగే లోతైన సముద్ర మరియు ఈఈజెడ్ వనరులలోని వినియోగించని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడంపై ఉద్ఘాటించారు. వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి అజయ్ భదూ, భారతదేశ ఎగుమతుల పనితీరు, మారుతున్న ప్రపంచ మార్కెట్ గతిశీలత, మరియు సముద్రపు ఆహార ఎగుమతులను విస్తరించడంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), మార్కెట్ వైవిధ్యీకరణ మరియు పెరిగిన పోటీతత్వం యొక్క పాత్రను వివరించారు. ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డి. ప్రవీణ్, ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే ఉన్న అంతరాలను ఎత్తి చూపుతూ, శుద్ధి మరియు విలువ జోడింపును పెంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఎగుమతి విలువను మెరుగుపరచడానికి కోల్డ్ చైన్ అభివృద్ధి, శుద్ధి మౌలిక సదుపాయాలు మరియు విలువ గొలుసు ఏకీకరణకు మద్దతు ఇచ్చే కీలక పథకాలను ఆయన వివరించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ మత్స్యశాఖ కార్యదర్శి స్వతంత్ర కుమార్ సింగ్, రైతుల ఆదాయాలు మరియు ఉత్పత్తిని పెంచడానికి కేజ్ కల్చర్, రిజర్వాయర్ ఆధారిత ఆక్వాకల్చర్ మరియు ముత్యాల పెంపకం వంటి అధిక విలువ గల కార్యకలాపాలలోకి వైవిధ్యీకరణపై దృష్టి సారిస్తూ, అంతర్గత మత్స్య సంపద యొక్క ఎగుమతి సామర్థ్యాన్ని నొక్కి చెప్పారు. ఎగుమతి తనిఖీ మండలి అధికారులు, మార్కెట్ ప్రాప్యతను మెరుగుపరచడానికి ధృవీకరణ మరియు తనిఖీ యంత్రాంగాలను బలోపేతం చేయడంతో పాటు, అవశేషాల నియంత్రణ, యాంటీమైక్రోబయల్ ప్రమాణాలు మరియు డిజిటల్ ట్రేసబిలిటీతో సహా అంతర్జాతీయ నియంత్రణ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన నాణ్యత హామీ వ్యవస్థల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం , సీఫుడ్ ఎగుమతిదారుల సంఘం ఆఫ్ ఇండియా , ఇండియన్ ఫిష్‌మీల్ ఱ ఫిష్ ఆయిల్ ఎగుమతిదారుల సంఘం , మరియు ఇండియన్ మెరైన్ ఇంగ్రిడియంట్స్ అసోసియేషన్ వంటి పారిశ్రామిక సంస్థలతో కలిసి, మార్కెట్ అవకాశాలు, పోటీతత్వం, సుస్థిరత మరియు సముద్రపు ఆహార ఎగుమతులను ప్రభావితం చేసే కీలక సవాళ్లపై వాటాదారుల దృక్కోణాలను పంచుకున్నాయి. చర్చల సందర్భంగా, వ్యాధి నిర్వహణ, పెరుగుతున్న ముడిసరుకు ఖర్చులు, నాణ్యమైన విత్తనం మరియు క్వారంటైన్ సౌకర్యాలకు పరిమిత ప్రాప్యత, ఇంకా లాజిస్టిక్స్, కోల్డ్ చైన్ మరియు ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలలో లోపాలు వంటి సముద్రపు ఆహార ఎగుమతి విలువ గొలుసులోని కీలక సవాళ్లను వాటాదారులు ప్రముఖంగా ప్రస్తావించారు. కఠినమైన ధృవీకరణ అవసరాలు, యాంటీబయాటిక్ నిబంధనల పాటింపు, ట్రేసబిలిటీ, మరియు అంతర్గత మత్స్య పరిశ్రమ నుండి తక్కువ ఎగుమతి వాటాపై కూడా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. వీటితో పాటు, అధిక విలువ గల జాతులు మరియు మార్కెట్లలోకి విస్తరించాల్సిన అవసరాన్ని కూడా నొక్కి చెప్పారు. 2026 జూన్ 6న జరిగిన వర్క్‌షాప్‌లో, భారతదేశపు సముద్రపు ఆహార ఎగుమతి వ్యవస్థను బలోపేతం చేయడానికి మరియు ?1 లక్ష కోట్లకు మించిన సముద్రపు ఆహార ఎగుమతులను సాధించాలనే జాతీయ లక్ష్యానికి మద్దతు ఇవ్వడానికి అవసరమైన వ్యూహాత్మక చర్యలపై దృష్టి సారించిన రెండు నేపథ్య సాంకేతిక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలలో విధాన రూపకర్తలు, ఎగుమతిదారులు, పరిశ్రమల నాయకులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలు మరియు ఇతర భాగస్వాములు ఒకచోట చేరి, మత్స్య రంగంలో ధృవీకరణ, ట్రేసబిలిటీ, విలువ జోడింపు, సుస్థిరత మరియు అభివృద్ధి చెందుతున్న ఎగుమతి అవకాశాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. "సముద్రపు ఆహార ఎగుమతులను పురోగమింపజేయడం: విలువ జోడింపు, ధృవీకరణ మరియు ట్రేసబిలిటీని సద్వినియోగం చేసుకోవడం" అనే శీర్షికతో జరిగిన మొదటి సాంకేతిక సమావేశానికి ఒడిశా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీ డి.వి. స్వామి అధ్యక్షత వహించగా, ఎంపిఇడిఎ ఛైర్మన్ పి. జవహర్ మరియు ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సహ-అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సమావేశం మూడు కీలకమైన నేపథ్య చర్చల ద్వారా భారతదేశ ఎగుమతి పోటీతత్వాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఎగుమతి మార్కెట్ల కోసం క్యాచ్ సర్టిఫికేషన్‌కు మద్దతు ఇచ్చే ట్రేసబిలిటీ వ్యవస్థలు, ఆక్వాకల్చర్ మరియు సహజ మత్స్య పరిశ్రమలో సుస్థిర ధృవీకరణ, మరియు సముద్రపు ఆహార రంగానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక ఫ్రేమ్‌వర్క్‌ను అన్వేషించడం. మారుతున్న అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను, ముఖ్యంగా ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలలో క్యాచ్ సర్టిఫికేషన్ నిబంధనలను అందుకోవడానికి, ఆక్వాకల్చర్ మరియు క్యాచ్ ఫిషరీస్ రెండింటిలోనూ ట్రేసబిలిటీ వ్యవస్థల ప్రాముఖ్యత పెరుగుతోందని చర్చలు నొక్కిచెప్పాయి. పారదర్శకత, అనుపాలన మరియు మార్కెట్ ప్రాప్యతను మెరుగుపరచడానికి పటిష్టమైన డిజిటల్ ట్రేసబిలిటీ వ్యవస్థలు, మెరుగైన వాటాదారుల సమన్వయం మరియు విలువ గొలుసు అంతటా అధిక ఏకీకరణ అవసరాన్ని చర్చలు నొక్కిచెప్పాయి. మార్కెట్ ప్రాప్యత మరియు వినియోగదారుల విశ్వాసానికి కీలకమైన సాధకాలుగా సుస్థిర ధృవీకరణ ఫ్రేమ్‌వర్క్‌లు మరియు బాధ్యతాయుతమైన ఉత్పత్తి పద్ధతులను కూడా ఈ సమావేశం పరిశీలించింది. భారతీయ ధృవీకరణ వ్యవస్థలను ప్రోత్సహించడం, సుస్థిరత కార్యక్రమాలను బలోపేతం చేయడం మరియు భారతీయ సముద్రపు ఆహార ఉత్పత్తుల ప్రపంచ పోటీతత్వాన్ని పెంచడంపై పాల్గొన్నవారు చర్చించారు. సముద్రపు ఆహార రంగానికి సంబంధించిన సంభావ్య ఫ్రేమ్‌వర్క్‌పై జరిగిన చర్చలు, విలువ ఆధారిత ఎగుమతులను ప్రోత్సహించడం, ఎంఎస్‌ఎంఈ లకు మద్దతు ఇవ్వడం, పెట్టుబడులను ఆకర్షించడం మరియు లక్షిత విధాన మద్దతు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రపంచ సముద్రపు ఆహార విలువ గొలుసులలో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించాయి. "సముద్రపు ఆహార ఎగుమతులను ప్రోత్సహించడంలో మత్స్య మరియు ఆక్వాకల్చర్ స్టార్టప్‌లు మరియు ఎంఎస్‌ఎంఈలు" అనే శీర్షికతో జరిగిన రెండవ సాంకేతిక సమావేశానికి, మత్స్య మంత్రిత్వ శాఖ, మత్స్య విభాగం, అంతర్గత మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి సాగర్ మెహ్రా; ఐసీఏఆర్, డీడీజీ (మత్స్యశాఖ) డా. జేకే జెనా, ఎన్ఎఫ్‌డీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. బీకే బెహెరా, మత్స్య మంత్రిత్వ శాఖ, మత్స్య విభాగం, మెరైన్ సంయుక్త కార్యదర్శి డా. సురభి రాయ్ సహ-అధ్యక్షత వహించారు. ఈ సమావేశం, ఆవిష్కరణ, విలువ జోడింపు మరియు మార్కెట్ వైవిధ్యీకరణ ద్వారా సముద్రపు ఆహార ఎగుమతులను



ప్రోత్సహించడంలో స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు మరియు ఎంఎస్‌ఎంఈల పాత్రను అన్వేషించింది. ఈ సమావేశంలో మూడు కీలక ఉప-అంశాల చుట్టూ చర్చలు జరిగాయి. విలువ జోడింపు మరియు ఎగుమతి ప్రోత్సాహం, అధిక విలువ గల లోతైన సముద్ర వనరులను సద్వినియోగం చేసుకోవడం, మరియు ఎగుమతి అవకాశాల వైవిధ్యీకరణ. మత్స్య రంగంలో ఆవిష్కరణలు, విలువ జోడింపు మరియు ఎగుమతుల వైవిధ్యీకరణను ప్రోత్సహించడానికి స్టార్టప్‌లు మరియు ఎంఎస్‌ఎంఈల కోసం ఒక శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థను పెంపొందించాల్సిన ప్రాముఖ్యతను ఈ చర్చలు నొక్కిచెప్పాయి. ప్రాసెసింగ్ మరియు పంటకోత అనంతర మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, అధిక విలువ గల మరియు ప్రత్యేకమైన సముద్రపు ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడం, ట్యూనా వంటి లోతైన సముద్ర వనరుల అన్వేషించని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం, మరియు సముద్రపు పాచి సాగు, అలంకార మత్స్య పరిశ్రమ, ముత్యాల పెంపకం మరియు శీతల జల మత్స్య పరిశ్రమ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల ద్వారా ఎగుమతి అవకాశాలను విస్తరించడంపై చర్చలు కేంద్రీకరించబడ్డాయి. భారతదేశం యొక్క ప్రపంచ పోటీతత్వాన్ని పెంపొందించడానికి, ఉపాధిని కల్పించడానికి మరియు సముద్రపు ఆహార ఎగుమతులలో స్థిరమైన వృద్ధిని వేగవంతం చేయడానికి సహాయక విధానపరమైన జోక్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం, నైపుణ్యాభివృద్ధి, ధృవీకరణ, బ్రాండింగ్ మరియు మెరుగైన మార్కెట్ అనుసంధానాల ఆవశ్యకతను పాల్గొన్నవారు నొక్కిచెప్పారు.

భారతదేశపు సముద్రపు ఆహార ఎగుమతుల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా సమష్టిగా పనిచేయడానికి కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామిక భాగస్వాములు, ఎగుమతిదారులు, పరిశోధనా సంస్థలు మరియు పారిశ్రామికవేత్తల మధ్య ఒక ఉమ్మడి నిబద్ధతతో ఈ కార్యశాల ముగిసింది. సుస్థిర ఉత్పత్తి, విలువ జోడింపు, గుర్తించగలగడం, ధృవీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆవిష్కరణ మరియు మార్కెట్ వైవిధ్యీకరణలను కలుపుకొని ఒక సమన్వయ విధానం అవసరమని ఈ చర్చలు నొక్కిచెప్పాయి. ఈ కార్యశాల నుండి వెలువడిన సిఫార్సులు, సముద్రపు ఆహార ఎగుమతులలో భారతదేశపు ప్రపంచ పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన విధానాలకు మరియు లక్షిత చర్యలకు దోహదపడతాయని భావిస్తున్నారు.

సముద్రపు ఆహార ఎగుమతులు ఇప్పటికే బలమైన వృద్ధిని, స్థిరత్వాన్ని కనబరుస్తున్న నేపథ్యంలో, సమగ్ర ప్రభుత్వ విధానం ద్వారా మత్స్య రంగం యొక్క పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయాలనే ప్రభుత్వ నిబద్ధతను ఈ వర్క్‌షాప్ పునరుద్ఘాటించింది. ఈ వర్క్‌షాప్ ఫలితాలు, ?1 లక్ష కోట్లకు మించిన సముద్రపు ఆహార ఎగుమతులను సాధించే దిశగా భారతదేశ ప్రయాణానికి తోడ్పడతాయని, అదే సమయంలో మత్స్యకారులు, రైతులు, ప్రాసెసర్లు, స్టార్టప్‌లు మరియు ఎంఎస్‌ఎంఈలకు మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయని, మరియు ప్రపంచ మార్కెట్లలో నాణ్యమైన, సుస్థిరమైన సముద్రపు ఆహారాన్ని అందించే విశ్వసనీయ సరఫరాదారుగా భారతదేశ స్థానాన్ని బలోపేతం

# కోర్టును తప్పుదోవ పట్టించి..
# 'సౌర' ముసుగులో అక్రమ నిర్మాణం!

'సౌర విద్యుత్' ఉత్పత్తి అనే పవిత్రమైన ముసుగు వేసుకుని, మున్సిపల్ చట్టాలను, ఫైర్ సేఫ్టీ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ 'హై ఫై ప్లాజా' (విశాల్ మార్ట్ భవనం) యాజమాన్యం సాగిస్తున్న అక్రమ దందాపై 'భారత శక్తి దినపత్రిక' అందిస్తున్న ప్రత్యేక పరిశోధనాత్మక కథనం.

### కథనం నేపథ్యం:
### అక్రమ నిర్మాణానికి 'సోలార్' రక్షణ కవచం!

రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ మండలం, సాహెబ్ నగర్ ఖుర్ద్ పరిధిలోని ఎల్బీనగర్ చింతలకుంట, పల్లవి గార్డెన్ ప్రక్కన, సర్వే నంబర్ 1 మరియు 1/ఎ1 లో "హై ఫై ప్లాజా" - విశాల్ మార్ట్ బిల్లింగ్' కొలువై ఉంది. ఈ భవనానికి సంబంధించి గతంలో బిల్డింగ్ పర్మిషన్ నంబర్: 1/సి3/09037/2018 (తేదీ: 11 జూలై, 2018)" ద్వారా అనుమతులు పొందారు. అనంతరం "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (OC) నంబర్: 1/సి3/07689/2021-ఓసి (ప్రొసీడింగ్స్ నం: ఓసి 1/సి3/09231/2021, తేదీ: 19 ఆగస్టు, 2021)" కూడా పొంది వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు.అయితే, అనుమతి పొందిన పరిమితికి మించి, భవనంపై అక్రమంగా అదనపు అంతస్తును నిర్మిస్తున్నారనే స్థానిక ప్రజల ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు (నాగోల్ సర్కిల్ నెం. 11, ఎల్.బి. నగర్ జోన్) గత మే నెలలో రంగంలోకి దిగారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం, డిప్యూటీ కమిషనర్ ద్వారా 04-05-2026 నాటి షోకాజ్ నోటీసు (No. UC-41/TPS/C11/MMC/2026) ను భవన యాజమాన్యానికి జారీ చేశారు.

### : ఇదా సోలార్ ప్లాంట్ అంటే?

కోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాల (ఇంటెరిమ్ ఆర్డర్స్) ఆసరాగా చేసుకుని, ప్రస్తుతం సదరు భవనంపై యథేచ్ఛగా అక్రమ శాశ్వత నిర్మాణ పనులు సాగుతున్నట్లు 'భారత శక్తి' పరిశోధనలో తేలింది. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ముసుగులో పిల్లర్లు, గోడలు లేస్తూ.. మున్సిపల్ రూల్స్‌ను, ఫైర్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

1. ఫైర్ సేఫ్టీకి పాతర: భారీ మాల్స్ ఉండే ఇలాంటి కమర్షియల్ కాంప్లెక్స్‌లపై నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తే, రేపు ఏదైనా ప్రమాదం జరిగితే వందలాది మంది ప్రాణాలు గాల్లో కలవడం ఖాయం. దీనికి బాధ్యులెవరు?

2. కోర్టు ధిక్కరణ కాదా?: కోర్టు కేవలం సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకే అనుమతి ఇచ్చింది. కానీ అక్కడ జరుగుతున్న భారీ కాంక్రీట్ నిర్మాణాలు కోర్టును తప్పుదోవ పట్టించడమే కాకుండా, కోర్టు ఆదేశాలను ధిక్కరించడమే అవుతుంది.



అక్రమ నిర్మాణం పాతది



ఇప్పుడు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం.



Date: April 30, 2026

TO,
The Dy commissioner, mmc Nagol
The Zonal Commissioner L.B. Nagar Zone, mmc
The commissioner MMC
Vigilance incharge officer NMC
Hydraa, commissioner,
Hyderabad, Telangana.

**SUBJECT**: Formal Complaint against illegal and unauthorized additional constructions at "Hive Five Plaza" (Vishal Mega Mart & Croma building), Chintalkunta — Violation of TS Municipalities Act and Fire Safety Norms — Request for immediate demolition and criminal action.

**RESPECTED SIR**

I am writing to formally bring to your urgent attention a grave violation of urban planning laws and public safety norms occurring at the following premises:
Premises Address: Hive Five Plaza, Survey No. 1, 1/A1, Chintalkunta Check Post, Vanasthalipuram, Hyderabad, Telangana - 500074. (Occupied by Vishal Mega Mart & Croma).
**1. NATURE OF GRIEVANCE** The owner/occupier of the aforementioned building is currently engaged in constructing additional floors/structures atop the existing building without obtaining any valid building permission or "No Objection Certificate" (NOC) from the GHMC or the Fire Department.

**2. LEGAL VIOLATIONS** This unauthorized construction is in direct violation of the following statutes:
Section 174 & 178 of the Telangana Municipalities Act, 2019:** Which mandates prior technical sanction and building permission for any construction. Any deviation or unauthorized construction is liable for immediate demolition without notice.
Telangana Fire Services Act, 1999: The building is a high-footfall commercial zone. Unauthorized additions compromise the structural integrity and fire escape routes, posing a massive risk to public life.
Violation of G.O. Ms. No. 168 (Building Rules): Regarding mandatory setbacks and Floor Space Index (FSI) regulations.
**3. CRIMINAL LIABILITY,** The act of constructing illegal structures in a public commercial space amounts to:
Public Nuisance & Endangerment: Under relevant sections of the ,Bharatiya Nyaya Sanhita (BNS), (formerly IPC), for knowingly endangering human life and safety.
Fraud and Misrepresentation: For violating the terms of the original ,Occupancy Certificate (OC), issued by the authorities.
**4. PRAYER / RELIEF SOUGHT** In view of the above facts, I/We earnestly request your office to:
1. ssue a 'Stop Work' Order: Immediately halt the ongoing illegal construction.
2. Conduct Inspection: Deploy a Town Planning Task Force to measure the deviations.
3. Revoke Permits:Suspend/Cancel the existing Occupancy Certificate and Trade Licenses of the establishments (Vishal Mega Mart/Croma) until the illegal structures are removed.
4. Initiate Criminal Proceedings: File an FIR against the owner for criminal negligence and corruption.
I request you to treat this as an urgent matter involving public safety. I look forward to a written acknowledgment and a report on the action taken within 7 days.
Sincerely,

(Signature)
Name
Address:
Contact Number:

DEPUTY COMMISSIONER CIRCLE-11 NAGOLE G.H.M.C
30 APR 2026

### కోర్టులో తప్పుడు ఆధారాలు -- లభించిన తాత్కాలిక ఊరట!

మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తారనే భయంతో, పిటిషనర్ డాక్టర్ పెండ్యాల సుజ్ఞానేశ్వర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు "(W.P. No. 16820 of 2026)". కోర్టులో తాను ఎలాంటి వాణిజ్య లేదా నివాస అవసరాల కోసం అదనపు అంతస్తు నిర్మించడం లేదని, కేవలం కేంద్ర ప్రభుత్వ పథకం ప్రకారం '160 kWp సోలార్ గ్రిడ్-కనెక్టెడ్ రూఫ్‌టాప్ పవర్ ప్లాంట్‌ను' మాత్రమే ఏర్పాటు చేస్తున్నట్లు నమ్మబలికారు. కోర్టుకు వాస్తవాలను దాచి, తప్పుడు ఫోటోలు, తప్పుడు ఆధారాలు సమర్పించి.. గౌరవనీయులైన శ్రీమతి జస్టిస్ టి. మాధవి దేవి గారి నేతృత్వంలోని బెంచ్ నుండి గురువారం, మే 21, 2026 న తాత్కాలిక ఆదేశాలు (Interim Direction) పొందారు.

### కోర్టు విధించిన కఠిన షరతులు ఇవే:

- సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియలో అధికారులు జోక్యం చేసుకోకూడదు.
- ఈ నిర్మాణాన్ని కేవలం సౌర విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే వాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నివాస, వాణిజ్య అవసరాలకు వాడరాదు.
- కేసు వీగిపోతే స్వంత ఖర్చులతో నిర్మాణాన్ని తొలగిస్తామని పిటిషనర్ హామీ (Undertaking) ఇవ్వాలి.

### 'భారత శక్తి' నిలదీస్తోంది



భారత శక్తి

## నిబంధనలు 'గాలి'కి.. అక్రమ నిర్మాణాలు 'జోరు'గా!

నాగోల్, మే 3 (భారత శక్తి): అధికారుల అండదండలు ఉన్నాయో లేక నిబంధనలంటే లెక్కలేదో కానీ, నాగోల్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విజయవాడ హైవే పక్కన, చింతలకుంట పల్లవి గార్డెన్ సమీపంలోని హకీమాబాద్ కాలనీ ప్లాట్ నంబర్ 1 లో ఉన్న భారీ కమర్షియల్ కాంప్లెక్స్ విశాల్ మార్ట్ భవనం ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మున్సిపల్ చట్టాలను తుంగలో తొక్కి, అగ్నిమాపక నిబంధనలను బేఖాతరు చేస్తూ సాగుతున్న ఈ దందాపై స్థానికులు మండిపడుతున్నారు.

**అనుమతులు లేవు.. ఆందోళనే లేదు!**

సదరు కమర్షియల్ కాంప్లెక్స్ పైన ఎటువంటి అనుమతులు లేకుండానే అదనపు అంతస్తుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. నిబంధనల ప్రకారం కమర్షియల్ భవనాలకు ఉండాల్సిన 'ఫైర్ సేఫ్టీ' ప్రమాణాలను ఇక్కడ పూర్తిగా విస్మరించారు. రేపు పొరపాటున అగ్ని ప్రమాదం జరిగితే ఆస్తి, ప్రాణ నష్టానికి బాధ్యత వహించేది ఎవరని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల కళ్లముందే ఇంత భారీ నిర్మాణం సాగుతున్నా, వారు కళ్లు మూసుకోవడం వెనుక ఉన్న మర్మమేమిటని కాలనీవాసులు నిలదీస్తున్నారు.

**ఫిర్యాదులు బుట్టదాఖలు!**

ఈ అక్రమ నిర్మాణంపై నాగోల్ సర్కిల్ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదులు అందినప్పటికీ ఫలితం శూన్యం.
టి.పి.ఎస్ సోమేశ్ కుమార్
ఏసిపి మధు, డిప్యూటీ కమిషనర్

- చింతలకుంట విశాల్ మార్ట్ భవనంపై అదనపు అంతస్తుల దందా
- అగ్నిప్రమాదం జరిగితే బాధ్యులెవరు?
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని నాగోల్ సర్కిల్ అధికారులు
- ఖజానాకు గండి.. అవినీతి ఆరోపణల వెల్లువ!

వీరికి పలుమార్లు విన్నవించినా, క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఫిర్యాదు చేసినా స్పందించని పరిస్థితి చూస్తుంటే, క్షేత్రస్థాయి అధికారుల పరోక్ష సహకారంతోనే ఈ అక్రమ సామ్రాజ్యం విస్తరిస్తోందన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది.

**కార్పొరేషన్ ఖజానాకు గండి:**

ఒకవైపు అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే, మరోవైపు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అనుమతి ఫీజులు, పెనాల్టీలు ఎగ్గొట్టి అక్రమార్కులు జేబులు నింపుకుంటుంటే, అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎల్బీనగర్ జోన్ నాగోల్ సర్కిల్ మనసురాబాద్ డివిజన్ లో చింతలకుంట పల్లవి గార్డెన్ పక్కన విశాల్ మార్ట్ బిల్డింగ్ పైన భారీ అక్రమ నిర్మాణం చేయబన్నారు ముడుపులు అందుకొని అటువైపు చూడని మున్సిపల్ సిబ్బంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి..**

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ మరియు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఈ వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, నిబంధనలను అతిక్రమించిన వారితో పాటు, వారికి సహకరిస్తున్న అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఉన్నతస్థాయిలో పోరాటానికి సిద్ధమని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

### ముగింపు: జూన్ 18న ఏం జరగబోతోంది?

స్థానిక ప్రజల రక్షణను, మున్సిపల్ చట్టాలను కాలరాస్తూ సాగుతున్న ఈ అక్రమ గుట్టును 'భారత శక్తి దినపత్రిక' గతంలోనే బట్టబయలు చేసింది. ఇప్పుడు కూడా శాస్త్రీయ ఆధారాలతో, ఫైల్ నంబర్లతో సహా ఈ అక్రమాలను ప్రజల ముందు, అధికారుల ముందు ఉంచుతోంది. ఈ కేసు తదుపరి విచారణ "జూన్ 18, 2026 న జరగనుంది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎం.ఎం.సి) లీగల్ సెల్ స్పందించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ రూపంలో ఉన్న అక్రమ నిర్మాణాల ఫోటోలను, నిజాలను కోర్టు ముందు ఉంచి, అక్రమార్కుల ఆట కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# చమురు మార్కెట్‌లో భారత్ విశ్వరూపం!

ఆర్థిక సదస్సులో శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ చమురు రంగంలో భారత్ అత్యంత కీలకమైన, ప్రత్యేకమైన స్థానాన్ని సొంతం చేసుకుందని విశ్లేషించారు.

### 2035 నాటికి రోజుకు 80 లక్షల బ్యారెళ్లు!

అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) అంచనాల ప్రకారం.. భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకుపోతుండటంతో దేశీయంగా ఇంధన వినియోగం భారీగా పెరగనుంది. భారత్‌లో వృద్ధి:2035 నాటికి దేశంలో చమురు వినియోగం '44 శాతం వృద్ధితో.. ప్రతిరోజూ సుమారు 80 లక్షల బ్యారెళ్లకు చేరుకోనుంది.
ప్రపంచ సగటు: భారత్‌తో పోలిస్తే మిగిలిన ప్రపంచ దేశాలలో ఈ వృద్ధి కేవలం 5 శాతం లోపే' పరిమితం కానుంది.

### గ్లోబల్ ఎనర్జీ హబ్‌గా భారత్

ప్రపంచంలోని ఇతర పెద్ద దేశాల ఆర్థిక రంగాలు మందగమనంలో సాగుతుండగా, భారత్‌లో పారిశ్రామికీకరణ, రవాణా రంగాలు ఊపందుకోవడం వల్లే ఈ స్థాయి డిమాండ్ ఏర్పడుతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన రంగాన్ని శాసించే శక్తిగా భారత్ అవతరించబోతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం.

# తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేలు

**అదిలాబాద్(భారత శక్తి)** తెలంగాణలో కొత్తగా మరో రెండు జాతీయ రహదారులకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సీసీఈఏ (ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ) సమావేశంలో ఆమోదించారు. ఈ రెండు నేషనల్ హైవేలలో ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563) సెక్షన్ల అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ గత ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు హైవేలకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు ప్రక్రియను పూర్తి చేసింది. సీసీఈఏ ఆమోదంతో ఈ ఏడాది పనులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేల కోసం రూ.7,597.16 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం 190 కిలోమీటర్లు పొడవున నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు.జగిత్యాల-కరీంనగర్ హైవేను బీవోటీ పద్ధతిలో నిర్మిస్తారు. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63) పనులను హ్యామ్ పద్ధతిలో పూర్తి చేస్తారు. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే ఆర్మూర్-మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం దాదాపుగా గంటన్నర వరకు తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే జగిత్యాల-కరీంనగర్ మధ్య హైవేతో 45 నిమిషాలు తగ్గనుందంటున్నారు. ఈ రెండు జాతీయ రహదారుల్ని పీఎం గతిశక్తి పథకానికి అనుగుణంగా రూపొందిస్తున్నారు. ఈ రెండు నేషనల్ హైవేలను పలు ప్రాజెక్టులకు అనుసంధానం చేయనున్నారు. వీటిలో ఆర్థిక కేంద్రాలు, సామాజిక కేంద్రాలు, లాజిస్టిక్ కేంద్రాలు కూడా ఉన్నాయిఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల నేషనల్ హైవే 63 నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా వెళుతుంది. జగిత్యాల-కరీంనగర్ నేషనల్ హైవే విషయానికి వస్తే.. పోతారం, గంగాధర, కరీంనగర్ వరకు వెళుతుంది. ఈ హైవేలలో బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. గంటలకు 100 కిలోమీటర్లు స్పీడ్ వెళ్లేలా రోడ్లను డిజైన్ చేశారు. ఈ రెండు హైవేలు ఫిషింగ్ సీఫుడ్ క్లస్టర్, పలు రైల్వే స్టేషన్‌లను కనెక్ట్ చేయనున్నాయి. మొత్తం మీద త్వరలోనే కొత్త జాతీయ రహదారులు నిర్మాణం కాబోతున్నాయి. వాస్తవానికి సీసీఈఏ సమావేశంలో ఈ రెండు జాతీయ రహదారులతో పాటుగా ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు సంబంధించి ఆమోదం లభిస్తుంది అనుకున్నారు.. ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.. ఆమోదం లభించలేదు.

# మార్కెట్లో నకిలీ విత్తనాలు...

**అదిలాబాద్, (భారత శక్తి)**ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చుకుని పంటలు పండించే రైతులకు చీడ, పీడలతోనే కాదు.. రైతు సమాజానికి చీడపురుగుల్లా దాపురించిన నకిలీ విత్తన విక్రేతలతోనూ ప్రమాదం ఏర్పడింది. వీరితో జాగ్రత్తగా లేకుంటే రైతుల వ్యవసాయానికి మొదటికే మోసం వచ్చేలా పరిస్థితులున్నాయని అధికారులంటున్నారు. తమ కంపెనీ విత్తనాలు వాడితే పంట సాగులో చీడ పీడల బెడద ఉండదని, వాటి నివారణ కోసం ప్రత్యేకంగా ఎలాంటి ఎరువులు వాడాల్సిన అవసరమే రాకుండా పంటలు సాగు చేయొచ్చనే ఆశలు చూపించి అమాయక రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లో చొరబడ్డారు. వారిని నియంత్రించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. కొత్త కొత్త బ్రాండ్లతో రైతులకు విత్తనాలను అంట గట్టేందుకు మహారాష్ట్ర లోని కొన్ని నాసిరకం విత్తన తయారీ సంస్థల్లో తయారైన విత్తనాలను జిల్లాలో మార్కెటింగ్ కోసం తీసుకొచ్చి జిల్లాలో కొందరు సీడ్స్ షాపులకు సప్లై చేస్తునట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీల ప్రతినిధులు నేరుగా అయాయక రైతులకే అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లోకి వచ్చేశారు. నేరుగా రైతులకే కాకుండా విత్తనాల డీలర్లకు కూడా ఎక్కువ మొత్తంలో కమిషన్ ఆశ చూపి తమ కంపెనీలకు చెందిన విత్తనాలను ఎక్కువ మొత్తంలో మార్కెట్లో విక్రయించేలా ప్లాన్ చేస్తున్నారు. అయాయక చిన్న సన్నకారు రైతులను ఈ నకిలీ విత్తన విక్రేతలు బురిడీ కొట్టించి నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం పొంచి ఉంది.ఇప్పటికే కొన్ని కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీకి చెందిన బ్రాండ్ల విత్తనాల గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తూ సీడ్స్ మార్కెట్ చేస్తున్నట్లు రైతులు అంటున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాల విషయంలో ఓ పక్క రైతులను చైతన్యపరుస్తూనే, మరో పక్క నకిలీ విత్తనాల నియంత్రణ కోసం వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలతో జిల్లా వ్యాప్తంగా సీడ్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఈ టాస్క్ ఫోర్స్ టీంలు విస్తృతంగా తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండటంతో సీడ్స్ షాప్ నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు.జిల్లాలో 455 విత్తనాలు విక్రయించే రిజిష్టర్డ్ షాప్స్ ఉన్నాయి. రైతులు ప్రతి సీజన్ లో తమకు అందుబాటులో ఉన్న షాపుల్లో రెగ్యులర్ గా వెళ్లి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రిజిస్ట్రార్డ్ సీడ్స్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి సీడ్స్ అమ్మకాలు జరపాల్సి ఉంది. కొన్ని షాపుల్లో ఎక్కువ మొత్తంలో కమిషన్లు చెల్లించే కంపెనీలకు చెందిన బ్రాండ్లు కూడా అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధలను విరుద్ధంగా అమ్మాల్సిన కొత్త కంపెనీలకు చెందిన విత్తనాలను షాపుల్లో కాకుండా ఇతర రహస్య ప్రాంతాల్లో ఉంచి వాటిని కావాలనుకున్న రైతులకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయ పనుల కోసం రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వర్షాలు కురవడం ప్రారంభం కాగానే వ్యవసాయ పనులు కూడా ఊపందుకోనున్న తరుణంలో రైతులు ముందుగా విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల ఏరివేతకు, వాటి నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ టీంలు అన్ని సీడ్స్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఎక్కడా ఏ షాపును వదలకుండా అన్ని షాపులను ఈ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. షాపుల్లో ఎలాంటి అనుమానాస్పద ప్రొడక్ట్ కనిపించిన.. అవి నకిలీ విత్తనాలని తేలినా చట్టపరమైన చర్యలు తప్పవని, షాపు లైసెన్సు కూడా రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

**హైదరాబాద్ (భారత శక్తి)** నగరంలో భూగర్భ జలాలు ముందు ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయికి పడిపోతున్నాయి. భూగర్భంలో దాగున్న నీటిని పైకి తీసుకురావాలనే తాపత్రయంతో నగరవాసులు వందలాది మీటర్ల లోతుకు బోర్ల తవ్వకాలు జరుపుతున్నారు. ఎటు చూసినా బోరుబావుల యంత్రాలు తిరుగుతూ విచ్చలవిడిగా కొత్త బోర్లు తవ్వేస్తున్నాయి. నివాస సముదాయాల్లో పాత బోరుబావులు ఎండిపోవడంతో, ప్రత్యామ్నాయంగా భూగర్భాన్ని జల్లెడగా మారుస్తూ కొత్తవాటిని వేయిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బోరింగ్ మిషన్ల శబ్దాలు మార్మోగుతున్నాయి. గత 15 రోజుల వ్యవధిలోనే నగర వ్యాప్తంగా సుమారు 2,500కి పైగా కొత్త బోర్లు వేసినట్లు అంచనా వేస్తున్నారు.
ఈ పరిస్థితి ఇలాగే మున్ముందుకూ కొనసాగితే నగరంలో తీవ్రమైన జల సంక్షోభం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ సంవత్సరం మే నెలలో గరిష్ట స్థాయిలో నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలాలు గతంలో కంటే సగటున 5 నుంచి 10 మీటర్ల మేర కిందికి దిగజారాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని గచ్చిబౌలి, మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాలతో పాటు అమీర్‌పేట్, కూకట్‌పల్లి, ఉప్పల్ పరిసరాల్లో భూగర్భ జలాలు అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. గత సంవత్సరం మే నెలతో పోల్చి చూస్తే.. ఈసారి దాదాపు 8 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయినట్లు భూగర్భ జల వనరుల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో వందల మీటర్లలో పడిన నీరు ఇప్పుడు కనీసం 1000 నుంచి 1500 మీటర్ల లోతుకు దాటిపోయింది. అయినా సరే కొన్ని చోట్ల చుక్క నీరు కూడా రావడం లేదు. నగరంలో ప్రస్తుతం పాత బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో, నివాసితులు కొత్త బోర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లలో నీటి అవసరాలు తీరక రికార్డు స్థాయిలో లోతైన బోర్లు వేస్తున్నారు.నగరం తన పచ్చదనాన్ని కోల్పోయి కాంక్రీట్ వనంగా మారడమే ఈ ప్రస్తుత దుస్థితికి ప్రధాన కారణంగా మారుతోంది. ప్రతి ఇల్లూ, అపార్ట్‌మెంట్ చుట్టూ సిమెంటింగ్ చేయడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అసలు అవకాశం లేకుండా పోయింది.

# పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు

**- మిత్రదేశాల రక్షణకు అమెరికా వ్యూహాలు!**
**- ఇరాన్ దాడులతో అల్లాడుతున్న గల్ఫ్ దేశాలు.. భారీగా దెబ్బతిన్న చమురు కేంద్రాలు, విమానాశ్రయాలు**
**- సీజ్ చేసిన ఇరాన్ ఆస్తులతోనే నష్టపరిహారం? అమెరికా నిధుల మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు**

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:జూన్ 7 భారత శక్తి,** పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్) వ్యూహాత్మక యుద్ధంలో తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కూటమి ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడంతో, ఇరాన్ తన ప్రతీకారాన్ని గల్ఫ్ దేశాలపై చూపిస్తోంది. ఈ పరిణామాల వల్ల సంక్షోభంతో ఏమాత్రం ప్రత్యక్ష సంబంధం లేని ఐక్య అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), కువైట్, బహ్రెయిన్ వంటి దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. అమెరికా దళాలకు సైనిక పరంగా ఆశ్రయం కల్పించడమే ఇప్పుడు ఈ గల్ఫ్ దేశాలకు పెద్ద శాపంగా మారింది.

### చమురు కేంద్రాలపై విరుచుకుపడ్డ క్షిపణులు

ఇరాన్ జరిపిన భీకర దాడుల్లో గల్ఫ్ దేశాల ఆర్థిక మూలాలైన చమురు ఉత్పత్తి కేంద్రాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు భారీగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం బహ్రెయిన్, కువైట్‌లను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ విరుచుకుపడుతుండగా, అమెరికా సైతం దీటుగా స్పందిస్తూ ఇరాన్‌పై బాలిస్టిక్ క్షిపణులతో ఎదురుదాడులు చేస్తోంది. ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ, ఇరుపక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు నిరంతరాయంగా కొనసాగుతుండటం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

### ఇరాన్ సొమ్ముతోనే నష్టపరిహారం! అమెరికా కొత్త ఎత్తుగడ

తమ వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల నష్టపోయిన మిత్రదేశాలను ఆదుకునేందుకు అమెరికా రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా అమెరికా నిధుల మంత్రిత్వ శాఖ (ట్రెజరీ డిపార్ట్‌మెంట్) ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. యుద్ధం వల్ల గల్ఫ్ దేశాలకు జరిగిన ఆస్తి నష్టంపై తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని అమెరికా నిధుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నష్టాన్ని పూడ్చడానికి అమెరికా ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేయాలని భావిస్తోంది. గతంలో తాము సీజ్ చేసిన ఇరాన్ చమురు ట్యాంకర్లు, అంతర్జాతీయ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ప్రభుత్వ నిధులు, ఇతర ఆస్తులను విక్రయించి, ఆ సొమ్మును గల్ఫ్ దేశాల పునర్నిర్మాణానికి సాయంగా అందించాలని అమెరికా యోచిస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

### ఒకవైపు చర్చలు.. మరోవైపు దాడులు: ట్రంప్ దూకుడు

శాంతి పునరుద్ధరణే ధ్యేయంగా తెరవెనుక దౌత్య విచారణలు, శాంతి చర్చలు కూడా సమాంతరంగా సాగుతున్నాయి. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఈ సుదీర్ఘ ఉద్రిక్తతలకు త్వరితగతిన ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. అయితే శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలోనే క్షిపణి దాడులు ముమ్మరం కావడం ఈ ప్రాంతంలో శాంతి స్థాపన అంత సులువు కాదనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఏదేమైనా, మిత్రదేశాలకు అండగా నిలుస్తూనే, శత్రుదేశ ఆస్తులతోనే ఆ నష్టాన్ని భర్తీ చేయాలనే అమెరికా సరికొత్త వ్యూహం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## విధుల్లో చేరిన మహబూబాబాద్ నూతన ఆర్డీఓ రాజేశ్వరి



మహబూబాబాద్, జూన్ 07(భారత శక్తి):మహబూబాబాద్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఏం.రాజేశ్వరి శనివారం కలెక్టరేటులో బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ ఆర్డీఓగా పని చేసిన కృష్ణవేణి ములుగు ఆర్డీఓగా బదిలీపై వెళ్లగా, ఖమ్మం నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పని చేస్తున్న ఏం.రాజేశ్వరి మహబూబాబాద్ ఆర్డీఓగా బదిలీపై వచ్చారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి విధులలో జాయిన్ అయ్యారు.

# ఎల్లారెడ్డిపేటలో విషాదం

**- ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి.**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 07: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపెల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు ఇంటి పైకప్పు బంగ్లా నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై కె.రాహుల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపెల్లికి చెందిన దీటి రాజయ్య (60), భార్య బాలవ్వ దంపతులు తమ కులవృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 5న రాత్రి దంపతులు తమ ఇంటిపై పడుకున్నారు. అయితే, 6వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాలవ్వ నిద్రలేచి చూడగా భర్త కనిపించలేదు. ఆందోళన చెందిన ఆమె వెతకగా, ఇంటి బంగ్లాపై నుంచి కిందపడి తల, చెవి భాగాల్లో తీవ్ర రక్తగాయాలతో స్పృహ కోల్పోయి పడి ఉండటాన్ని గుర్తించింది. వెంటనే కుటుంబ సభ్యులు రాజయ్యను మెరుగైన చికిత్స కోసం మొదట సిరిసిల్లలోని ఆసుపత్రికి, ఆపై వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి రాజయ్య శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు మృతి చెందాడు. మృతుడు రాత్రి వేళ మూత్ర విసర్జన కోసం వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి ఉంటాడని భార్య బాలవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ప్రేమ పేరుతో యువతిపై అఘాయిత్యం

**- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 07: ప్రేమ పేరుతో యువతిని వేధిస్తూ, కిడ్నాప్ చేసి హత్యాచారానికి పాల్పడిన యువకుడిని సిరిసిల్ల పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్ వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన కుర్ర తిరుపతి (25), ఇల్లంతకుంట మండలానికి చెందిన ఒక యువతిని గత రెండేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో ఆ యువతి భయపడి ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. ఈ క్రమంలో మే 27న సదరు యువతి సిరిసిల్లలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. ఆమె కోసం కాపు కాసిన నిందితుడు తిరుపతి, అదే రోజు సాయంత్రం 4:30 గంటల సమయంలో కిరాణా షాపునకు వెళ్తున్న యువతిని చూసి, బలవంతంగా తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై ఎక్కించుకొని బెదిరించి తీసుకెళ్లాడు. మొదట హైదరాబాద్, ఆపై విజయవాడకు తీసుకెళ్లి పెళ్లి చేసుకోవాలని వేధించాడు. బాధితురాలు ఒప్పుకోకపోవడంతో, మే 29న తన సొంత ఊరికి తీసుకెళ్లి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా హత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ప్రేమ పేరుతో వెంటాడి వేధించినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా "ఫిట్ ఇండియా మూవ్‌మెంట్"**

## సైక్లింగ్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 07 : ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కామారెడ్డి పట్టణంలో "హరిత భవిష్యత్తు కోసం సైక్లింగ్" అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ సైక్లింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు.భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో ఫిట్ ఇండియా ఉద్యమం కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే సైక్లింగ్‌ను ప్రజల్లో ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సైక్లింగ్ అనేది ఆరోగ్యానికి ఎంతో మేలు




చేయడమే కాకుండా కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో సైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు పచ్చని పర్యావరణాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రభుత్వ అధికారులు , వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా ఈ సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డివైఎస్ఓ వెంకటేశ్వర్లు, డిఆర్డీఓ దామోదర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, , క్రీడా సంఘాల సభ్యులు , యువత తదితరులు పాల్గొన్నారు.

# నారా కోడూరులో ఆంధ్రప్రదేశ్ తొలి సమృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

**రూ.1.16 కోట్లతో ఏర్పాటు చేసిన సమీకృత గ్రామీణాభివృద్ధి కేంద్రం ద్వారా ఒకే చోట లభించనున్న ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి, డిజిటల్ సేవలు**




విజయవాడ, జూన్ 7 ( భారత శక్తి ): కేంద్ర కమ్యూనికేషన్లు మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం నాడు నారాకోడూరు గ్రామంలో 'సమృద్ధి కేంద్రం'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామీణ డిజిటల్ పరివర్తనలో కీలక ఘట్టంగా నిలవనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్‌నెట్ ఉద్యమి' లో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమగ్ర గ్రామీణాభివృద్ధి నమూనాను సాధించిన గ్రామాల్లో దేశంలోనే ఇది మూడవది కాగా, తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిది కావడం విశేషం. రూ. 1.16 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ సమృద్ధి కేంద్రం, 11 ముఖ్యమైన సేవా రంగాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చింది. దీని ద్వారా గ్రామస్తులకు ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సేవలు, వ్యవసాయ మద్దతు, ఉపాధి-పారిశ్రామిక అవకాశాలతో పాటు డిజిటల్ గవర్నెన్స్ సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ డిజిటల్ శక్తితో స్వయం సమృద్ధి సాధించిన గ్రామాల నిర్మాణమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పమని, ఈ చొరవ ఆయన దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. 'సమృద్ధి గ్రామ్' ప్రాజెక్ట్ ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, "ఎనేబ్లింగ్ ఎన్విరాన్‌మెంట్" విభాగంలో ప్రతిష్టాత్మక 'వరల్డ్ సమిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ అవార్డ్స్ 2026'కు నామినేట్ అయిందని వెల్లడించారు. భౌతిక మౌలిక సదుపాయాలను, హై-స్పీడ్ భారత్‌నెట్ కనెక్టివిటీతో అనుసంధానించే ఈ ప్రాజెక్ట్ విశిష్ట 'ఫిజిటల్' విధానాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధికి ఈ నమూనా విస్తరించదగిన, అనుసరణీయమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తుందని అన్నారు.

### "ఏక్ కేంద్ర, కామ్ అనేక" - ఒకే వేదిక ద్వారా అనేక సేవలు

ఒకే వేదిక ద్వారా పౌరులకు అనేక రకాల సేవలను అందిస్తూ, ఈ సమృద్ధి కేంద్రం "ఏక్ కేంద్ర, కామ్ అనేక" అనే భావనను ఆచరణలోకి తీసుకువచ్చిందని డాక్టర్ పెమ్మసాని తెలిపారు. "ఒక గ్రామం నిజంగా అభివృద్ధి చెందాలంటే ప్రజలు సేవల కోసం వెతకడం కాదు, అత్యవసర సేవలన్నీ ప్రజల వద్దకే చేరాలి. గ్రామీణ ప్రాంతాల్లోనే ఆలోచనలు పుట్టాలి, అక్కడే సరికొత్త అవకాశాలు సృష్టించాలి. స్థానిక ఆకాంక్షలను వృద్ధి, ఉపాధి, స్వయంసమృద్ధి మార్గాలుగా మార్చడం ద్వారా సమృద్ధి కేంద్రం ఆ దార్శనికతను నిజం చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా నాయకత్వంలో



టెలికమ్యూనికేషన్ల శాఖ దేశవ్యాప్తంగా గుర్తించిన 4,012 బ్లాకులలోని ప్రతి బ్లాక్‌లో ఒక 'మోడల్ గ్రామ పంచాయతీ'ని స్థాపించేందుకు కృషి చేస్తోందని కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు. భారత్‌నెట్ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుంటూ, అందరికీ సమగ్ర అభివృద్ధిని చేకూర్చడమే లక్ష్యంగా ఈ పనులు జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు.

### గ్రామీణ సాధికారత కోసం సమగ్ర సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఆర్థిక అవకాశాలను సృష్టించడానికి ఈ సమృద్ధి కేంద్రం విస్తృత శ్రేణి సేవలను అందిస్తోంది.

### ఆరోగ్య సేవలు

గ్రామస్థులు ఇక్కడి 'హెల్త్ ఏటీఎం'ల ద్వారా ఉచిత ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవచ్చు. పరీక్షల నివేదికలను పొందడంతో పాటు, ఆన్‌లైన్ ద్వారా వైద్యులను సంప్రదించి నిమిషాల వ్యవధిలోనే డిజిటల్ ప్రిస్క్రిప్షన్లను పొందవచ్చు. అలాగే, 'జన ఔషధి కేంద్రం' ద్వారా తక్కువ ధరలకే మందులు కూడా అందుబాటులో ఉంటాయి.

### వ్యవసాయం, రైతు మద్దతు

రైతులు తమ ఉత్పాదకతను పెంచుకోవడానికి, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడానికి వీలుగా ఈ కేంద్రం మట్టి పరీక్షలు, స్మార్ట్ నీటి పారుదల మద్దతు, డ్రోన్ ఆధారిత వ్యవసాయ సేవలను అందిస్తుంది.



### విద్య మరియు నైపుణ్యాభివృద్ధి

విద్యార్థుల కోసం ఏఆర్/వీఆర్ ఆధారిత ఆధునిక అభ్యాస సౌకర్యాలు, డిజిటల్ విద్యా పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు, మహిళలు, స్వయం సహాయక సంఘాల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యాన్ని విస్తరించడానికి డిజిటల్, సోషల్ మీడియా నైపుణ్యాలలో శిక్షణ ఇస్తారు.

### డిజిటల్ కనెక్టివిటీ, గవర్నెన్స్

హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, ఉచిత వై-ఫై సౌకర్యం ద్వారా గ్రామస్తులు టెలి-మెడిసిన్, ఆన్‌లైన్ విద్య, ఈ-గవర్నెన్స్ సేవలు, డిజిటల్ పారిశ్రామిక అవకాశాలను నేరుగా తమ గ్రామం నుంచే పొందే వీలుంటుంది.

### వికసిత్ భారత్ 2047 దిశగా..

సమృద్ధి కేంద్రాన్ని భవిష్యత్తు తరాల కోసం పెట్టిన పెట్టుబడిగా అభివర్ణించిన డాక్టర్ పెమ్మసాని ఇది కేవలం ఒక సేవా కేంద్రం మాత్రమే కాదని, గ్రామీణ సాధికారత, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధికి బలమైన వేదికని అభివర్ణించారు. "భారత్ ఉదయ్ ద్వారా గ్రామోదయం" అనే దార్శనికతతో, నారా కోడూరులో ప్రారంభమైన ఈ ప్రయాణం 'వికసిత్ భారత్ 2047' స్వప్నాన్ని సాకారం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు. ఈ సరికొత్త నమూనాపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని, నారా కోడూరులో వెలిగిన ఈ జ్యోతి ఆంధ్రప్రదేశ్, దేశవ్యాప్తంగా ఉన్న వేలాది గ్రామాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో సాధికారత సాధించిన గ్రామీణ సమాజాలు సమగ్ర, స్థిరమైన అభివృద్ధిని ఏ విధంగా నడిపించగలవో ఈ కేంద్రం నిరూపిస్తుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, నారాకోడూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పట్టుదల,క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చు.

**-టెన్త్,ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది పిల్లలకు జిల్లా ఎస్పీ ప్రశంసలు.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 07: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారుల,సిబ్బంది పిల్లలను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శనివారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 40 మంది పోలీసు సిబ్బంది పిల్లలు,వారి తల్లిదండ్రులు హాజరుకగా విద్యార్థుల కృషి పట్టుదల క్రమశిక్షణను ప్రశంసించి భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... తన చిన్ననాటి జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, తన తల్లిదండ్రులు ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేవని నిరాశ చెందకుండా, లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. అలాగే పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పోలీస్ శాఖలో అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు సేవలు అందిస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తించాలని పిల్లలకు సూచించారు.జీవితంలో ఎల్లప్పుడూ పాఠాలను నేర్చుకుంటూనే ఉండాలని,ప్రతి రోజు ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలని తెలిపారు.మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకొవలని , దురలవాట్లకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలకు చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులకు ఎస్పీ మెమొంటోలతో పాటుగా బహుమతులు అందజేశారు. తల్లీదండ్రుల కష్టాన్ని,భవిష్యత్తులో విద్యార్థులు సాధించాలనుకుంటున్న లక్ష్యాలను వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకుగాను ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, పోలీస్ అధికారులు పిల్లలు పాల్గొన్నారు.

## ఏడాదిలోపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**- ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యం**



జగిత్యాల, జూన్ 7 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి నియోజకవర్గంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం గొల్లపల్లి మండలంలో పర్యటించిన మంత్రి చిల్వకోడూరు గ్రామంలో రూ.7.65 లక్షలతో చేపట్టనున్న పెద్ద చెరువు తూము మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్, మేడారం రిజర్వాయర్-కొత్తపల్లి కాలువతో పాటు నియోజకవర్గంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో 17 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 72 మందికి రూ.26.12 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం గొల్లపల్లి పోచమ్మ బోనాల కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**- రిమాండ్‌కు తరలింపు.**



భారత శక్తి న్యూస్, సిరిసిల్ల, జూన్ 07: సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం సిరిసిల్ల విద్యానగర్ వైకుంఠధామం వద్ద ఒక వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకోగా, పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు అహ్మదాబాద్‌కు చెందిన సోలంకి మంగిలాల్ హిరాభైగా గుర్తించారు. ఇతడు గత ఐదేళ్లుగా సిరిసిల్ల సాయినగర్‌లో వినాయక విగ్రహాల తయారీ వ్యాపారం చేస్తూ, గంజాయికి అలవాటు పడ్డాడు. గుజరాత్‌లోని సూరత్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సిరిసిల్లకు తీసుకువచ్చి, ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడి నుంచి 115 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్, గంజాయి తాగే పైపును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి

# బూత్ లెవెల్ శిక్షణ, సమీక్షా సమావేశం





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 07: కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ ఏ లు), పార్టీ కార్యకర్తల కోసం ప్రత్యేక శిక్షణ, సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కర్, టీపీసీసీ అధికార ప్రతినిధి, బీఎల్ఏ మాస్టర్ ట్రైనర్ మేనేని రోహిత్ రావు డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. బీఎల్ఏ పార్టీకి బలమైన పునాది. ఓటర్ జాబితాలో సవరణలు చేయడానికి కానీ ఓటర్ లిస్టులో కొత్తవారిని చేర్చడానికి (బీఎల్ఏ) ఉన్న అధికారం, ముఖ్యమంత్రి కూడా లేదు. బీఎల్ఏ ప్రాధాన్యత బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ) అనేది పార్టీకి కళ్లు, చెవులూ వంటిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి వ్యవస్థ అత్యంత కీలకమని అన్నారు. ప్రతి బీఎల్ఏ తన పరిధిలోని ఓటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓటరు జాబితాలో తప్పులు, లోపాలు ఉంటే వెంటనే గుర్తించి సరిచేసే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు బలోపేతం కావాలంటే బీఎల్ఏలు నిరంతరం ప్రజలతో మమేకమై ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ స్థాయి నిర్మాణమే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ. ఓటరు జాబితాపై అప్రమత్తత అవసరం.

ఎన్నికల విజయానికి బూత్ స్థాయి నిర్వహణ అత్యంత కీలకమని అన్నారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి అంశాలపై బీఎల్ఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామాలు, కాలనీలు, వార్డుల స్థాయికి తీసుకెళ్లడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలను మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ స్పోక్ పర్సన్, బీఎల్ఏ మాస్టర్ ట్రైనర్ మేనేని రోహిత్ రావు మాట్లాడుతూ. బీఎల్ఏ బాధ్యతలు, విధులపై సమగ్ర శిక్షణ ఇవ్వడం, రాజ్యాంగాన్ని కాపాడటానికి. బీఎల్ఏల విధులు, బాధ్యతలు, ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, డిజిటల్ విధానాల వినియోగం తదితర అంశాలపై సమగ్ర శిక్షణ కాంగ్రెస్ పార్టీ తరపున ఇస్తున్నాం. ప్రతి బీఎల్ఏ తన బూత్ పరిధిలోని ప్రతి కుటుంబంతో సంబంధాలు కొనసాగించాలని, కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయించడంతో పాటు అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించే బాధ్యత బీఎల్ఏలపై ఉంటుందని వివరించారు. ఓటరు జాబితా పరిరక్షణ, ఓటర్లతో నిరంతర సంబంధాలు, పార్టీ కార్యక్రమాల ప్రచారం, ప్రజా సమస్యల గుర్తింపు, ఎన్నికల సమయంలో సమర్థవంతమైన నిర్వహణ వంటి అంశాల్లో బీఎల్ఏలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్, కౌన్సిలర్లు అంజాద్, లడ్డు, అఖిల, ఫెరోజ్ సుల్తానా, కళ్లెం సావిత్రి, యూనుస్, సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, సుదర్శన్, మండల అధ్యక్షులు కృష్ణ రావు, నరేందర్ రెడ్డి, రాజగౌడ్, నౌసిలాల్, శ్రీనివాస్, రమేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుట్నాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు కన్నయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంట సోమనర్సయ్య మృతి అత్యంత బాధాకరం

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**




**జనగామ(భారతశక్తి)జూన్ 7:** పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు గంట సోమనర్సయ్య మృతి పట్ల రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం సోమనర్సయ్య నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ"గంట సోమనర్సయ్య ఉపాధ్యాయ వృత్తికి అంకితభావంతో సేవలందించిన ఆదర్శ వ్యక్తి. విద్యార్థుల భవిష్యత్తు కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప గురువుగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు" అని పేర్కొన్నారు. సోమనర్సయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శిగా ముక్త శ్రీనివాస్ నియామకం



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 7 (భారతశక్తి):** ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతి, ఐక్యత సేవా కార్యక్రమాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంచిర్యాలకు చెందిన ముక్త శ్రీనివాస్ ను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శిగా మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆదివారం నియమించారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కీలకపాత్ర వహించిన ముక్త శ్రీనివాసు నియామకం పట్ల మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులుగా, మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులుగా, మంచి గల పట్టణ ఆర్యవైశ్య సంఘాల చైర్మన్గా కొనసాగుతున్న ఆయన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా మరింత ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణ, జిల్లా ఆర్యవైశ్యుల ఉన్నతికి తన వంతు బాధ్యతగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సేవా దృక్పథం, సమాజం పట్ల ఉన్న అంకితభావం, నాయకత్వ లక్షణాలు, కార్యదీక్ష ఈ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడతాయని పలు ఆర్యవైశ్య నాయకులు ఆశాబావం వ్యక్తం చేశారు.

## ఎల్లారెడ్డిపేట మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు.



**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 7:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మాజోజు కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 9వ తేదీలోపు కళాశాలకు వచ్చి అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9441338100, 8106385402, 9494499420 నంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## కల్కి భగవాన్ కల్యాణోత్సవంలో పాల్గొన్న జగ్గారెడ్డి



**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 7:** సంగారెడ్డి పట్టణంలో పిఎస్ఆర్ గార్డెన్లో కల్కి భగవాన్ భక్త బృందం ఆధ్వర్యం లో కల్కి భగవాన్ మూర్తులకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. కల్కి భగవాన్ దంపతుల విగ్రహ మూర్తులకు పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కల్కి భగవాన్ కృపా కటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని , ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని ఆకాక్షించారు. ప్రతీ ఏటా క్రమం తప్పకుండా కల్యాణం నిర్వహిస్తున్న కల్కి భగవాన్ భక్త బృందాన్ని ఆయన అభినందించారు. కల్కి భగవాన్ ఆలయ కోసం స్థలాన్ని సేకరించామని , ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణం కోసం తన పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా కల్కి భక్త బృందానికి జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కల్కి భక్త బృంద సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వరసిద్ధి వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రారంభోత్సవం



**ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 7:** శ్రీ వరసిద్ధి వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ మరియు వారి అభివృద్ధి కోసం సంఘం నాయకులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షుడు గౌరారం సాయి రెడ్డి, ఉపాధ్యక్షుడు నరాల వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బండారు శ్రీను, కోశాధికారి కొలుకుల ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి కొలుపుల కుమార్, ప్రచార కార్యదర్శి వడ్డె రామస్వామి, పలువురు కార్మికులు, సంఘ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొని నూతన సంఘానికి శుభాకాంక్షలు తెలిపారు. పాల్గొన్నారు.

## గాలి దుమారం..

# రహదారిపై కూలిన చెట్లు

- గంటల్లోనే తొలగించిన రూరల్ ఎస్సై వెంకట్రాజం.
- వేములవాడ రూరల్ పోలీసుల సమయస్ఫూర్తి.
- క్లియర్ అయిన నాగయ్యపల్లె రహదారి.



**భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 7:** వేములవాడ రూరల్ మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలి దుమారం రహదారులను అస్తవ్యస్తం చేసింది. ఈదురు గాలుల తాకిడికి నాగయ్యపల్లె నుంచి మర్రిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందుకున్న వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం వెంటనే అప్రమత్తమయ్యారు. సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ సహాయంతో రహదారికి అడ్డంగా పడిన చెట్లను తొలగించి, ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించారు. పోలీసుల వేగవంతమైన స్పందనతో కొద్దిసేపటికే వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. అత్యవసర సమయంలో ప్రజలకు అండగా నిలిచిన పోలీసుల చొరవపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## నేషనల్ మీన్స్- కమ్- మెరిట్‌కు

# ఎంపికైన చిన్నకోడెపాక విద్యార్థులు



రేగొండ, జూన్ 07 (భారత శక్తి): సర్కారు బడుల్లో చదివే పేదింటి పిల్లలకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్షిప్ అందిస్తుంది. ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో స్థానిక సంస్థల పాఠశాలలో 2025 -2026 విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఏటా మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ అందిస్తున్నది. అందులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి కూడా విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేయగా ఎనిమిదవ తరగతి చదువుతూ ఉన్న విద్యార్థులు ఈ స్కాలర్షిప్ కు దరఖాస్తు చేసుకోగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం చిన్నకోడపాక గ్రామానికి చెందిన గజ్జెల రిషి, కొండపాక వైష్ణవి, ఇద్దరు విద్యార్థులు స్కాలర్షిప్ కు ఎంపికయ్యారు. చిన్నకోడపాక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసుకుని 2026లో 9వ తరగతి చదవడానికి సిద్ధం కాగా స్కాలర్షిప్ విషయం తెలుసుకొని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన విద్యాబోధన చేసి స్కాలర్షిప్ పరీక్షకు పంపించగా గ్రామానికి చెందిన విద్యార్థులు రిషి, వైష్ణవి ఇద్దరు జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించి మెయిన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ ఎంపికయ్యారు. విద్యార్థులు స్కాలర్షిప్ కి ఎంపిక కావడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామ సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతగానో అభినందిస్తున్నారు.



## ఖేలో ఇండియా స్కీం ద్వారా

# జిల్లాకు కబడ్డీ సెంటర్



భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 07 (,భారత శక్తి) జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా స్కీమ్ ద్వారా జిల్లాకు కబడ్డీ సెంటర్‌కు సంబంధించిన కబడ్డీ మ్యాట్స్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కబడ్డీ క్రీడాకారులకు ట్రాక్ సూట్స్ మరియు మ్యాట్ షూస్‌ను అందజేశారు. క్రీడాకారులు అందించిన ఈ సదుపాయాలను సమర్థంగా వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అదనంగా, క్రీడాకారుల అభివృద్ధికి అవసరమైన మరిన్ని సదుపాయాలను త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి చిర్రా రఘు, మున్సిపల్ ఛైర్పర్సన్ బుర్రా కొమురయ్య, కబడ్డీ జిల్లా అసోసియేషన్ బాధ్యులు, సింగరేణి స్పోర్ట్స్ సూపర్వైజర్ శ్రీనివాస్, కబడ్డీ సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పిఈటీలు, కార్యాలయ సిబ్బంది శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# అరటి తొక్కతో అద్భుతాలు..

## ఇలా చేస్తే మీ అందం డబుల్..

మెరిసే చర్మం, అందమైన ముఖం కోసం చాలా మంది రకరకాల క్రీములు, ఫేస్ ప్యాక్‌లు ఉపయోగిస్తుంటారు. కానీ వాటిలో ఉండే రసాయనాలు కొన్నిసార్లు దుష్ప్రభావాలకు దారితీస్తాయి. అయితే, ఇంట్లోనే లభించే అరటి తొక్కతో సహజమైన పద్ధతిలో మీ ముఖ సౌందర్యాన్ని పెంచుకోవచ్చని ప్రకృతి వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా మనం పారవేసే అరటి తొక్కలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని సరిగ్గా ఉపయోగిస్తే అద్భుతమైన ఫలితాలు కనిపిస్తాయి.అరటి తొక్క ఫేస్ ప్యాక్ తయారీ విధానంఅరటి తొక్క పేస్ట్: మొదటగా ఒక అరటి తొక్కను చిన్న ముక్కలుగా కట్ చేసి మెత్తని పేస్ట్‌లాగా గ్రైండ్ చేయండి.ప్యాక్ మిశ్రమం: ఈ పేస్ట్‌లో అర చెంచా బియ్యం పిండి, అర చెంచా చక్కెర కలపండి. అప్లై చేయడం: ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి, మెడకు అప్లై చేసి అరగంట పాటు ఉంచండి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి.ప్యాక్ ప్రయోజనాలు: బియ్యం పిండిలో ఉండే స్టార్చ్ చర్మానికి మెరుపునిచ్చి, బిగుతుగా చేస్తుంది.చక్కరలో గ్లైకోలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది.అరటి తొక్కలోని పొటాషియం చర్మాన్ని హైడ్రేట్ చేసి, నల్ల మచ్చలు, టానింగ్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఈ ప్యాక్‌ను క్రమం తప్పకుండా వాడితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. అరటి తొక్కను ఇతర పదార్థాలతో కలిపి కూడా ఫేస్ ప్యాక్‌లా ఉపయోగించుకోవచ్చు: తేనెతో: అరటి తొక్కను మెత్తగా పేస్ట్ చేసి, దానికి కొద్దిగా తేనె కలిపి ముఖానికి అప్లై చేయండి. ఇది చర్మాన్ని మృదువుగా చేసి, తాజాగా కనిపించేలా చేస్తుంది.

పెరుగుతో: అరటి తొక్క పేస్ట్‌లో పెరుగు వేసి బాగా కలపండి. ఈ ప్యాక్‌ను ముఖంపై 15-20 నిమిషాలు ఉంచి తర్వాత శుభ్రం చేసుకోండి. ఈ సహజ పద్ధతులను ఉపయోగించి ఖర్చు లేకుండా, ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా మీ చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా ఉంచుకోవచ్చు. ఎండ వల్ల ముఖంపై ఏర్పడిన నల్ల మచ్చలు, టానింగ్ సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు.

# నిమ్మకాయను డైరెక్ట్‌గా ముఖానికి పెడితే..!



అందంగా, కాంతివంతంగా కనిపించాలని కోరుకోని వారు ఎవరూ ఉండరు. అందుకోసం రకరకాల క్రీములు, చిట్కాలు పాటిస్తుంటారు. వీటిలో నిమ్మకాయను వాడటం చాలా సాధారణం. నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల దీన్ని సహజమైన బ్లీచింగ్ ఏజెంట్‌గా భావిస్తారు. కానీ చర్మానికి ఏదైనా పూసే ముందు, దాని గురించి పూర్తి సమాచారం తెలుసుకోవడం మంచిది. వాటిలో నిమ్మకాయ ఒకటి. నిమ్మరసాన్ని నేరుగా ముఖానికి రాసుకోవడం చాలా ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల చర్మానికి తీవ్రమైన నష్టం కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దురద, మంట: సున్నితమైన చర్మం ఉన్నవారికి నిమ్మరసం నేరుగా అప్లై చేయడం వల్ల చర్మంపై వాపు, దురద, మంట, ఎరుపు వంటి సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే చర్మంపై బొబ్బలు కూడా రావచ్చు. వడదెబ్బ ప్రమాదం: నిమ్మరసం చర్మాన్ని చాలా సున్నితంగా మారుస్తుంది. ఆ సమయంలో సూర్యరశ్మి తగిలితే సులభంగా వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు దారితీస్తుంది.

ముడతలు: నిమ్మకాయలో ఉండే అధిక ఆమ్లత్వం చర్మం యొక్క జూం బ్యాలెన్స్‌ను దెబ్బతీస్తుంది. దీని వల్ల చర్మంపై ముడతలు త్వరగా వస్తాయి. అలాగే మొటిమల సమస్యలు పెరిగి, నల్లటి మచ్చలకు కారణమవుతాయి. నిమ్మకాయ ప్రయోజనాలు పొందాలంటే దాన్ని నేరుగా వాడకుండా ఇతర పదార్థాలతో కలిపి వాడాలి. నిమ్మరసాన్ని శనగపిండి, ముల్తానీ మట్టి, గ్లిజరిన్, కొబ్బరి నూనె లేదా కలబంద జెల్ వంటి వాటితో కలిపి వాడటం సురక్షితం. ఇలా చేస్తే నిమ్మకాయలోని ఆమ్ల గుణం యొక్క తీవ్రత తగ్గి చర్మానికి ప్రయోజనాలు మాత్రమే లభిస్తాయి. కాబట్టి, ముఖానికి నిమ్మకాయను అప్లై చేసే ముందు ఈ జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.



# కుక్క కరిచిన వెంటనే ఏంచేయాలి..?

దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్య తీవ్రంగా మారుతోంది. కుక్క కాటు కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కుక్క కరిస్తే, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే రేబిస్ వంటి వ్యాధులు ప్రాణాలు తీయగలవు. కుక్క కాటుకు మూడు దశల చికిత్స మొదటి దశ: ఈ దశలో కేవలం చర్మంపై గీతలు మాత్రమే పడతాయి. చాలామంది ఇలాంటి చిన్న గాయాలకు పసుపు లేదా కారం వంటి ఇంటి చిట్కాలను ఉపయోగిస్తుంటారు. కానీ ఇలా చేయడం వల్ల ఇన్ఫెక్షన్ పెరిగే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరించారు. ఈ సందర్భంలో గాయాన్ని నీటితో కనీసం 5-10 నిమిషాలు బాగా శుభ్రం చేసి, ఆపై యాంటీసెప్టిక్ క్రీమ్ రాయాలి. రెండు, మూడవ దశ: ఈ రెండు దశల్లో పోస్ట్-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ చికిత్స తప్పనిసరి. రెండవ దశలో కుక్క దంతాలు లోపలికి దిగి గాయం చేస్తాయి. మూడవ దశలో అయితే మాంసం బయటకువస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో గాయాన్ని నీటితో శుభ్రం చేసిన తర్వాత రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్ ఇస్తారు. ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గించడానికి గాయాన్ని పోవిడోన్-అయోడిన్ ద్రావణంతో శుభ్రం చేయడం మంచిది. ఆ తర్వాత బెటాడిన్ వంటి యాంటీసెప్టిక్ మందులను ఉపయోగించాలి. రెండవ, మూడవ దశల్లో గాయం తీవ్రంగా ఉంటుంది కాబట్టి టెటనస్ (ధనుర్వాతం) వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే తప్పనిసరిగా టెటనస్ ఇంజెక్షన్ తీసుకోవాలి. చాలామంది మాంసం బయటకు వచ్చినప్పుడు కుట్లు వేయించుకుంటారు. కానీ కుక్క కాటు గాయాలకు కుట్లు వేయించుకోవడం హానికరం అని డాక్టర్లు చెబుతున్నారు.దీని బదులుగా యాంటీబయోటిక్ మందులు వాడాలి.

# ఫ్రిడ్జ్‌లో గుడ్లు ఉంచవచ్చా..?



మనం నిత్యం ఉపయోగించే నిత్యవసర వస్తువుల్లో కోడి గుడ్లు కూడా ఒకటి. గుడ్లు తినడం వల్ల బలంగా ఉంటారు. ప్రతి రోజూ ఒక ఉడకబెట్టిన గుడ్లు తింటే ఆరోగ్యంగా ఉంటారు. ఇందులో శరీరానికి కావాల్సిన పోషకాలు అన్నీ లభిస్తాయి. అయితే చాలా మంది గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టి నిల్వ చేస్తూ ఉంటారు. ఎలాంటి వస్తువులు అయినా ఫ్రిజ్‌లో పెట్టి తినడం అంత మంచిది కాదు. ఏవైనా సరే వాటి గడువులోగా పాడవడమే మంచిదని నిపుణులు అంటున్నారు. కానీ వీటి గడువు కాలాన్ని పొడిగించి తింటే ఎన్నో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ రోజులు గుడ్లను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి తినడం వల్ల.. వాటి పోషకాలు అందకపోగా.. ఇతర అనారోగ్య సమస్యలు ఎటాక్ చేసే అవకాశాలు ఉన్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని ఫ్రిడ్జ్?లో ఎంత తక్కువ ఉంచితే అంత మంచిది. గుడ్లలో సాల్మోనెల్లా అనే బ్యాక్టీరియా ఉంటుంది. ఇది మన శరీరంలోకి వెళ్తే ప్రాణాంతకరమైన వ్యాధులు వస్తాయి. ఈ బ్యాక్టీరియా వలన విరేచనాలు, వాంతులు అవుతాయి. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఇది ఇతర ఆహార పదార్థాల పైకి కూడా చేరుతుంది. గుడ్లను ఫ్రిజ్‌లో 3 లేదా 5 వారాలకు మించి నిల్వ చేయకూడదు. నిల్వ చేసినా ఫ్రిజ్ దిగువ భాగాన.. ఒక బాక్స్‌లో పెట్టి స్టోరేజ్ చేయాలి. ఫ్రిజ్‌లో నిల్వ చేసే ముందు గుడ్లను శుభ్రంగా నీటిలో కడిగి పెట్టాలి. అప్పటి ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు నిపుణులు.

# సన్‌స్క్రీన్ లోషన్ వాడితే విటమిన్ డి లోపం వస్తుందా..?



వేసవి, వర్షాకాలంలో మాత్రమే కాకుండా, ఏ కాలంలోనైనా సన్‌స్క్రీన్ లోషన్ ఉపయోగించాలని చర్మ నిపుణులు సిఫార్సు చేస్తారు. ఇది చర్మాన్ని సూర్యుని హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి రక్షిస్తుంది. అయితే సన్‌స్క్రీన్ నిరంతరం వాడటం వల్ల శరీరంలో విటమిన్ డి లోపం వస్తుందనే సందేహం చాలామందిలో ఉంటుంది. ఈ విషయంపై నిపుణులు ఏమంటున్నారో ఈ స్టోరీలో తెలుసుకుందాం..సన్‌స్క్రీన్ వల్ల విటమిన్ డి లోపం రాదు. ఎందుకంటే సన్‌స్క్రీన్ లోషన్ అతినీలలోహిత కిరణాలను పూర్తిగా నిరోధించదు. ఇది కొంత మొత్తంలో ఖఎదీ కిరణాలను శరీరం లోపలికి వెళ్లడానికి అనుమతిస్తుంది. ఈ కిరణాలు చర్మంపై పడినప్పుడు, విటమిన్ డి ఉత్పత్తికి అవసరమైన ప్రక్రియ మొదలవుతుంది. కాబట్టి సన్‌స్క్రీన్‌ను క్రమం తప్పకుండా వాడేవారు కూడా శరీరంలో విటమిన్ డి స్థాయిలను సులభంగా నిర్వహించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. విటమిన్ డి పొందడానికి గంటల తరబడి ఎండలో ఉండాల్సిన అవసరం లేదని డాక్టర్లు వివరించారు. వారానికి కేవలం ఒకటి లేదా రెండుసార్లు 10 నుంచి 30 నిమిషాల పాటు సూర్యరశ్మికి గురికావడం సరిపోతుంది. ఇది శరీరానికి అవసరమైన విటమిన్ డిని అందిస్తుంది. విటమిన్ డి కోసం సన్‌స్క్రీన్‌ను దాటవేయడం సరైన పద్ధతి కాదని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. ఎందుకంటే ఎక్కువ సమయం సూర్యరశ్మికి గురికావడం వల్ల చర్మంపై ముడతలు, అకాల వృద్ధాప్యం వంటి సమస్యలు వస్తాయి. అంతేకాకుండా ఇది చర్మ క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కాబట్టి ఆరోగ్యకరమైన చర్మం కోసం సన్‌స్క్రీన్‌ను నిర్లక్ష్యం చేయకుండా, తగినంత విటమిన్ డి కోసం కొద్దిసేపు సూర్యరశ్మిలో ఉండటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# తెల్ల జుట్టు రావడానికి కారణాలుసా..?

జుట్టు రంగు అనేది మన శరీరంలోని పోషకాలు, విటమిన్ల స్థితిని సూచిస్తుంది. సరైన ఆహారం తీసుకోకపోవడం, పోషకాహార లోపం వంటివి జుట్టు తెల్లబడటానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. యువతలో, పిల్లలలో తెల్ల జుట్టు రావడానికి ప్రధాన కారణం విటమిన్ బి12 లోపం అని నిపుణులు చెబుతున్నారు. విటమిన్ బి12 ఎర్ర రక్త కణాలు, నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి చాలా అవసరం. శరీరంలో విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు, జుట్టుకు రంగునిచ్చే మెలనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. దీని ఫలితంగా, చిన్న వయసులోనే జుట్టు తెల్లగా మారడం మొదలవుతుంది. మీకు విటమిన్ బి12 లోపం ఉందని అనుమానం ఉంటే ముందుగా వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం మంచిది. వైద్యుడి సలహా మేరకు సప్లిమెంట్లను తీసుకోవచ్చు. వీటితో పాటు విటమిన్ బి12 అధికంగా ఉండే ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు, పుట్టగొడుగులు వంటివి సహజంగా విటమిన్ బి12ను అందిస్తాయి. నెరిసిన జుట్టును కప్పిపుచ్చడానికి రసాయనాలతో కూడిన హెయిర్ రంగులను ఉపయోగించడం వల్ల జుట్టు నిస్తేజంగా, గరుకుగా మారుతుంది. దీనికి బదులుగా హెన్నా లేదా ఇతర మూలికా రంగులను ఉపయోగించడం మంచిది. హెన్నా జుట్టుకు సహజమైన నల్ల రంగును ఇస్తుంది. జుట్టు నాణ్యతను దెబ్బతీయదు. కేవలం విటమిన్ బి12 మాత్రమే కాదు, జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి సమతుల్య ఆహారం, పుష్కలంగా నీరు, ఒత్తిడి లేని జీవనశైలి చాలా ముఖ్యం.



ఆకుపచ్చ కూరగాయలు, పండ్లు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలు జుట్టు బలాన్ని, దాని సహజ రంగును కాపాడుకోవడంలో సహాయపడతాయి. కాబట్టి ఆరోగ్యకరమైన జుట్టు కోసం సరైన పోషణ, జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

# అల్లం వెల్లుల్లి పేస్ట్ కొంటున్నారా..?

ఏ కర్రీకైనా మంచి రుచి రావాలి అంటే తప్పకుండా ఆ వంటల్లో ఉండాల్సిందే అల్లం వెల్లుల్లి పేస్ట్. ఇది వంటలకు రుచిని ఇవ్వడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. అయితే కొంత మంది అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను బయట కొనుగోలు చేస్తారు. కానీ దీని వలన అనేక నష్టాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. కర్రీ రుచిని నాలుగు రెట్లు పెంచే అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్రతి ఒకరి వంట రూమ్‌లో తప్పక ఉంటుంది. ఎందుకంటే ఇది వంటలకు ప్రత్యేక రుచిని అందించడంలో మేటి. ముఖ్యంగా నాన్ వెజ్ వంటకాలు వండి తప్పకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉండాల్సిందే అంటారు. చికెన్, మటన్, ఫిష్ వంటి వలకు ఇది అద్భుతమైన రుచిని అందిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఇంట్లోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకొని పెట్టుకుంటారు. కర్రీ రుచిని నాలుగు రెట్లు పెంచే అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్రతి ఒకరి వంట రూమ్‌లో తప్పక ఉంటుంది. ఎందుకంటే ఇది వంటలకు ప్రత్యేక రుచిని అందించడంలో మేటి. ముఖ్యంగా నాన్ వెజ్ వంటకాలు వండి తప్పకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉండాల్సిందే అంటారు. చికెన్, మటన్, ఫిష్ వంటి వలకు ఇది అద్భుతమైన రుచిని అందిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఇంట్లోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకొని పెట్టుకుంటారు. కానీ ఈరోజుల్లో కొంత మంది తమ బిజీ షెడ్యూల్ కారణంగా ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకోకుండా, బయట నుంచి కొనుగోలు చేసుకొని వంటల్లో ఉపయోగిస్తున్నారు. కానీ ఇది ఆరోగ్యానికి అస్సలే మంచిది కాదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే ప్యాకింగ్ చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్ చాలా వరకు కల్తీనే ఉంటుందంట. అంతే కాకుండా ఇది వంటలకు అంతగా రుచిని ఇవ్వకపోవడమే కాకుండా, అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందంట. ఎందుకంటే? సహజంగా తయారు చేసినది చాలా తాజాగా, ఎలాంటి రసాయనలు లేకుండా



ఉంటుంది. కానీ మార్కెట్లో లభించే అల్లం వెల్లుల్లి పేస్ట్ అనేక రకాల రసాయనాలతో తయారు అవుతుందంట. అందుకే బయట అల్లం వెల్లుల్లి పేస్ట్ కొనుగోలు చేసేటప్పుడు దానిని సరిగ్గా చూసి, కల్తీని గుర్తించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. తాజా అల్లం ఘాటు వాసనతో లేత గోధుమ రంగులో ఉంటుంది. కల్తీ అయిన అల్లం వెల్లుల్లి పేస్ట్ పుల్లగా ఉంటుందంట. అలాగే ఫ్రెష్ అల్లం వెల్లుల్లి పేస్ట్ మందంగా చాలా సన్నగా అస్సలే ఉండదంట. అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్యాకెట్ పై అల్లం, వెల్లుల్లి కాకుండా నీరు ఉప్పు రాసి ఉంటే అస్సలే ఆ ప్యాకెట్ కొనుగోలు చేయకూడదంట. అంతే కాకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్ ముదురు రంగులో, నీళ్లలా ఉంటే కూడా అది కల్తీ అని భావించాలంటున్నారు నిపుణులు.

# ల్యాప్‌టాప్‌ను ఇలా ఉపయోగిస్తున్నారా.?



వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరిగింది. దీని వల్ల చాలామంది ఇంటి నుంచి పని చేస్తున్నారు. దీని కారణంగా ల్యాప్‌టాప్‌ల వాడకం ఎక్కువైంది. అయితే ల్యాప్‌టాప్‌ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. రోజంతా ల్యాప్‌టాప్ ఉపయోగించడం వల్ల శరీరంపై చెడు ప్రభావం చూపుతోంది. ల్యాప్‌టాప్ నుంచి వెలువడే వేడి వల్ల చర్మం, అంతర్గత కణజాలం దెబ్బతింటున్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరిగింది. దీని వల్ల చాలామంది ఇంటి నుంచి పని చేస్తున్నారు. దీని కారణంగా ల్యాప్‌టాప్‌ల వాడకం ఎక్కువైంది. అయితే ల్యాప్‌టాప్‌ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. రోజంతా ల్యాప్‌టాప్ ఉపయోగించడం వల్ల శరీరంపై చెడు ప్రభావం చూపుతోంది. ల్యాప్‌టాప్ నుంచి వెలువడే వేడి వల్ల చర్మం, అంతర్గత కణజాలం దెబ్బతింటున్నాయి. ల్యాప్‌టాప్ ఎక్కువ సేపు ఒడిలో పెట్టుకొని పని చేయడం వల్ల పురుషుల్లో సంతానలేమి సమస్యలు ఏర్పడుతాయి. అదే సమయంలో ఇంటర్నెట్ కనెక్షన్‌కి రేడియేషన్‌కి సంబంధించినది కాబట్టి ల్యాప్‌టాప్ కంటే వైఫైకి కనెక్ట్ చేయడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతోంది. ల్యాప్‌టాప్ వేడి మహిళల కంటే పురుషులకే ఎక్కువ హాని చేస్తుంది. దీనికి కారణం శరీర ఆకృతి. స్త్రీలలో గర్భాశయం శరీరం లోపల ఉంటుంది. పురుషులలో పునరుత్పత్తి అవయవాలు బయట ఉంటాయి. దీని కారణంగా రేడియేషన్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుంది. అందుకే మగవాళ్లు ల్యాప్‌టాప్‌లు వాడేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అధిక ఉష్ణోగ్రత కారణంగా స్పెర్మ్ నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి సంతానోత్పత్తిలో సమస్యలు ఏర్పడుతాయి. ల్యాప్‌టాప్‌ను ఒడిలో ఉంచుకొని ఎక్కువసేపు పనిచేయడం కంటే ఇది ఇంకా చాలా డేంజర్. తక్కువ ఫ్రీక్వెన్సీ రేడియేషన్ హార్డ్ డ్రైవ్ నుంచి విడుదలవుతుంది. ఇది చాలా ప్రమాదం. దీనివల్ల నిద్రలేమి, తీవ్రమైన తలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ల్యాప్‌టాప్‌ను ఒడిలో ఉంచుకోవడానికి బదులుగా కొంతమంది టేబుల్‌పై పెట్టుకొని పనిచేస్తారు. దీని కారణంగా ల్యాప్‌టాప్ రేడియేషన్ నేరుగా శరీరంపై పడుతుంది. దీని నుంచి వెలువడే వేడి మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుంది. ల్యాప్‌టాప్‌ను నిరంతరం ఉపయోగించడం మానుకోండి. ఇది కండరాలలో నొప్పిని కలిగిస్తుంది.

# బరువు తగ్గించే పిల్స్ వాడుతున్నారా?



వేగంగా బరువు తగ్గాలనే కోరిక, ఊబకాయం పెరుగుదల, శరీర ఆకృతి పట్ల పెరుగుతున్న ఆందోళన... ఈ కారణాలతో బరువు తగ్గించే మాత్రల వాడకం భారతదేశంలో విపరీతంగా పెరిగింది. అయితే, ఈ మాత్రలు నిజంగా సురక్షితమేనా? ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయా, లేక ప్రమాదకరం కావా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిపుణులైన వైద్యులు ఈ బరువు తగ్గించే మాత్రల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలపై కీలక విషయాలను వెల్లడించారు. వేగంగా బరువు తగ్గాలనే ఆశ, ఊబకాయం పెరుగుదల, శరీర ఆకృతిపై పెరుగుతున్న ఆందోళన.. ఈ కారణాలతో బరువు తగ్గించే మాత్రల వాడకం ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగింది. ఈ మాత్రలను సాధారణంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి, వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో లభించే మందులు. మరొకటి, ఓవర్-ది-కౌంటర్ (రూజ) సప్లిమెంట్లు. ప్రిస్క్రిప్షన్‌తో లభించే వాటిలో ఆర్లిస్టాట్ వంటి కొవ్వును గ్రహించకుండా అడ్డుకునేవి, ఫెంటెర్మైన్ వంటి ఆకలిని అణచివేసేవి ఉన్నాయి. అయితే, ఆన్‌లైన్‌లో విక్రయించే, ఫిట్‌నెస్ నిపుణులు ప్రచారం చేసే, ఆయుర్వేద, మూలికా ఫార్ములేషన్లుగా చెప్పబడే ఓటీసీ "బరువు తగ్గించే మాత్రలు" చాలా వరకు నిబంధనలు లేకుండానే అమ్ముడవుతున్నాయి. ఈ మందులు వాడటం ఆపేసిన తర్వాత, ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, జీవనశైలి మారకపోతే, చాలా మంది మళ్లీ బరువు పెరుగుతారని వైద్యులు అంటున్నారు. సొంత వైద్యం, నియంత్రణ లేని సప్లిమెంట్ల వాడకం వలన తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. బరువు తగ్గించే మందుల వలన తరచుగా జీర్ణ సమస్యలు, రక్తపోటు పెరుగుదల, ఆందోళన, నిద్రలేమి, గుండె వేగం పెరగడం వంటి దుష్ప్రభావాలు కలుగుతాయి. కాలేయ నష్టం, హార్మోన్ల మార్పులు, ఇతర మందులతో చర్యలు వంటివి మరింత తీవ్రమైన సమస్యలకు దారి తీస్తాయి. వైద్య సలహా లేకుండా ఈ మందులు వాడినా, ఇతర మందులతో కలిపి తీసుకున్నా ప్రమాదం విపరీతంగా పెరుగుతుందని డాక్టర్ ఖితానీ హెచ్చరించారు. కొందరు ప్రజలు దుష్ప్రభావాలకు ఎక్కువ గురవుతారు. యువతరం, ఒత్తిడికి లోనై, తమ రూపం గురించి ఆందోళన చెందుతూ, నిరూపితం కాని ఉత్పత్తులను వాడతారు. మహిళలలో థైరాయిడ్ సమస్యలు, పీసీఓఎస్‌తో బాధపడేవారు ఈ మందులను విచక్షణారహితంగా వాడితే, అంతర్గత హార్మోన్ల సమస్యలు పెరిగే అవకాశం ఉంది. లివర్ కు రిస్క్.. కొన్ని సందర్భాలలో, ఓటీసీ బరువు తగ్గించే సప్లిమెంట్లను ఎక్కువ కాలం పాటు, అసంబద్ధంగా వాడటం వలన కాలేయ వైఫల్యం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వంటి తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తినట్లు వైద్య నిపుణులు గుర్తించారు. ఇటీవల ఒక యువతి "ఆన్‌లైన్"లో లభించే "సహజ" ఫ్యాట్ బర్నర్‌ను వాడిన తర్వాత, ఆమె శరీరంలో ఆంఫెటమైన్ లాంటి పదార్థాలు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది.

# ఆ సమస్యని దూరం చేయడంలో.. జాజికాయను మించింది లేదు..!



జాజికాయ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఇచ్చే ఒక ప్రత్యేక సుగంధ ద్రవ్యం. ఇది మన ఆరోగ్యాన్ని బాగు చేయడంలో సాయపడుతుంది. ఇందులో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. జాజికాయలో మిరిస్టిసిన్, యూజినాల్, ఐసోయుజెనాల్, సఫ్రోల్ లాంటివి ఉంటాయి. ఇవి మన శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ ఒత్తిడి తగ్గడం వల్ల కణాలు పాడవకుండా ఉంటాయి. ఎక్కువ ఒత్తిడి వల్ల వచ్చే జబ్బులు పెరగకుండా ఇది అడ్డుకుంటుంది. జాజికాయ వాడకం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. మిరిస్టిసిన్ లాంటివి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. డిప్రెషన్, ఆందోళన లాంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. నిద్ర సరిగా రాని వారికి ఇది సాయం చేస్తుంది. మనసును శాంతపరిచి, మంచి నిద్రకు దారితీస్తుంది. జాజికాయలో ఉండే గుణాలు గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్ణం లాంటి సమస్యలను తగ్గిస్తాయి. భోజనం తిన్న తర్వాత కడుపులో కలిగే ఇబ్బందిని తగ్గించడంలో ఇది సహజంగా పనిచేస్తుంది. కడుపుకు సంబంధించిన ఇబ్బందులను దూరం చేస్తుంది. ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులు, జీవక్రియ సమస్యల వల్ల వచ్చే మంటను తగ్గించడంలో జాజికాయ ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే గుణాలు శరీరంలో నొప్పిని, మంటను తగ్గిస్తాయి. నొప్పులు, మంట ఉన్న వారికి ఇది ఒక మంచి పరిష్కారం. జాజికాయ ఒక సహజ ఆఫ్రోడిసియాక్. కొన్ని పరిశోధనలు ఇది లైంగిక కోరికను పెంచుతుందని చూపించాయి. ముఖ్యంగా మగవారిలో ఇది బాగా పనిచేస్తుంది. లైంగిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది సాయం చేస్తుంది. ఒత్తిడిగా ఉన్నవారికి నిద్ర సరిగా పట్టదు. ఇది ఒక సాధారణ సమస్య. రాత్రి పడుకునే ముందు పాలలో కొద్దిగా జాజికాయ పొడి కలిపి తాగితే నాడీ వ్యవస్థకు విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల నిద్ర బాగా పడుతుంది. ఇది మెదడును శాంతపరిచి సహజంగా నిద్ర వచ్చేలా చేస్తుంది. జాజికాయలో చెడు సూక్ష్మజీవులను అడ్డుకునే గుణాలు ఉంటాయి. ఇది నోటిలో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను తొలగించడంలో సాయం చేస్తుంది. దీనివల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. చిగుళ్లకు వచ్చే ఇన్ఫెక్షన్లను కూడా ఆపొచ్చు. చర్మానికి వచ్చే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలను తగ్గించడంలో జాజికాయ ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే బ్యాక్టీరియా నిరోధక గుణాలు చర్మాన్ని శుభ్రంగా ఉంచుతాయి. చర్మం మృదువుగా మారేలా చేస్తాయి. ఇది చర్మ సమస్యలకు ఒక సహజ పరిష్కారం. జాజికాయ చిన్న సుగంధ ద్రవ్యం అయినా.. దాని ఆరోగ్య లాభాలు ఎన్నో. దీన్ని జాగ్రత్తగా.. తగినంత వాడితే శరీర ఆరోగ్యం, మనసు ప్రశాంతత, జీర్ణ శక్తి, చర్మ ఆరోగ్యం మెరుగుపడుతాయి.

# షుగర్ ఉన్నవారు బంగాళాదుంపలు తినొచ్చా..?



బంగాళాదుంపలు వండటానికి సులువుగా ఉంటాయి. రుచికరంగా కూడా ఉంటాయి కాబట్టి చాలా మంది వీటిని ఇష్టపడతారు. అయితే ఆరోగ్యానికి ముఖ్యంగా షుగర్ ఉన్నవారికి ఇవి మంచివా కాదా అనే ప్రశ్న చాలా మందిలో ఉంటుంది. బంగాళాదుంపలలో స్టార్చ్ అనే పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. వాటిని ఉడికించినా లేదా వేయించినా ఈ పిండి పదార్థం శరీరంలోకి త్వరగా చేరి గ్లూకోజ్ గా మారుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే షుగర్ జబ్బు ఉన్నవారు బంగాళాదుంపలను పూర్తిగా తినడం మానేయకపోయినా.. తక్కువ మోతాదులో మాత్రమే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగాళాదుంపలు ఆరోగ్యానికి పూర్తిగా చెడు అని చెప్పడం సరికాదు. వాటిని ఎలా వండుతున్నాం అనేది ముఖ్యం. ఉదాహరణకు బంగాళాదుంపలను నూనె లేకుండా కాల్చడం లేదా తక్కువ నూనెతో గ్రిల్ చేయడం మంచి పద్ధతులు. ఇలా చేయడం వల్ల ఎక్కువ కొవ్వు చేరదు.. పోషకాలు కూడా కొంతవరకు అలాగే ఉంటాయి. అయినప్పటికీ షుగర్ ఉన్నవారు వీటిని తరచుగా లేదా ఎక్కువ మొత్తంలో తినడం మాత్రం మానేయాలి. బంగాళాదుంపలకు బదులుగా చిలగడదుంపలు తినడం చాలా మంచిది. వీటిలో షుగర్ పెంచే గుణం తక్కువగా ఉంటుంది. అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నెమ్మదిగా పెంచుతాయి. అంతేకాదు వీటిలో ఫైబర్, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. షుగర్ ఉన్నవారికి చిలగడదుంపలు ఒక మంచి ప్రత్యామ్నాయం. మనం తినే ఆహారం సరైన మోతాదులో, సమతుల్యంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచి చేస్తుంది. బంగాళాదుంపలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే వాటిని ఎక్కువగా తింటే రక్తంలో షుగర్ స్థాయి పెరగడం, బరువు పెరగడం వంటి సమస్యలు రావచ్చు.

# పడుకునే ముందు దిండు కింద వెల్లుల్లి పెట్టుకుంటే..

నేటి ఆధునిక జీవనశైలిలో నిద్రలేమి ఒక పెద్ద సమస్యగా మారింది. చాలామంది రాత్రుళ్లు ప్రశాంతంగా నిద్రపట్టక ఇబ్బందులు పడుతుంటారు. ఇది శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అయితే, కొన్ని సులువైన ఇంటి చిట్కాలతో ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాంటి అద్భుతమైన చిట్కాలలో ఒకటి, వెల్లుల్లిని దిండు కింద ఉంచుకోవడం. భారతీయ వంటకాల్లో వెల్లుల్లికి ప్రత్యేక స్థానం ఉంది. ఇది కేవలం రుచి, సువాసన కోసమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మనకు తెలియని ఎన్నో లాభాలు వెల్లుల్లిలో దాగి ఉన్నాయి. ఇటీవలి అధ్యయనాల ప్రకారం, వెల్లుల్లి మానవులకు మంచి నిద్రను అందించడంలో గణనీయంగా సహాయపడుతుంది. రాత్రి పడుకునే ముందు దిండు కింద ఒక వెల్లుల్లి రెబ్బను ఉంచుకుంటే, మీరు అనేక ప్రయోజనాలను పొందవచ్చు. వెల్లుల్లి పోషకాలకు నిలయం. ఇందులో విటమిన్-బి6, థయామిన్, పాంథోతేనిక్ యాసిడ్, విటమిన్-సి వంటి విటమిన్లు, అలాగే మాంగనీస్, ఫాస్ఫరస్, కాల్షియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. నిద్రకు ముందు దిండు కింద వెల్లుల్లిని ఉంచడం వల్ల దోమల బెడద తగ్గుతుంది. దీని సువాసన గది అంతా వ్యాపించి జలుబు, దగ్గు నుండి రక్షణ కల్పిస్తుంది. నిద్రలేమితో బాధపడేవారికి కూడా ఇది సహాయపడుతుంది. నిజానికి, వెల్లుల్లిలో ఉండే విటమిన్ బి1, బి6లు నాడీ వ్యవస్థకు మెలటోనిన్‌ను చేరవేయడంలో సహాయపడతాయి. ఇది ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. ఇందులో ఉండే యాంటీ-టాక్సిన్ గుణాలు ముక్కు దిబ్బడను తగ్గించి, ఇన్‌ఫెక్షన్లు శ్వాసకోశ సమస్యల నుండి రక్షిస్తాయి. దిండు కింద ఒక వెల్లుల్లి రెబ్బను ఉంచడం వల్ల నిద్ర మెరుగుపడుతుంది. నిద్ర సంబంధిత రుగ్మతలు దూరమవుతాయని ప్రాచీన కాలం నుంచి నమ్మకం ఉంది. వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ వల్ల వచ్చే ఘాటైన వాసన నిద్రను ప్రేరేపించి, ప్రశాంతమైన ప్రభావాన్ని చూపుతుందని శాస్త్రీయంగానూ చెబుతున్నారు. దిండు కింద వెల్లుల్లి రెబ్బను ఉంచడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. అయితే, మీకు వెల్లుల్లి ఘాటు వాసన నచ్చకపోతే, వెల్లుల్లితో తయారుచేసిన పానీయం కూడా మీ నిద్ర సమస్యలను సరిచేయగలదు. ఇందులో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది.

ఇది నిద్రను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి వాసనను నేరుగా తీసుకోలేకపోతే, దాని రసాన్ని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా చేయడం వల్ల వెల్లుల్లి వాసన బాధించదు, ప్రయోజనాలు లభిస్తాయి. దీన్ని నిద్రకు ముందు తాగడం మంచిది. దీనికోసం ముందుగా ఒక చిన్న గిన్నెలో ఒక వెల్లుల్లి రెబ్బను వేడి చేయండి. తరువాత, ఒక గ్లాసు పాలు వేయండి. వేడి చేసి, రుచికి సరిపడా చక్కెర తేనె కలపండి. ఈ పాలను



# కేసముద్రం పోలీసుల బైక్ పెట్రోలింగ్.

**-రాత్రివేళ అనవసర తిరుగుళ్లు మానుకోవాలి**

**- సిఐ సత్యనారాయణ.**



మహబూబాబాద్, జూన్ 07(భారత శక్తి):రాత్రి 10 తర్వాత యువత ఎవరూ రోడ్లపై అనవసరంగా తిరుగరాదని కేసముద్రం సిఐ సత్యనారాయణ యువతకు సూచించారు. శనివారం రాత్రి కేసముద్రం మండలంలో గంజాయి నిర్మూలన కొరకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ ఐపిఎస్ ఉత్తర్వుల మేరకు కేసముద్రం మున్సిపల్ పరిధిలో కేసముద్రం సర్కిల్ ఫోర్స్ తో సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో నైట్ బైక్ పెట్రోలింగ్ నిర్వహించారు. గంజాయి సేవించే ప్రదేశాలను ప్రత్యేకంగా గుర్తించిన ఏరియాలో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు. 5 గురు అనుమానితులను గుర్తించి గంజాయి టెస్ట్ కిట్ తో పరీక్షలు నిర్వహించగ నెగటివ్ వచ్చినట్లు సిఐ తెలిపారు. రాత్రి 10 గంటల తరువాత ఎవరు అనవసరంగా రోడ్ల పైన తీరుగరాదనీ, తల్లితండ్రులు పిల్లల విషయం లో ప్రత్యేక శ్రద్ధ చూపించి పిల్లలు రాత్రి పూట బయట అనవసరంగా తిరగడం నియంత్రించాలన్నారు.

# ఆలయ వార్షిక ఉత్సవాలు



నిజామాబాద్, జూన్ 7, భారత్ శక్తి: ఏర్గట్ల మండల కేంద్రంలో స్థానిక రజక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో రజకుల ఆరాధ్య దైవమైన శ్రీ మడేలయ్య స్వామికి ఐదవ ఆలయ వార్షికోత్సవ సందర్భంగా బోనాల కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. సంఘ మహిళలు బోనాలెత్తి డప్పు వాయిధ్యాలతో తీసుకెళ్లి మడెలెయ్య స్వామికి నైవేద్యంను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండలని సంఘ సభ్యులు స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాల పరామర్శ



నిజామాబాద్, జూన్ 7, భారత శక్తి: ఏర్గట్ల మండలంలోని పలు గ్రామాలల్లో తెలంగాణ సహకార సంఘాల డెవలప్మెంట్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పర్యటించారు. తడపాకల్ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై సునీత అనే వివాహిత మృతి చెందింది, వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందించారు. తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త లాల్ సింగ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజేందర్ తండ్రి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు దేవరెడ్డి, ఆడెం గంగా ప్రసాద్, జీవన్ రెడ్డి, పెద్దిరెడ్డి రవి, నాగేంద్ర నగర్ సర్పంచ్ సంధి రంజిత్, గుమ్మిర్యాల్ సర్పంచ్ సంజీవ్, లింగారెడ్డి, ఉప సర్పంచ్ రాజు , మునీర్, రేండ్ల రమేష్, వెంకట్ రెడ్డి, సృజన్, అన్వేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మృగశిర కార్తె



**- రకాన్ని బట్టి డిమాండ్**

**- చేపల విక్రయానికి మార్కెట్లు సిద్ధం**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 7 (భారతశక్తి ): మృగశిర అనగానే గుర్తుకు వచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభ రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తుంది. మృగశిర కార్తితో వర్షాకాలం ప్రారంభమైందని అంటారు, కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ప్రధానంగా ఉబ్బసం ,ఆయాసం ఉన్నవారికి ఈ చేపలు ఎంతో మంచివి .వేసవిలో ఉష్ణోగ్రతలతో శరీరంలో వేడి ఎక్కువ ఉంటుందని అది చేపలు తినడం వల్ల దూరం అవుతుందనేది పెద్దల మాట. దీంతోపాటు పెరిగిన సమతుల్యం ,హృదయ సంబంధిత వ్యాధుల నివారణకు చేపలు తినడం మంచిదని చెబుతారు. రోహిణి కార్తిలో వేడెక్కిన శరీరం చల్లబడెందుకు పోషిక విలువలు పొందేందుకు జేబులు తినాలనేది ఆనవాయితీగా వస్తుంది ఈ క్రమంలో మృగశిర రోజున చేపలకు మంచి గిరాకీ ఉంటుంది.

### ఫిష్ మార్కెట్లు సిద్ధం

మృగశిర కార్తె రోజు చేపలు తినాలని అనవాయితీ ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని చేపల మార్కెట్లు సిద్ధం చేశారు గ్రామాల్లో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు వాగుల్లో చేపలను పట్టి మార్కెట్లకు తరలించేందుకు వ్యాపారాలు సిద్ధమయ్యారు. గ్రామీణ ప్రాంతంలో వాడవాడ తిరుగుతూ వ్యాపారులు చేపలు విక్రయిస్తారు. మృగశిర రోజు రెట్టింపు ధరలైన వినియోగదారులు కొనుగోలు చేసేందుకు వెనుకాడరు. సాధన రోజుల కంటే చేపలు విపరీతంగా పెరుగుతాయి. అయినా మత్స్య ప్రియులు కొనేందుకు వెనుకాడరు. బొమ్మ చేప ధర సాధారణ రోజుల కిలో 400 ఉండగా కార్తె రోజు కిలో 500 నుంచి 600 రెట్టింపు ధర పలుకుతుంది రవ్వ ,బొచ్చే ,బంగారు తీగ ,మెరుగ, అలగ చేప , జెల్లెలు ,పాపేర్లు రకరకాల చేపలు ఉండగా వీటి ధర సాధారణ రోజుల్లో కిలో 120 నుంచి 150
ఉండగా మృగశిర రోజు రూ 200 నుంచి 250 వరకు విక్రయిస్తారు.

### ఆరోగ్యదాయకం ఇంగువ బెల్లం

శారీరక ఆరోగ్యం కోసం ఈ కార్తెలో శాఖాహారులు ఇంగువ ,బెల్లం తింటారు. ఈ రెంటిని కలిపి చిన్న చిన్న ముద్దలు చేసి పరిగడప తింటారు. ఇంగువకు చలువ చేసే శక్తి ,బెల్లానికి జీర్ణం చేసే శక్తి ఉంటుంది . విపరీతమైన ఎండలతో తల్లడిల్లిన జనానికి ఒకసారి రుతువు మారడంతో శరీరంలో తలెత్తే రుగ్మతలు దీన్ని తినడంతో నశిస్తాయని పెద్దలు చెబుతుంటారు.

### ఉచిత చేప మందు పంపిణీ

దండేపల్లి మండల కేంద్రంలో మృగశిర కార్తె ప్రవేశాన్ని పురస్కరించుకుని ఉబ్బసం వ్యాధి నివారణకు మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 9వ తేదీన ఉదయం 5 గంటల నుండి ఉచిత చేపమందు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ అజ్మీర రాజేశ్వర నాయక్, ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, కట్ట వెంకటేష్ తెలిపారు. చేప మందు కోసం వచ్చేవరకు ఇలాంటి పగలకుండా ఏర్పాటు చేశామని తెలిపారు వివరాలకు 9640376530, 9346667925, 9701058837, 9989599857 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

# జులై చివరి నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

**- ఏఐసిసి సభ్యులు - రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 7: ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు.ఆదివారం చివ్వేంల మండలంలోని తుల్జారావు పేట గ్రామంలో లావురి బేబీ నాగరాజు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.ఎన్నో సంవత్సరాలుగా సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఇప్పుడు ఇంద్రమ్మ ఇళ్ల పథకం ద్వారా గౌరవప్రదమైన జీవనం అందుతోందన్నారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఒక ఆత్మగౌరవం. ఆ గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అందించేందుకు కట్టుబడి ఉంది అని పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని తెలిపారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇళ్లు అందజేస్తూ సొంతింటి కలలను నిజం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు.గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సమాన ప్రాధాన్యతతో ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు మహిళల ఆర్థిక సాధికారత కోసం మహాలక్ష్మి పథకం, రైతులకు రైతు భరోసా, ఉచిత విద్యుత్, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్, యువతకు ఉపాధి అవకాశాలు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి హామీని అమలు చేస్తున్నామని, పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెన్నోజు నర్సింహా చారి, గ్రామా శాఖ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ మురారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తిపాక వేణుధర్, బానోతు బాలాజీ, దారావత్ మోహన్ బాబు, వార్డు సభ్యులు గుగులోతు చిలకమ్మా, గుగులోతు రామ్మూర్తి, గుగులోతు రజిత, పత్తిపాక రఘురాం, దారావత్ రాక్లి, భూక్యా శివరామకృష్ణ, పత్తిపాక రాధాకృష్ణ, పత్తిపాక భిక్షమయ్య, బానోతు సైదులు, గుగులోతు సైదులు, గుగులోతు మోతిలాల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం,



జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరెని శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి,సేవదల్ చీఫ్ ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగు నాయక్, మద్దెబోయిన శ్రీనివాస్, చెంచల నిఖిల్, శ్రీ హర్ష చౌదరి, గుణగంటి సైదులు, పెద్ది అంజయ్య, బొప్పాని లలిత్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చురీలో మృగాడు: శవాలకూ తప్పని నగ్నత్వ నరకం!

- **బీదర్ 'బ్రిమ్స్' ఆసుపత్రిలో దారుణం.. మహిళల శవాలను వివస్త్రలను చేసి మొబైల్‌లో ఫోటోలు తీసిన అటెండెంట్. నిందితుడు మునీర్ అహ్మద్ అరెస్ట్**
- **వైద్యుడి ఫిర్యాదుతో వెలుగులోకి కీచక పర్వం - తీవ్రంగా స్పందించిన మహిళా కమిషన్..**
- **సుమోటోగా కేసు నమోదు.. - సమగ్ర నివేదిక కోరుతూ ఆరోగ్య శాఖకు ఆదేశాలు!**





బెంగళూరు, భారత శక్తి ప్రతినిధి, జూన్ 07: మానవత్వం మంటగలిసింది. చనిపోయిన తర్వాత కూడా మహిళల మృతదేహాలకు గౌరవం దక్కలేదు. కన్నబిడ్డలా, తోబుట్టువులా కాపాడాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలోనే ఒక కామాంధుడు మృతదేహాల పట్ల అత్యంత అనాగరికంగా ప్రవర్తించాడు. కర్ణాటకలోని బీదర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (దీ=×మీా) టీచింగ్ హాస్పిటల్‌లో ఈ ఘోరమైన ఉదంతం వెలుగు చూసింది. పోస్ట్‌మార్టం నిమిత్తం వచ్చే మహిళల శవాలను నగ్నంగా మార్చి, తన మొబైల్ ఫోన్‌లో ఫోటోలు, వీడియోలు తీసుకుంటున్న మార్చురీ అవుట్‌సోర్సింగ్ అటెండెంట్ మునీర్ అహ్మద్ (40) ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు.

### -అదును చూసి ఘాతుకం..

### రహస్య ఫోల్డర్లలో ఫోటోలు

పోలీసుల కథనం ప్రకారం మునీర్ అహ్మద్ గత కొన్నేళ్లుగా బ్రిమ్స్ ఆసుపత్రి మార్చురీలో అటెండెంట్‌గా పని చేస్తున్నాడు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు లేదా అనారోగ్యంతో చనిపోయి పోస్ట్‌మార్టం కోసం వచ్చే మహిళల శవాలపై ఈ కీచకుడు కన్నేశాడు. వైద్యులు, సిబ్బంది ఎవరూ లేని సమయం చూసి, శవాల దుస్తులు తొలగించి తన వ్యక్తిగత మొబైల్ ఫోన్‌తో నగ్న చిత్రాలను చిత్రీకరించేవాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆ ఫోటోలను తన మొబైల్‌లోని సీక్రెట్ ఫోల్డర్లలో దాచిపెట్టేవాడు.

### -డాక్టర్ ఫిర్యాదుతో వెలుగులోకి..

కొన్ని రోజులుగా మునీర్ ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆసుపత్రి ఫోరెన్సిక్ విభాగం హెడ్ డాక్టర్ మోసినూల్ హక్ అంతర్గతంగా నిఘా పెట్టారు. అతడి ఫోన్‌ను తనిఖీ చేయగా ఈ దారుణం బయటపడింది.
దీంతో డాక్టర్ మోసినూల్ హక్ మే 25న బీదర్ న్యూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. అందులో అనేకమంది మహిళల శవాల నగ్న ఫోటోలు లభ్యమవడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు.

### - సోషల్ మీడియాలో వైరల్.. రంగంలోకి మహిళా కమిషన్

ఈ ఫోటోలను నిందితుడు నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఇంటర్నెట్‌లో షేర్ చేసినట్లు సమాచారం రావడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాన్ని కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది.

మహిళల గోప్యతకు, మానవ హక్కులకు భంగం కలిగించిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖను కమిషన్ ఆదేశించింది.

### - కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు

మృతదేహాల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వైద్య నైతికతను ఉల్లంఘించడంపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. నిందితుడు మునీర్ అహ్మద్‌పై భారతీయ న్యాయ సంహిత (దీచీా) చట్టంలోని సంబంధిత కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దారుణంలో అతడికి ఇంకా ఎవరైనా సహకరించారా? ఈ ఫోటోలను ఎవరికైనా విక్రయించాడా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ ఘటనతో రోగుల కుటుంబాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

# సేఫ్టీ బెల్ట్ లేకుండా 80 కిలోల బరువు..

## 40 రోజులు నరకం చూశానన్న రకుల్ ప్రీత్ సింగ్!



ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా వెల్లడించింది. జిమ్‌లో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా వర్కవుట్ చేయడం వల్లే తాను పెద్ద ప్రమాదంలో పడ్డానని ఆమె తెలిపారు. ఇటీవల నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న ‘డబుల్ డేట్’ టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో ఎలాంటి సేఫ్టీ బెల్ట్ ధరించకుండా 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎత్తడానికి ప్రయత్నించానని, ఆ చిన్న పొరపాటు వల్ల తనకు తీవ్రమైన స్లిప్ డిస్క్ సమస్య వచ్చిందని చెప్పారు. ఆ గాయం కారణంగా తాను ఏకంగా 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామమని, అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమేనని రకుల్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ ప్రమాదం వల్ల కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని వివరించారు. ఎప్పుడూ ఎంతో చురుకుగా ఉండే తాను, కనీసం రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ గాయం తనను శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎంతో కృంగదీసిందని రకుల్ కన్నీరు పెట్టారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు కొండంత అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె కొనియాడారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను కూడా ఈ షోలో పంచుకున్నారు. ప్రస్తుతం రకుల్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## సమాజంలో జరిగే ప్రతిదానికీ

# సినిమాలే కారణం కాదు

### - అనసూయ ఆసక్తికర వ్యాఖ్యలు



యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియాలో తాజాగా చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో జరిగే ప్రతి విషయాన్నీ సినిమాలతో ముడిపెట్టడం సరైన విధానం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. సినిమా అనేది ప్రధానంగా ఒక కల్పిత కథ మాత్రమేనని, సమాజాన్ని మార్చడం లేదా ప్రజలకు విలువలు నేర్పించడం పూర్తిగా సినిమాల బాధ్యత కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు అనసూయ తన సోషల్ మీడియా ఖాతాలో సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకున్నారు. వ్యక్తులుగా మంచి, చెడులను గుర్తించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనే ఉంటుందని పేర్కొన్న ఆమె, పిల్లలకు విలువలు నేర్పించే బాధ్యత కూడా సినిమాలది కాదని అభిప్రాయపడ్డారు.

అయితే కథలు చెప్పే రచయితలు, దర్శకులు, నిర్మాతలు, నటులు తమ సృజనాత్మక బాధ్యతను పూర్తిగా విస్మరించకూడదని అన్నారు. సినిమా ఎంతో శక్తివంతమైన మాధ్యమమని, అది ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయగలదని అనసూయ పేర్కొన్నారు. గతంలో హీరో, విలన్ పాత్రల మధ్య స్పష్టమైన తేడా ఉండేదని, ప్రేక్షకులు ఏది అనుసరించాలో, ఏది అనుసరించకూడదో సులభంగా అర్థం చేసుకునేవారని చెప్పారు. కానీ ప్రస్తుతం కథలు, పాత్రలు మరింత సంక్లిష్టంగా మారడంతో మంచి-చెడు మధ్య ఉన్న గీత కొన్నిసార్లు మసకబారుతోందని అభిప్రాయపడ్డారు. తాను ఇలాంటి అంశాల గురించి మాట్లాడినప్పుడల్లా సెన్సార్‌షిప్ లేదా మోరల్ పోలీసింగ్‌కు మద్దతు ఇవ్వడం కాదని అనసూయ స్పష్టం చేశారు. కథలను సృష్టించే ప్రతి ఒక్కరూ వాటి ప్రభావం గురించి అవగాహన కలిగి ఉండాలని మాత్రమే కోరుకుంటున్నానని తెలిపారు. ఇదే ఆలోచనతో గతంలో ఒక టెలివిజన్ షోను కూడా వదిలేశానని, తన అభిప్రాయాలు ఆ కార్యక్రమం సృజనాత్మకతకు అడ్డుగా మారుతున్నాయని భావించి ఆ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సృజనాత్మక స్వేచ్ఛ ఎంతో అవసరమని, అయితే ఆ స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉండాలనే అవగాహన సమాజంలో పెరగాలని అనసూయ అన్నారు. సినిమాలు సమాజానికి తల్లిదండ్రుల్లా మారాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అవి ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోవద్దని పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతి చర్యకు సినిమానే కారణమని తాను నమ్మనని చెప్పిన అనసూయ, సోషల్ మీడియాలో ఇలాంటి అంశాలపై చర్చలు జరగడం, కథనాలను ప్రశ్నించడం, విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం సానుకూల పరిణామమని అభిప్రాయపడ్డారు. అవసరమైనప్పుడు ప్రశ్నించడం సృజనాత్మకతపై దాడి కాదని, అది అవగాహన పెంచే ప్రక్రియ మాత్రమేనని ఆమె పేర్కొన్నారు.

# వచ్చేస్తోంది బిగ్ బాస్ 10..

## నాగార్జున ‘దశావతారం’ ప్రోమో వచ్చేసింది!




బుల్లితెరపై అత్యంత ప్రేక్షకాదరణ పొందిన రియాలిటీ షో ‘బిగ్ బాస్ తెలుగు’ పదో సీజన్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ షో, ఇప్పుడు ఒక మైలురాయి లాంటి పదో సీజన్‌లోకి అడుగుపెడుతోంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ సీజన్‌కు ‘దశావతారం’ అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ స్టార్ మా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ అధికారిక ప్రోమోను విడుదల చేశాయి.

### ఏమిటీ ‘దశావతారం’ కాన్సెప్ట్?

తాజాగా విడుదలైన ప్రోమోలో హోస్ట్ అక్కినేని నాగార్జున సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపించారు. పదో సీజన్ కావడంతో, ఈ పదేళ్ల ప్రయాణాన్ని గుర్తుచేస్తూ పది రకాల సరికొత్త అవతారాలతో వినోదం, డ్రామా, ట్విస్టులు అంతకుమించి ఉంటాయని నాగార్జున హింట్ ఇచ్చారు. ఈ ప్రోమో ద్వారా షోపై అంచనాలను భారీగా పెంచే ప్రయత్నం చేశారు. ఈ ప్రత్యేకమైన సీజన్ కోసం బిగ్ బాస్ హౌస్‌ను కూడా గతంలో కంటే వినూత్నంగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.

### ప్రేక్షకుల్లో ఎందుకీ సందేహాలు?

ప్రోమో ద్వారా అంచనాలు పెంచడం బాగానే ఉన్నా, గత అనుభవాల దృష్ట్యా కొందరు నెటిజన్లు, ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు. గత సీజన్‌లో ‘ఉల్టా-పుల్టా’ అంటూ భారీ హైప్ ఇచ్చినా, చివరికి షో రొటీన్ టాస్కులు, గ్రూపిజం, అవే గొడవలతోనే సాగిందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూడా ‘దశావతారం’ అంటూ క్లాస్ ప్రోమో వదిలారు కానీ, షో ప్రారంభమయ్యాక కంటెంట్ నిజంగా కొత్తగా ఉంటుందా లేక ఎప్పటిలాగే నీరసంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అవుతున్న మేకర్స్, కంటెంట్ విషయంలో తేలిపోతున్నారనేది ప్రధాన విమర్శ.

### కంటెస్టెంట్ల వేట షురూ

ప్రస్తుతం బిగ్ బాస్ నిర్వాహకులు పదో సీజన్ కోసం కంటెస్టెంట్ల వేటలో నిమగ్నమయ్యారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, బుల్లితెర నటీనటులు, కొంతమంది వివాదాస్పద సెలబ్రిటీలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

వీలైనంత త్వరగా ఈ సీజన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తంమీద, ‘దశావతారం’ కాన్సెప్ట్‌తో బిగ్ బాస్ 10పై భారీ అంచనాలే ఉన్నాయి. అయితే, కేవలం ప్రోమోలకే పరిమితం కాకుండా, కంటెంట్‌లో కూడా కొత్తదనం చూపిస్తేనే ఈ ల్యాండ్‌మార్క్ సీజన్ విజయవంతం అవుతుందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు.

# అలాంటి పాత్రలకు మమ్మల్ని ఎందుకు నిందిస్తారు?

### - డింపుల్ హయతి ఆవేదన



టాలీవుడ్ నటి డింపుల్ హయతి సినీ పరిశ్రమలో హీరోయిన్లకు ఇస్తున్న పాత్రలపై, వారిని నిందించే ధోరణిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలహీనమైన పాత్రలు చేసినందుకు నటీమణులను నిందించడం సరికాదని, అసలు తప్పు అలాంటి పాత్రలే అమ్ముడవుతాయని నమ్మే వ్యవస్థది, దర్శకనిర్మాతలదని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. ‘పెద్ది’లో జాన్వీ కపూర్ వంటి స్టార్ హీరోయిన్ కు ఇచ్చిన పాత్రపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో డింపుల్ హయతి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. “ఈ రోజు మనం నటీమణుల పాత్రలు ఎలా రాస్తున్నారు అనే దాని గురించి మాట్లాడుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక పాత్ర చేసిన తర్వాత వెంటనే ఆ నటిని నిందించే ధోరణి కనిపిస్తోంది. కానీ, దయచేసి నటిని నిందించకండి. వ్యవస్థను, మేకర్స్‌ను నిందించండి. ఎందుకంటే, ఏది అమ్ముడుపోతుందని వారు నమ్ముతారో, అలాంటి పాత్రలనే సృష్టిస్తారు. మేము నటీనటులుగా, మాకు లభించిన అవకాశాల పరిధిలోనే పనిచేస్తాం. వాటితోనే పెద్ద సినిమాలు చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ఆశిస్తాం. ఒకవేళ పాత్రలు బలంగా లేకపోతే, ఆ బాధ్యత ఆ పాత్రను పోషించిన నటిపై కాకుండా, ఆ కథను రాసిన రచయితలు, తీసిన దర్శకులపైనే ఎక్కువగా ఉంటుంది. దురదృష్టవశాత్తు, మేము పోషించే పాత్రల వల్ల మమ్మల్ని ఒక మూసలో బంధించేస్తున్నారు. మా పూర్తి నటనను ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండానే ఒక ఇమేజ్‌ను కట్టబెడుతున్నారు. అదే హీరో సెంట్రిక్ కథల విషయానికొస్తే, వారికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మనం ఏది చూస్తామో దాన్నే నమ్ముతాం. కానీ, సినిమా నిర్మాణం వెనుక ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇది ఒక్కరి చేతిలో ఉండే నిర్ణయం కాదు. అయితే, మనందరం కలిసి ఏకగ్రీవంగా ఒక విషయాన్ని చెప్పగలం. మనం ఇంకా మంచి అనుభవాలకు, మెరుగైన చిత్ర నిర్మాణానికి అర్హులం. దాని కోసం అందరం కలిసి నిలబడాలి” అంటూ ట్వీట్ చేశారు.



## భావోద్వేగ ప్రేమకథ

హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న యువతరం సినిమా ‘తెల్ల కాగితం’. రమేష్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మలపాటి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉన్నది.

ప్రచారంలో భాగంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. యువతరం మెచ్చే యూత్‌ఫుల్ ఎమోషనల్ ప్రేమకథగా ఈ సినిమా రాబోతున్నదని ఫస్ట్‌లుక్ చెబుతున్నది. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, యువతకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.

# ది నైట్ ఆఫ్ ది స్టార్స్ మ్యూజిక్ షో



‘ది నైట్ ఆఫ్ ది స్టార్స్’ పేరుతో ఈ నెల 12న హైదరాబాద్‌లో సంగీత విభావరి జరగనుంది. ఈ వేడుకలో సంగీత దర్శకుడు కల్యాణి మాలిక్, సింగర్స్ గీతా మాధురి, సాకేత్, వినూత్న, కశ్యప్, అదితి, భార్గవి తమ పాటలతో అలరించబోతున్నారు యూట్యూబర్ విజయేంద్ర సింహ ఈ వేడుకను ఆర్గనైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 23ఏళ్ల తర్వాత కల్యాణి మాలిక్ ఆధ్వర్యంలో మ్యూజిక్‌షోను నిర్వహించడం ఆనందంగా ఉందని, ఇందులో నోస్టాల్జిక్ పాటల్ని ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తామని తెలిపారు. హైదరాబాద్ వార్తలు తన మొదటి సినిమా ‘ఐతే’ విడుదలైనప్పుడు ఎంత ఆనందంగా ఉన్నానో.. ఈ షో విషయంలో అంతే హ్యాపీగా ఉన్నానని, తప్పకుండా ప్రేక్షకుల్ని అలరించే మ్యూజిక్ షో అవుతుందని కల్యాణి మాలిక్ పేర్కొన్నారు.

# అన్నదమ్ముల మధ్య ట్వీట్ వార్

**విజయవాడ(భారత శక్తి):** విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆయన సోదరుడు మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మధ్య మళ్లీ ట్వీట్ వార్ మొదలైంది. దాదాపు ఏడాది విరామం తర్వాత ఈ ఇద్దరు సోషల్ మీడియా వేదికగా పరస్పరం విమర్శలు చేసుకుంటుండగా, వారి సన్నిహితులు కూడా పరుష వ్యాఖ్యలతో కామెంట్లు పెడుతూ రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. ఎంపీ చిన్న అనుచరుల మధ్య అక్రమ సంపాదన విషయమై గొడవలు జరుగుతున్నాయని, ఓ వ్యక్తి చేతులపై యాసిడ్ తో దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ ఎంపీ నాని అనుచరుడు పెట్టిన వాట్సాప్ సందేశం తీవ్ర రచ్చకు దారితీసిందని చెబుతున్నారు. ఇదే వ్యవహారంపై జాతీయ మానవహక్కుల సంఘంతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు మాజీ ఎంపీ నాని.ఎంపీ చిన్ని, మాజీ ఎంపీ నాని సొంత అన్నదమ్ములే అయినప్పటికీ, రాజకీయంగా ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందని అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. కానీ, తమ్ముడు, ఎంపీ చిన్నిని టార్గెట్ చేస్తూ ఆయన సోషల్ మీడియాలో పెద్ద యుద్ధమే చేస్తున్నారని చెబుతున్నారు. అయితే ఏం అయిందో కానీ, నాని కొన్నాళ్లుగా సైలెంటు అయ్యారు. దాదాపు ఏడాది క్రితం ఎంపీ చిన్ని టార్గెట్ గా వరుస ట్వీట్ లు పెడుతూ తమ్ముడిని గుక్క తిప్పుకోనీయకుండా చేశారని అంటున్నారు. ఇదే సమయంలో ఎంపీ చిన్ని కూడా అదే స్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ ఇద్దరి మధ్య ఫైట్ తో విజయవాడ రాజకీయం వాడివేడిగా ఉండేది ఇక ఏడాదిగా ఇద్దరి మధ్య డైలాగ్ వార్ కు విరామం వచ్చిందని అంటున్నారు. ఇదే సమయంలో ఎంపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీ కేశినేని నాని అనుచరుడిపై ఎంపీ చిన్ని అనుచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం మాజీ ఎంపీ అనుచరుడి నుంచి ఎంపీ చిన్ని అనుచరుడికి వాట్సాప్ లో ఓ సందేశం వచ్చినట్లు చెబుతున్నారు. అందులో రూ.27 కోట్ల అక్రమ లావాదేవీలకు సంబంధించి ఆరోపణలు చేయడంతోపాటు ఓ వ్యక్తిపై యాసిడ్ దాడి జరిగిందని, దీనికి సంబంధించి కొందరు వ్యక్తులు పరారీలో ఉన్నారని ఆ సందేశంలో పేర్కొన్నారు.". ఈ విషయం ఎంపీ దృష్టికి వెళ్లడంతో వాట్సాప్ లో సందేశం పంపిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొన్నాళ్లుగా సైలెంటుగా ఉన్న మాజీ ఎంపీ నాని రంగంలోకి దిగారని చెబుతున్నారు. నా చిన్ననాటి స్నేహితుడిపై తప్పుడు ఆరోపణలతో క్రిమినల్ కేసులు పెడుతున్నారని, ముందస్తు సమాచారం లేకుండా ఆయన ఇంటిలో పోలీసులు తనఖీలు చేస్తున్నారని మండిపడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును ట్యాగ్ చేస్తూ జాతీయ మానవహక్కుల కమిషన్ కు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత మరో పోస్టు చేస్తూ ఎంపీ అక్రమ సంపాదనపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో స్పందించిన ఎంపీ చిన్న ఘాటుగా స్పందించారు. 'కొందరు తమ జీవితాలను పుకార్లు సృష్టించడంలో ఇతరులను రెచ్చగొట్టడంలో ప్రతికూలతలను వ్యాప్తి చేయడంలో అవే అబద్ధాలను పదేపదే చెప్పడంలో గడిపేస్తారు. నేను నా జీవితాన్ని నిర్మాణానికి సేవ చేయడానికి ఫలితాలను అందించడానికి విజయవాడను ముందుకు నడిపించడానికి కేటాయించాలని ఎంచుకున్నాను' అంటూ ట్వీట్ చేశారు. ఇదే సమయంలో ఎంపీకి మద్దతుగా ఆయన అనుచరులు సైతం భారీగా ట్వీట్ చేశారు. అటు మాజీ ఎంపీ అనుచరులు సైతం అంతే దీటుగా స్పందించడంతో గురువారం రోజంతా ఇద్దరి మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు హోరెత్తాయి.

### జిల్లా అంతా ఇంతేనా

ఏపీలో అధికార తెలుగుదేశం పార్టీకి కృష్ణాజిల్లా తలనొప్పిగా మారుతోంది. తెలుగుదేశం పార్టీకి ఈ జిల్లా పెట్టని కోట. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలతో టిడిపిలో ఒక రకమైన విభేదాలు కనిపిస్తున్నాయి. దానికి కారణం లేకపోలేదు. కొత్త, పాత నేతల మధ్య ఆధిపత్య పోరే కారణం. మొన్నటివరకు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని వర్సెస్ తిరువూరు ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు అన్నట్టు నడిచింది వ్యవహారం. ఇంకోవైపు మైలవరంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వర్సెస్ మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నట్టు ఉంది పరిస్థితి. మరోవైపు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని వ్యవహారం కూడా తీవ్ర దమారం రేపు తోంది. నిత్యం ఆయన సోదరుడు కేశినేని నాని సంచలన ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే పరిస్థితి మాత్రం తెలుగుదేశం పార్టీలో అదుపుతప్పుతోందని అర్థం అవుతోంది.తిరువూరు ఎమ్మెల్యేగా ఉన్నారు కొలికపూడి శ్రీనివాసరావు. అమరావతి ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన శ్రీనివాసరావుకు మంచి పేరు ఉండేది. విద్యావేత్త కూడా. సబ్జెక్టు పై స్పష్టమైన అవగాహన ఉంది. కానీ ఆయన దూకుడుగా ఉంటారు. చాలా ఆవేశంగా మాట్లాడతారు. ఈ అంశం పైన అయినా వేగంగా స్పందిస్తారు. ఈ క్రమంలోనే ఆయన అత్యంత వివాదాస్పదుడు అయ్యారు. సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకించడంతో టీడీపీ హై కమాండ్ ఎంపీ కేసినేని చిన్నికి తిరువూరు బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి అక్కడ ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ అన్నట్టు పరిస్థితి మారిపోయింది. కేశినేని చిన్ని పై ఎమ్మెల్యే శ్రీనివాసరావు నిత్యం సంచలన ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. అయితే తిరువూరు ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు మాత్రం టిడిపి వెనుకడుగు వేస్తోంది.మరోవైపు మైలవరం నియోజకవర్గంలో కూడా తెలుగుదేశం పార్టీలో విభేదాలు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యేగా వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరారు. అంతకుముందు ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన వసంత కృష్ణ ప్రసాద్ దేవినేని ఉమామహేశ్వరరావు పై గెలిచారు. అయితే వసంత కృష్ణ ప్రసాద్ రాకతో దేవినేని ఉమామహేశ్వరరావు సీటు త్యాగం చేయాల్సి వచ్చింది. అయితే గెలిచిన తర్వాత వసంత కృష్ణ ప్రసాద్ వర్గం దేవినేని ఉమామహేశ్వరరావు వర్గాన్ని అణచివేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా దేవినేని ఉమామహేశ్వరరావుకు ఇప్పటివరకు నామినేటెడ్ పదవి సైతం లభించలేదు. దీంతో ఆయన వర్గంలో సైతం తీవ్ర అసంతృప్తి ఉంది. అందుకే అక్కడ తరచూ విభేదాలు తలెత్తుతున్నాయి.మరోవైపు కేశినేని సోదరులు ఇద్దరు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హీటెక్కిస్తున్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు టిడిపికి గుడ్ బై చెప్పారు కేసినేని నాని. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సోదరుడు చిన్ని చేతిలో ఓడిపోయారు. అంతకుముందు రెండు ఎన్నికల్లో టిడిపి తరఫున గెలిచిన నాని పదేళ్లపాటు ఎంపీగా కొనసాగారు. అయితే టిడిపి నాయకత్వం పట్ల మంచి భావం ఉన్న స్థానిక పరిస్థితుల వల్ల ఆయన వైసీపీలోకి జంప్ చేయాల్సి వచ్చింది. అయితే ఈ పరిస్థితికి కారణం తన సోదరుడు చిన్ని అని రగిలిపోతున్నారు నాని. అందుకే టిడిపి నాయకత్వానికి దగ్గరయ్యే క్రమంలో సోదరుడు చిన్ని పై సంచలన ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. అయితే కృష్ణాజిల్లాలో జరుగుతున్న ఈ విభేదాలను చెక్ పెట్టాల్సిన అవసరం నాయకత్వంపై ఉంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ...

## - యాక్టివ్ అవుతున్న బూత్ లెవల్ కమిటీలు

**హైదరాబాద్,(భారత శక్తి)** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతోనే అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర అప్రమత్తమయ్యాయి. తమ సానుభూతిపరుల ఓట్లు ఎక్కడైనా గంపగుత్తగా తొలగిపోతాయేమోననే భయంతో అన్ని రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను రంగంలోకి దించాయి. ఎన్నికల సంఘం సాధారణంగా ప్రతి ఏటా ఓటర్ల జాబితా సవరణ చేపడుతుంది. కానీ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది చాలా ప్రత్యేకమైనది. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, ఒకే ఓటరుకు రెండు మూడు చోట్ల ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి జాబితా నుండి పూర్తిగా తొలగిస్తారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్లను చేర్చుతారు.రాజకీయ పార్టీలకు ఈ ప్రక్రియ ఒక పెద్ద పరీక్ష లాంటిది. ఒక నియోజకవర్గంలో గెలుపోటములను కొన్ని వందల లేదా వేల ఓట్లు నిర్ణయిస్తుంటాయి. ఈ తీవ్రమైన ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో.. స్థానిక అధికారులు పొరపాటునో లేదా ఏకపక్షంగానో తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను వలస వెళ్లారు లేదా చిరునామా లేదు అనే నెపంతో తొలగిస్తే.. ఆ నష్టం పూడ్చలేనిది అవుతుంది. అందుకే ఓట్లు తగ్గిపోకూడదని, తమ క్యాడర్ ఓట్లు గల్లంతు కాకూడదని పార్టీలు విపరీతమైన టెన్షన్ పడుతుంటాయి.ఈ పరిస్థితిని తట్టుకోవడానికి ప్రతి పార్టీ తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను అప్రమత్తం చేస్తున్నాయి. ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారి ఇంటింటికీ తిరిగేటప్పుడు.. ఈ పార్టీ బీఎల్ఏలు కూడా వారితో పాటు తిరిగి, ఏ ఒక్క సానుభూతిపరుడి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపలా కాస్తారు. ఒకవేళ ప్రతిపక్ష ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులుంటే చనిపోయిన వారివి, డబుల్ ఓట్లు వాటిని తొలగించాలంటూ ఫామ్-7 ద్వారా అధికారులపై ఒత్తిడి తెస్తుంటారు. డిజిటల్ డేటా ద్వారా ఈ ప్రక్రియను పార్టీల ఐటీ విభాగాలు కూడా నిశితంగా గమనిస్తున్నాయి.సాంకేతికంగా ఓటు పోతే మళ్లీ చేర్పించుకోవడానికి ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. కానీ, ప్రాక్టికల్‌గా అది చాలా కష్టతరమైన ప్రక్రియ. ఒకసారి ఇంటెన్సివ్ రివిజన్ పూర్తయి, ఫైనల్ రోల్ విడుదలయ్యాక.. మళ్లీ ఓటు చేర్పించాలంటే సదరు ఓటరు వ్యక్తిగతంగా ఆసక్తి చూపించాలి. సాధారణంగా సాధారణ ఓటర్లు అంత శ్రద్ధ తీసుకోరు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి వేలాది మంది ఓట్లు పోయాయని గ్రహించినా.. అప్పటికప్పుడు లక్షలాది ఓట్లను తిరిగి చేర్పించడం ఏ రాజకీయ పార్టీకైనా అసాధ్యమైన టాస్క్. అందుకే నివారణే మేలు అన్నట్లు ముందే అలర్ట్ అవుతారు.ఇక్కడ అసలు ట్విస్ట్ ఉంది. సిద్ధాంతపరంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కావాలని అన్ని పార్టీలు పైకి చెప్తాయి. కానీ, క్షేత్రస్థాయి ప్రాక్టికల్ రాజకీయాల్లో ఏ పార్టీకి కూడా వంద శాతం క్లీన్ లిస్ట్ ఇష్టం ఉండదు. ఎందుకంటే, ప్రతి నియోజకవర్గంలోనూ దొంగ ఓట్లు , డబుల్ ఓట్లు లేదా చనిపోయిన వారి ఓట్లు తమకు అనుకూలంగా పోల్ అవుతాయని స్థానిక లీడర్లు నమ్ముతారు. తమకు అనుకూలమైన దొంగ ఓట్లను కాపాడుకుంటూ.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నకిలీ ఓట్లను తొలగించాలనే ద్వంద్వ నీతి ని అన్ని పార్టీలు అవలంబిస్తుంటాయి. ఓటర్ల జాబితా అనేది ప్రజాస్వామ్యానికి పునాది. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఎన్నికల సంఘం నకిలీ ఓట్లకు గండి కొట్టాలని చూస్తుంటే.. రాజకీయ పార్టీలు మాత్రం తమ ఓటు బ్యాంకు చెదరకుండా చూసుకునే వ్యూహాల్లో మునిగిపోయాయి. ఈ ప్రక్రియ ముగిసేసరికి ఏ పార్టీ తన బూత్ స్థాయి యంత్రాంగాన్ని సమర్థవంతంగా వాడుకుంటుందో.. ఆ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా ముందంజలో ఉంటుంది.

# లైన్‌లో పెద్దిరెడ్డి ఉన్నారా

**తిరుపతి,(భారత శక్తి)** వైసీపీ నాయకులు.. చాలా మందిపై కూటమి ప్రభుత్వం వచ్చాక కేసులు నమోదైన విషయం తెలిసిందే. మద్యం కుంభకోణంలో 3500 కోట్ల రూపాయల మేరకు బొక్కేశారన్న కేసు ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. జగన్ అప్పటి పీఏ.. కె, నాగేశ్వరరావుపై ప్రస్తుతం దృష్టిపెట్టారు. ఇక, అప్పట్లోనే జరిగిన మరిన్ని వివాదాలు.. హత్యలు.. శవం డోర్ డెలివరీ కేసులు.. నాయకులను వెంటాడుతున్నాయి. ఈ పరంపరలో ఇప్పుడు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంతు వచ్చింది వైసీపీ హయాంలో పంచాయతీ, అటవీశాఖ మంత్రిగా పెద్దిరెడ్డి వ్యవహరించారు. ఆ సమయంలో కేంద్ర నిధులతో పంచాయతీల్లో రహదారులువేసే పనులు చేపట్టారు. ఇవి రాష్ట్ర వ్యాప్తంగాసాగాయి.

ఆయా జిల్లాలో వైసీపీకి చెందిన వారు కాంట్రాక్టులు దక్కించుకున్నారన్నది తెలిసిందే. అయితే.. ఇప్పుడు కేంద్రం నుంచి పనుల నాణ్యతపై సందేహాలు వచ్చాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో రహదారులు పాడయ్యాయని.. ప్రస్తుతం పంచాయతీ రాజ్ అధికారులు కేంద్రానికి లేఖలుపంపారు.అయితే... తాము నిధులు ఇచ్చి, ఆయా పనులు చేపట్టి .. కేవలం నాలు గేళ్లు కూడా కాకుండానే ఎందుకు పాడయ్యాయని.. వీటిపై విచారణ చేయాలని కేంద్రం నుంచి రాష్ట్రానికి తాఖీదు అందింది.

దీంతో పెద్దిరెడ్డి జమానాలో చేపట్టిన రహదారుల నిర్మాణం. ముఖ్యంగా ఆయన సొంత నిర్మాణ సంస్థ పీఎల్ఆర్ దక్కించుకున్న కాంట్రాక్టులు.. చేపట్టిన పనులు వంటివాటిపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టారు. ఈ మొత్తం వ్యవహారంలో 500 కోట్లరూపాయల మేరకు.. నిధులు సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు వున్నాయి అప్పట్లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాలపై ఎన్నో ఊహాగానాలు చెలరేగగా, దాదాపు నాలుగేళ్ల తర్వాత లలిత్ మోదీ తమ బ్రేకప్ వెనుక ఉన్న అసలు నిజాన్ని బహిరంగంగా వెల్లడించారు. తన సొంత జిల్లా చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి సంస్థ చేపట్టిన పనులు నాసిరకంగా ఉండడం.. ఇక్కడి రహదారులు రెండేళ్లకే ధ్వంసం కావడంతో ఆయా పనులపై విచారణ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనిలో అవకతవకలు భారీగానే జరిగాయని విజిలెన్స్ అధికారులు భావిస్తున్నారు. దీనికితోడు కాంట్రాక్టర్ల ను కూడా బెదిరించి.. పీఎల్ ఆర్ సంస్థకే అన్ని పనులు కట్టబెట్టారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్దిరెడ్డిపై చర్యలు ఖాయమని.. నిజాలు నిగ్గుతేలుతాయని చిత్తూరు రాజకీయ వర్గాలు అంటున్నాయి. కాగా.. గత ఏడాది అటవీ భూములు ఆక్రమించుకున్నారని.. పవన్ కల్యాణ్ విమర్శలు చేసినప్పటికీ.. వాటిపైచర్యలు ఏమయ్యాయో.. ఇప్పటికీ అంతుచిక్కడం లేదు.

# పెమ్మసాని ఔట్...

**గుంటూరు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో మంత్రి నారాయణ మాత్రమే అంతా చూసుకుంటారు. ఆయన పర్యవేక్షణలోనే పనులు జరగాలి. మంత్రి నారాయణ కూడా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాత్రం ఇక్కడ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది.

పెమ్మసాని తప్పుకున్నారా?. తప్పించారా? అన్న చర్చ టీడీపీ వర్గాల్లోనే జరుగుతుంది. అమరావతి రాజధాని లో రైతుల నుంచి భూమిని సేకరించాలంటే కేంద్ర మంత్రి పెమ్మసాని వచ్చి రైతులకు కొంత నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయితే నారాయణ మాత్రం పెమ్మసాని జోక్యాన్ని పెద్దగా ఇష్టపడటం లేదని తెలిసింది. ఈ విషయాన్ని గ్రహించిన నాయకత్వం పెమ్మసానికి ఏవైనా పరోక్షంగా ఆదేశాలిచ్చిందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.2014లోనూ మంత్రి నారాయణ అంతా తానే అయి అమరావతి పనులను చూశారు. నాడు రాష్ట్రమంత్రి పత్తిపాటి పుల్లారావు కూడా తోడుగా ఉన్నారు. మరొక విషయం ఏంటంటే...మంత్రి నారాయణపై చంద్రబాబు, లోకేశ్ పై అపార నమ్మకం ఉంది. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా పూర్తి చేస్తారన్న విశ్వాసం ఉంది. మంత్రి నారాయణకు, చంద్రబాబు కుటుంబానికి సంబంధం ఈనాటిది కాదు. కొన్ని దశాబ్దాలుగా వారి మధ్య నమ్మకమైన మైత్రి నడుస్తుంది. అయితే అమరావతి రాజధాని నిర్మాణంలో మరొకరు క్రెడిట్ కొట్టేయడానికి మంత్రి నారాయణ ఇష్టపడటం లేదని తెలిసింది. మంచైనా, చెడైనా తానే చూసుకుంటానన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

చంద్రబాబు, లోకేశ్ లు కూడా రాజధాని అమరావతి పనుల విషయంలో మంత్రి నారాయణకే పూర్తి బాధ్యతలను అప్పగించారు. అలాగే ఏ విషయం ఉన్నా నారాయణతోనే చర్చిస్తున్నారు. అందుకే అమరావతి రాజధాని పనుల పర్యవేక్షణ, భాధ్యతలనుండి నుంచి, కేందమంత్రి పెమ్మసాని తెలివిగా తప్పుకున్నారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అధికారులు కూడా మంత్రి నారాయణ మాటకు మాత్రమే విలువ ఇస్తుండటంతో ఇక తన అవసరం ఇక్కడ లేదని పెమ్మసాని చంద్రశేఖర్ తనంతట తానుగానే అమరావతి పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పుకున్నారన్న చర్చ టీడీపీ వర్గాల్లోనూ నడుస్తుంది. అందుకే అమరావతి రాజధాని ప్రాంతాలలో కేంద్ర మంత్రి పెమ్మసాని హడావుడి పూర్తిగా కన్పించడం మాయమైందంటున్నారు. మరి ఇందులో నిజానిజాలు మాత్రం తెలియదు. ప్రచారం మాత్రం ఇలాగే జరుగుతుంది.

# పాపం..దీదీ...

## నిట్టనిలువునా చీలనున్న పార్టీ

**కోల్ కత్తా (భారత శక్తి)** రాజకీయాల్లో సొంతవాళ్ల తిరుగుబాటును ఎదుర్కోవడం ప్రత్యర్థులను ఎదుర్కోవడంకన్నా కష్టం. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పదవిని కోల్పోయిన మమతా బెనర్జీ ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు.

మూడు దశాబ్దాలుగా బెంగాల్ రాజకీయాల్లో అప్రతిహత శక్తిగా నిలిచిన ఆమెకు ఈసారి సవాలు సొంత పార్టీ నుంచే వస్తోంది. ఏకంగా పార్టీని నిట్టనిలువునా చీల్చేంతగా పెరుగుతోంది.ఇప్పటివరకు మమతా బెనర్జీ ఎదుర్కొన్న ప్రతి రాజకీయ సంక్షోభంలో ప్రత్యర్థి స్పష్టం. ఒకప్పుడు కమ్యూనిస్టులు, తర్వాత బీజేపీ. కానీ ఇప్పుడు ఆమె ఎదుట నిలబడిన వారు ఆమె స్వయంగా పెంచి పోషించిన నాయకులే. అందుకే 2026 సంక్షోభం మమత రాజకీయ జీవితంలో ఎదుర్కోబోయే అతిపెద్ద సవాలు కానుంది. మమతా బెనర్జీ రాజకీయ జీవితం భారత రాజకీయాల్లో అరుదైన కథ. కోల్‌కతాలోని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆమెకు రాజకీయ వారసత్వం లేదు. ఆర్థిక బలం లేదు. ఉన్నదల్లా అసాధారణమైన పోరాట పటిమ మాత్రమే.కాంగ్రెస్ విద్యార్థి విభాగంలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మమత, ఓ దశలో ఆపార్టీ సీనియర్లతోనే విభేదించి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఆ గొడవలో మమతపై భౌతిక దాడికూడా జరిగింది. కానీ దేనికీ వెరవకుండా కాంగ్రెస్ కి ప్రత్యామ్నాయంగా ఎదిగారు. ప్రత్యక్ష ఉద్యమాలకు ప్రతీకగా మారారు. కమ్యూనిస్టు పాలనకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.1998లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పుడు చాలామంది ఆమెను తేలిగ్గా తీసిపారేశారు.

ప్రతిపక్షమంటే కాంగ్రెస్ కాదు తృణమూల్ కాంగ్రెస్ అనేలా ఎదిగారు . చివరికి 2011లో 34 ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు ముగింపు పలికి చరిత్ర సృష్టించారు. అది కేవలం అధికార మార్పు కాదు. బెంగాల్ రాజకీయాల్లో ఓ సంచలన పరిణామం.మమత విజయానికి ప్రధాన కారణం ఆమె వ్యక్తిత్వం. కన్యాశ్రీ, విద్యార్థి స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఆమెపై ప్రత్యేకమైన అనుబంధాన్ని సృష్టించాయి. ప్రజలు తృణమూల్ కాంగ్రెస్‌ను కాకుండా "దీదీ"ని విశ్వసించారు. అదే సమయంలో పార్టీ నిర్మాణం కూడా మమత చుట్టూనే తిరిగింది. నిర్ణయాలు, వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, రాజకీయ దిశ?అన్నీ దీదీ నే కేంద్రంగా పనిచేసాయి.ఈ విధానం అధికారంలో ఉన్నప్పుడు పార్టీకి బలంగా పనిచేసింది. ఇప్పుడు ఆమె నాయకత్వానకీ, నిర్ణయాధికారానకీ అదే సవాలుగా మారింది. వారసుడు అభిషేక్ బెనర్జీకి శాపంగా మారింది. మమత రాజకీయ జీవితంలో సంక్షోభాలు కొత్తవి కావు. విధ్యార్థినాయకురాలిగా రాజకీయ ప్రవేశం చేసినప్పటినుంచీ ప్రతీ స్థాయిలోనూ ఇదే ఆమెకు చివరి ఘట్టం అన్నంత పెద్ద సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతీ సారీ ధైర్యగా ఎదుర్కొన్నారు. ప్రతీ సారీ మరో మెట్టు ఎదిగారు. సింగూర్ ? నందిగ్రామ్ ఉద్యమాల సమయంలో మమత మరీ పెట్టుబడులకు వ్యతిరేకంగాపోతున్నారు. కమ్యూనిస్టులే పరిశ్రమలను ప్రోత్సహిస్తుంటే భూములు, నిర్వాసితులు అనే నినాదం పనిచేయదు .. వ్యతిరేకత వస్తుందన్నారు.

కానీ ఆపోరాటంతోనే కమ్యూనిస్టులను మట్టికరిపించారు. నందిగ్రామ్ పరాజయం ? 2021 : తన రాజకీయ ప్రతిష్టకు ప్రతీకగా మారిన నందిగ్రామ్‌లో సువేందు అధికారికి ఓడిపోయినప్పుడు మమత రాజకీయంగా బలహీనపడతారని విశ్లేషణలు వచ్చాయి. కానీ అదే ఎన్నికల్లో తృణమూల్ 200కు పైగా స్థానాలు గెలుచుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. ఓటమిని విజయంగా మార్చుకోవడంలో మమత మరోసారి సత్తా చాటారు.ఆర్జీ ఖర్ ఆస్పత్రి ఘటన : 2024లో జరిగిన వైద్య విద్యార్థిని హత్య కేసు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది. భారీ నిరసనలు జరిగాయి. అయినప్పటికీ మమత రాజకీయంగా నిలబడగలిగారు. అందుకే ఆమె రాజకీయ ప్రస్థానాని దగ్గరగాచూసిన వాళ్లు చెబుతారు.. సవాళ్లంటే మమతకు మరో మెట్టు అని.ఈసారి మమత ఎదుర్కొంటున్న సమస్య బయట శత్రువు కాదు.. పార్టీలో అంతర్గతంగా ఉన్న వ్యక్తులే.. గతంలో సువేందు అధికారి తనను ఎదిరించిప్పుడు, బీజేపీ 2021లోనే తన రాజకీయ పతనానికి అన్ని యత్నాలూ చేసినప్పుడు ఎదురొడ్డి నిలిచారు.

కానీ ఈసారి సమస్య అత్యంత పెద్దది. పార్టీ ఎమ్మెల్యేలలో దాదాపు 60 మంది తిరుగుబాటు చేయడం బెంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఏకంగా పార్టీ మొత్తాన్నే చీల్చేంతగా.. అసలు పార్టీనే మాది అనేంత పెద్దది. ఇది కేవలం నాయకత్వంపై అసంతృప్తి మాత్రమే కాదు. ఇది పార్టీ భవిష్యత్తుపై అనిశ్చితి. ఏడు పదులు దాటిన ఓ రాజకీయ యోధురాలి పోరాట పఠిమకు మరో పరీక్ష.

### మరి ఈసారి తట్టుకుని నిలబడగలదా ?

బెంగాల్ రాజకీయాల్లో భావోద్వేగాలు, ప్రాంతీయ భావం, వ్యక్తిత్వ రాజకీయాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ మూడు అంశాల్లోనూ మమత ఇప్పటికీ తిరుగులేని నాయకురాలే. బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో అసంతృప్తిని కలిగించే నిర్ణయాలు తీసుకుంటే, ప్రతిపక్ష నాయకురాలిగా మమతకు మళ్లీ అవకాశాలు రావచ్చు. మైనారిటీల మద్దతు ఎప్పటికీ మమతకే అదే సమయంలో వయసు, పార్టీ విభేదాలు, అవినీతి ఆరోపణలు, నాయకత్వంపై ప్రశ్నలు ఆమెకు ప్రతికూలంగా మారే అవకాశం కూడా ఉందిఅందుకే బెంగాల్ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరి మదిలో ఒకే ప్రశ్న వినిపిస్తోంది? ఇది దీదీ రాజకీయ ప్రస్థానానికి అస్తమయమా? లేక మరోసారి ఆమె పునరాగమనానికి ముందు నిశ్శబ్దమా?

# ఆశలు రేపుతున్న చంద్రయాన్ రిపోర్ట్

**బెంగళూరు, (భారత శక్తి)** చంద్రయాన్-2 ల్యాండర్ ఫెయిల్ అయిందని ఒకప్పుడు నిరాశపడిన వారికి, అలాగే అంతరిక్ష రేసులో పోటీపడుతున్న ప్రపంచ దేశాలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ( మైండ్ బ్లాంక్ అయ్యే న్యూస్ చెప్పింది. ల్యాండర్ క్రాష్ అయినా, గత ఏడేళ్లుగా చంద్రుడి చుట్టూ సైలెంట్‌గా తిరుగుతున్న 'చంద్రయాన్-2 ఆర్బిటార్' ఇప్పుడు ఒక సంచలన విషయాన్ని కనిపెట్టింది. సౌర కుటుంబంలోనే అత్యంత రహస్యమైన, సూర్యరశ్మి అస్సలు పడక మైనస్ 248 డిగ్రీల గడ్డకట్టే చలి ఉండే చంద్రుని దక్షిణ ధ్రువంలో భారీగా మంచు నిల్వలు ఉన్నట్లు పక్కా ఆధారాలతో కనిపెట్టింది.అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు ఆర్బిటార్ పంపిన డేటాను లోతుగా విశ్లేషించి ఈ నిజాన్ని ప్రపంచం ముందుంచారు. చంద్రయాన్-2 ఆర్బిటార్‌లోని 'డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్' ఈ అద్భుతాన్ని సుసాధ్యం చేసింది. ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీలలో పనిచేసే ఈ అత్యాధునిక పరికరం చంద్రుడి ఉపరితలం కింది భాగంలోకి మైక్రోవేవ్ సంకేతాలను పంపి చీకటి గుట్టును రట్టు చేసింది. సాధారణ రాళ్లు, దుమ్ము కంటే మంచు ఈ రాడార్ సంకేతాలను భిన్నంగా వెనక్కి (పరావర్తనం) పంపుతుంది.

దీని ఆధారంగా దక్షిణ ధ్రువంలోని డబ్లీ షాడోడ్ క్రేటర్ల కింద బిలియన్ల సంవత్సరాల నాటి మంచు ఉన్నట్లు స్పష్టమైంది.శాస్త్రవేత్తలు పరిశోధించిన తొమ్మిది భారీ గుంతలలో.. 'ఫాస్టిని క్రేటర్' లోపల ఉన్న 1.1 కిలోమీటర్ల వ్యాసం గల ఒక చిన్న గుంతలో ఈ మంచుకు సంబంధించిన అత్యంత బలమైన ఆధారాలు లభించాయి. అయితే ఈ మంచు నేరుగా చంద్రుడి (ఓనీనిని) ఉపరితలంపై లేదు. భవిష్యత్తులో వ్యోమగాములు సులభంగా సేకరించడానికి వీల్లేకుండా, లోపల భూగర్భంలో భద్రంగా దాగి ఉంది. కోట్ల ఏళ్ల క్రితం ఒక ఉల్క చంద్రుడిని బలంగా ఢీకొట్టినప్పుడు, లోపల ఉన్న మంచు నిల్వలు ద్రవరూపంలోకి మారి పక్కకు ప్రవహించి, మళ్లీ అక్కడే గడ్డకట్టుకుపోయినట్లుగా ఉన్న ప్రత్యేక ఆకారాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు.భూమి మీద నుంచి అంతరిక్షంలోకి నీటిని, ఇంధనాన్ని మోసుకెళ్లడం అత్యంత ఖర్చుతో కూడుకున్న పని.

కానీ ఇప్పుడు చంద్రుడిపై (ఓనీనిని) దొరికిన ఈ మంచును రసాయన ప్రక్రియల ద్వారా స్వచ్ఛమైన తాగునీరుగా, వ్యోమగాములు పీల్చుకునే ఆక్సిజన్‌గా, చివరికి రాకెట్ ఇంధనంగా కూడా మార్చుకోవచ్చు! ఈ అద్భుతమైన అవకాశం వల్లే ఇప్పుడు అమెరికా నాసా (ఔయాం) ఆర్టెమిస్ ప్రోగ్రామ్, చైనా లూనార్ మిషన్లు అన్నీ కూడా చంద్రుని దక్షిణ ధ్రువంపైనే కన్నేశాయి.కానీ ఆ అగ్రరాజ్యాల కంటే ముందే అక్కడి అణువణువు రహస్యాలను ఇస్రో పసిగట్టి ప్రపంచ అంతరిక్ష రేసులో తన సత్తా చాటింది. 2023లో చంద్రయాన్-3 సృష్టించిన చారిత్రక (ఓనీనిని) ల్యాండింగ్ విజయానికి, ఇప్పుడు చంద్రయాన్-2 ఆర్బిటార్ అందిస్తున్న ఈ డేటా తోడవడంతో గ్లోబల్ స్పేస్ సెక్టార్‌లో భారతదేశం తిరుగులేని శక్తిగా అవతరించిందని విశ్లేషకులు అంటున్నారు.

# ఆగని జాగీర్ లొల్లి..

**హైదరాబాద్,(భారత శక్తి)** చిలికి చిలికి గాలివానలా మారిందన్న మాటకు తగ్గట్లే ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు మొదలయ్యాయి.తాజాగా తెలంగాణ సెంటిమెంట్ ను పెద్ద ఎత్తున రాజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే పలు రాజకీయ పార్టీలు ఎవరికి వారు గళాన్ని విప్పుతున్నారు.

ఈ సందర్భంలోనే జనసేన గచ్చిబౌలిలో రెండు వేల మందితో సభను నిర్వహించాలని భావించిన జనసేనాని అందుకు తగ్గట్లే పోలీసు పర్మిషన్ కోసం ప్రయత్నించటం.. అందుకు పోలీసులు నో చెప్పటం తెలిసిందే. కోర్టు సైతం సానుకూలంగా స్పందించని నేపథ్యంలో.. తన ఇంటి వద్దే మీడియా భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎవరబ్బ జాగీర్ కాదంటూ గళం విప్పారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మిస్టర్ పవన్ కల్యాణ్.. తెలంగాణ తమ జాగీర్ అని.. ఇంకెవరిది కాదని తేల్చేశారు. పవన్ నోటి నుంచి వచ్చిన జాగీర్ మాటపై అభ్యంతరం వ్యక్తం చేయటం తెలిసిందే. తాజాగా బీఆర్ఎస్ ముఖ్యనేత కేటీఆర్ సైతం పవన్ వ్యాఖ్యల్ని వ్యతిరేకించారు.

ఇదంతా ఓకే అనుకునే వేళలో.. కొన్ని సందేహాలు తెర మీదకు వచ్చాయి. బరాబర్.. తెలంగాణ ఎవరి జాగీర్ అనే దానికి తెలంగాణ నేపథ్యం ఉన్న నాలుగున్నర కోట్ల మందిది తెలంగాణ జాగీర్ గా పేర్కొన్నారు. అంటే.. తెలంగాణ అన్నది తెలంగాణ నేటివ్ వాళ్లదే అనే వాదనను ప్రశ్నించాల్సిన అవసరం లేదు. కాకుంటే.. ఒకే ఒక్క సమస్య తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణను వ్యతిరేకించిన గళాలు ఉండనే ఉన్నాయి. మరి.. వారిది కూడా తెలంగాణ జాగీరేనా? అన్నది ప్రశ్న. ఎందుకంటే..తెలంగాణ ఉద్యమ సమయంలో కొత్త రాష్ట్ర ఏర్పాటును సుతారం ఒప్పుకోకపోవటమే కాదు.. వ్యతిరేకిస్తూ ఓపెన్ గా మాట్లాడేసిన సీపీఎంతో పాటు మజ్లిస్ పార్టీల సంగతేంటి? ఆ పార్టీల అధినేతలు.. కీలకనేతలు.. కార్యకర్తలు.. ఇతరులు అందరూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారే కదా? సీపీఎం గురించి మళ్లీ ప్రస్తావించాల్సిన అవసరం లేదు.

## ఈ నెల 11న జరిగే వ్యకాస జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

**- జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్**




మణుగూరు, జూన్ 07 (భారతశక్తి): తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ జిల్లా మహాసభలు మణుగూరు పట్టణంలో ఈనెల 11న జరుగుతున్నాయని అధిక సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రామిక భవనంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలకు మణుగూరు పట్టణం వేదిక కాబోతుందన్నారు. ఈనెల 11 న గురువారం కిన్నెర కళ్యాణ మండపంలో మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ బి వెంకట్ హాజరు కాబోతున్నారన్నారు. వ్యవసాయ కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. పాలకుల అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాల పోరాటంలో వ్యవసాయ కార్మిక సంఘం అగ్ర భాగాన నిలుస్తుందన్నారు. కూలీలు, శ్రామిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందన్నారు. కూలి రేట్ల పెంపుదలతో కూలీలకు అండగా నిలిచిందన్నారు. ప్రజల పక్షాన నిలిచి పోరు చేసే వ్యవసాయ కార్మిక సంఘాన్ని అన్ని రంగాల ప్రజలు బలపరిచి మద్దతు తెలపాలని అన్నారు. పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసులకు అటవీ హక్కులు కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, మండల కన్వీనర్ కొడిశాల రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల నాగమణి, నైనారపు నాగేశ్వరరావు, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కోండ్రు గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ గింజ కొనే వరకు పోరాడుతా

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి**



**జనగామ(భారతశక్తి)జూన్ 7:** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి తమ గోడు వెళ్ళబోసుకున్న పాలకుర్తి మండలం,ఈరవెన్ను గ్రామ రైతులు.పండించిన ధాన్యం అమ్మడానికి పడరాని పాట్లు పడుతున్నామని,నెలలకొద్ది ఈ ఎండలో పడి చస్తున్నామని,బస్తాలు కూడా సరిగా ఇవ్వట్లేదని,లారీలు కూడా లేవని ట్రాక్టర్లలో పండిన పంటని తరలించేందుకు బస్తాకు 5 రూపాయలు వసూలు చేస్తున్నారని రైతులు తమ గోస వెళ్ళబుచ్చారు. వెంటనే స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈరవెన్ను గ్రామానికి వెళ్ళి ధాన్యం కొనుగోలు సెంటర్ పరిశీలించి అధికారులతో మాట్లాడి తమ సమస్యలు పరిష్కారం చూపుతానని రైతులకు భరోసా నిచ్చారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా రైతులను ఇబ్బందులు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి తగదని,ప్రభుత్వం మెడలు, వంచైన,రైతుల పక్షాన ఉద్యమిస్తాం, ప్రతి గింజ కొనే వరకు పోరాడుతామని,ఎర్రటి ఎండలో,రైతులను చూస్తే రేవంత్ రెడ్డి కి గోస అనిపిస్తా లేదా?ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు,ఎరువులు ఇవ్వలేకపోతోందని,సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదని,ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని,రైతులు 2 నెలల నుంచి పడిగాపులు కాస్తున్నామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని,ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని,సరిగా లారీలు లేక బస్తా సంచులేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని,వడ్లు ఇంకా రోడ్ల మీదనే ఉన్నాయని,ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వడ్లు కొనుగోలు వేగవంతం చేసి రైతులని ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**భారత శక్తి న్యూస్, ఎల్లారెడ్డిపేట, జూన్ 7:**ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసు పట్టుకున్నారు. గ్రామంలోని వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు.

## గోరి కొత్తపల్లి మండల సర్పంచ్‌ల ఫోరం ఎన్నిక

**- అధ్యక్షురాలుగా నిజాం పల్లె సర్పంచ్ నాన్రె సునీత రవీందర్ నియామకం**





రేగొండ,జూన్7(భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా నాన్రే సునీత - రవీందర్ ను సర్పంచులు అభిప్రాయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గోరి కొత్తపల్లి మండల పరిధి 14 గ్రామ పంచాయతీల సర్పంచ్లు ఆదివారం సుల్తాన్పూర్ రైతువేదిక భవనంలో సర్పంచ్ ల ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా నిజాం పల్లె గ్రామానికి చెందిన సర్పంచి నాన్రె సునీత రవీందర్ ఎన్నుకోగా గోరి కొత్తపల్లి, మండల కేంద్రానికి చెందిన సర్పంచి నిమ్మల శంకర్ ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా రోడ్డ కిరణ్ , కోశాధికారిగా కాడ వేణి సరిత యుగేందర్ కార్యవర్గ సభ్యులుగా జక్కుల మానస సాంబయ్య, నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు,జిల్లెల్ల సామెల్, సాదు సుమలత ధర్మేందర్, బొజ్జం మమత సురేష్ సోషల్, మీడియా ఇన్చార్జిగా జువ్వాజీ రమేష్, సలహాదారులుగా కాసెట్టి సక్కుబాయి రాజయ్య, పల్లెవేన బిక్షపతి ల పూర్తి కార్యవర్గాన్ని సర్పంచుల ఆమోదం మేరకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధి సర్పంచులు తోట్ల తిరుపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ చిట్టి, వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

**-రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్**



మణుగూరు, జూన్ 07 (భారతశక్తి): మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నడిపిస్తున్న ప్రవేట్ చిట్టీ, వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రేణుకా అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ డిమాండ్ చేశారు. ఆదివారం రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో రేణుకా అక్షర మహిళ మండలి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని అక్రమంగా ప్రవేట్ చిట్టీ, వడ్డీ వ్యాపారుల దందా జోరుగా సాగిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. వడ్డీ వ్యాపారులు, అక్రమంగా నిర్వహించే ప్రైవేటు చిట్టీల నిర్వాహకులు ఎవరినైనా ఇబ్బందులకు గురిచేస్తే తమను సంప్రదించాలని కోరారు. అక్రమ వ్యాపారులపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, బడిశా పార్వతి, హేమలత, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై అధికారుల నిర్లక్ష్యం

**- టాస్క్ ఫోర్స్ కమిటీ ఏమైంది?: సీపీఎం సిరిసిల్ల కార్యదర్శి రాజశేఖర్**




**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 7:** సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని కార్మిక భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో సెల్లార్ నిర్మాణాలకు అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నా పార్కింగ్ స్థలం వదలడం లేదని ఆరోపించారు. ఇంటి నిర్మాణ అనుమతులతో కమర్షియల్ భవనాలు కడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, పోలీస్, అగ్నిమాపక శాఖలతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ ఏమైందని ఆయన నిలదీశారు. కనీసం ఆ కమిటీ కార్యకలాపాలు ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు. పట్టణంలోని పలు వార్డుల్లో మురికి కాలువలపైనే ఆక్రమణలు జరుగుతున్నా ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మిట్టపెల్లి రాజమల్లు, సిరిమల్లె సత్యం, సూరం పద్మ, వి. కమలాకర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**-సమ్మర్ స్పెషల్ క్యాంపు ముగింపు వేడుకల్లో డీఎస్పీ నాగేంద్ర చారి**




**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 7:** సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ స్పెషల్ క్యాంపు ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ నాగేంద్ర చారి, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి హాజరయ్యారు. అతిథులు విద్యార్థులకు టీ-షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించాలని, తద్వారా శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతారని సూచించారు. క్రమశిక్షణతో కూడిన క్రీడలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని ఆయన పేర్కొన్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన క్యాంపు ఫైర్, నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో షణ్ముఖ బ్యాంక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ గోక శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, కోచ్‌లు సాయికుమార్, అశోక్, మహేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేములవాడలో భక్తుల సందడి

**- భీమేశ్వరాలయంలో పోటెత్తిన భక్తజనం.**



**భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 7:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ భారీగా నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో, సెలవుల్లో చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని వేలాదిమంది భక్తులు తరలివచ్చారు.ఆలయ ప్రాంగణం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడింది.స్వామివారిని దర్శించుకున్న భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా తలనీలాల సమర్పణ, అభిషేకం, అన్నపూజ, ఆకుల పూజ, నిత్య కళ్యాణం, చండీ హోమం, సత్యనారాయణ వ్రతం, లింగార్చన, కుంకుమ పూజ వంటి విశేష పూజల్లో పాల్గొని తరించారు. భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవతగా వెలసిన శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారిని కూడా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించి ఆశీస్సులు పొందారు.వేసవి నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. తాగునీరు, క్యూ లైన్లు, దర్శన సౌకర్యాలు, పరిశుభ్రతపై ఆమె ప్రత్యేక శ్రద్ధ వహించారు. క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తూ, అధికారులకు తగు సూచనలు చేశారు. ఏఈవోలు జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, భద్రతా సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. అధికారులు, ఉద్యోగుల నిరంతర పర్యవేక్షణతో ఏర్పాట్లు విజయవంతమయ్యాయి.

## వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**వేములవాడ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 7:** ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని ఆదివారం అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈవోలు జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్లు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకుని ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించినట్లు ఆయన తెలిపారు.దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ క్షేత్రం ఆధ్యాత్మిక వైభవానికి నిలయమని, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy